

STAY UPDATED IN REAL-TIME WITH OUR WHATSAPP CHANNEL

GST NO: 36ACPPF9587L2ZM
TELTEL/2013/53323

# సమయజ్యోతి

ప్రతీ అక్షరం – ప్రజలకోసం
తెలుగు దిన పత్రిక
CELEBRATING 12TH YEAR ANNIVERSARY

సంపుటి : 12 సంచిక : 111 పేజీలు : 12 ఆదిలాబాద్ వెల రూ : 01 శనివారం 05 జూలై 2025 ఎడిటర్ : ఫైసల్ ఖాన్


1959 - 2024
దివంగత షఫీఉల్లా ఖాన్
మాజీ మేనేజింగ్ ఎడిటర్

## ఇచ్చిన హామీలను అమలు చేస్తున్న

# ఘనత తమదే



- రైతు సంక్షేమంపై చర్చిద్దాం రండి
- ఢిల్లీలో ఉండే మోడి...గల్లీలో ఉండే కెడీ అయినా చర్చకు సిద్ధం
- కేవలం 9 రోజుల్లో 9 వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ
- ఏడాదిలో 60వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశాం
- ఎల్బీ స్టేడియం సామాజిక సదస్సులో సిఎం రేవంత్

2 లో

హైదరాబాద్,జులై 4(సమయజ్యోతి):

ఢిల్లీలో ఉండే మోడీ అయినా, గల్లీలోని కేడీ అయినా.. రైతు సంక్షేమం విషయంలో తేల్చుకునేందుకు రండి, సవాళ్లకు సిద్ధమని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ క్రమంలో బీఆర్ఎస్, బీజేపీ నేతలకు గట్టి సవాల్ విసిరారు. కేవలం 9 రోజుల్లో 9 వేల కోట్ల రూపాయలను రైతుల ఖాతాల్లో జమ చేసి, వ్యవసాయాన్ని దండుగ నుంచి పండుగగా మార్చిన ఘనత తమదంటూ రేవంత్ రెడ్డి గర్వంగా వెల్లడించారు. 24 గంటల ఉచిత కరెంట్, రుణమాఫీ సహా రైతు సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేసి తెలంగాణ వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసినట్లు తెలిపారు. ఇచ్చిన హామీ మేరకు ఏడాదిలో 60వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశామని అన్నారు. ఇది కాదని నిరూపించ గలరా అని సవాల్ చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయ సమరభేరి సభలో భాగంగా పార్టీ నేతలు, కార్యకర్తలను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు.


02

# ఆత్మాభిమానం మన ఆయుధం

- బ్రిటిష్ వారిని ఈ ఆయుధంతో గడగడలాండించిన అల్లూరి
- ఆయన జీవితం భావి తరలాకు స్ఫూర్తి కావాలి
- అల్లూరి జయంతి సభలో రక్షన మంత్రి రాజ్‌నాథ్ సింగ్

హైదరాబాద్,జులై4(సమయజ్యోతి):

చాలా మంది యోధులు చిన్న వయసులోనే స్వాతంత్య్రం కోసం ప్రాణాలు వదిలారని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. చంద్రశేఖర్ ఆజాద్, అల్లూరి సీతారామరాజు వంటి వాళ్ళు ఎంతోమంది తమ ప్రాణాలు వదిలారు.. భారత స్వాభిమానం, తెలుగు రాష్ట్రాల్లోగుర్తుగా నిలిచిపోయారు.. అల్లూరి కేవలం పోరాట యోధుడే కాదు ప్రజలు కోసం అన్ని కోల్పోయిన నాయకుడు గుర్తుకు వస్తాడని అన్నారు. ఎలాంటి ఆయుధాలు లేని సమయంలో గిరిజనులను ఏకం చేసి బ్రిటిషర్లపై పోరాడిన వీరుడని అన్నారు. సాంస్కృతిక ఆత్మ భారతదేశాన్ని ఐక్యంగా ఉంచుతుంది.. అల్లూరి పేరు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ కే కాదు దేశం మొత్తం గుర్తింపు ఉంది.. ఆడవుల నుంచి పుట్టిన పోరాటాలు ఇప్పటికీ గుర్తున్నాయి.. దశాబ్దాల పోరాటాలకు ఆయన మార్గదర్శనం చేశారు..



# మోడీకి ట్రినిడాడ్ అత్యున్నత పౌర పురస్కారం

## ది ఆర్డర్ ఆఫ్ ది రిపబ్లిక్ ఆఫ్ ట్రినిడాడ్, అండ్ టొబాగో తో సత్కారం

న్యూఢిల్లీ,జూలై4(సమయజ్యోతి):

భారత ప్రధాని నరేంద్ర మోడీకి ట్రినిడాడ్ అత్యున్నత పౌర పురస్కారం 'ది ఆర్డర్ ఆఫ్ ది రిపబ్లిక్ ఆఫ్ ట్రినిడాడ్, అండ్ టొబాగో ' ను శుక్రవారం బహుకరించారు. ఈ దేశం ఓ విదేశీ నేతకు ఈ విశిష్ట గౌరవం ఆపాదించడం ఇదే తొలిసారి. ప్రస్తుతం ఈ కరీబియన్ దేశ పర్యటనలో ఉన్న మోడీ గౌరవార్థం ఇక్కడి ప్రెసిడెంట్ హౌస్‌లో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు-అయింది. ప్రధాని మోడీ రాజనీతిజ్ఞత, ఆయన కార్యదక్షత, గ్లోబల్ సౌత్ ప్రాధాన్యతల , రెండు దేశాల మధ్య నిర్మాణాత్మక బంధం బలోపేతం వంటి పలు అంశాల నేపథ్యంలో ఈ పురస్కారం అందించారు. ఈ సందర్భంగా ప్రెసిడెంట్ క్రిస్టియనే కార్లా కంగలూ మోడీని ప్రశంసించారు. ప్రధాని మోడీ ఈ చిన్నదేశంలో రెండు రోజుల పర్యటనకు వచ్చారు. ఈ దేశ అత్యున్నత విశిష్ట పురస్కారానికి తనను ఎంపిక చేసినందుకు తాను ట్రినిడాడో టోబాగో ప్రజలకు కృతజ్ఞుడిగా ఉంటానని ప్రధాని తెలిపారు. తాను ఈ పురస్కారాన్ని 140 కోట్ల మంది భారతీయుల పక్షాన స్వీకరిస్తున్నానని తెలిపారు. రెండు మూడు రోజుల క్రితమే మోడీకి ఘనా దేశ విశిష్ట పురస్కారం అందింది. ఈ విధంగా ప్రధాని మోడీకి ఇప్పటివరకూ మొత్తం మీద 25 అంతర్జాతీయ స్థాయి గౌరవ పురస్కారాలు దక్కాయి. 180 సంవత్సరాల క్రితం బీహార్ ఇతర ప్రాంతాల నుంచి భారతీయులు ఈ దేశానికి వచ్చి స్థిరపడ్డారని, తరతరాలుగా ఈ దేశంతో మనకు అత్యంత పురాతన వారసత్వ బంధం ఉందని, ఇది మరింత పెనవేసుకుపోతోందని పురస్కార స్వీకరణ సభలో మోడీ తెలిపారు.

# నీళ్లు దోచుకుపోతా అంటే చూస్తూ ఊరుకోం.. హరీశ్‌రావు హెచ్చరిక

హైదరాబాద్ :జూలై4(సమయజ్యోతి)


02

నాడైనా నేడైనా తెలంగాణ ప్రయోజనాల ముందు పదవులు బీఆర్ఎస్‌కు తృణప్రాయం అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. బనకచర్లతో ఏపీ అప్పనంగా నీళ్ళు దోచుకుపోతా అంటే చూస్తూ ఊరుకోం అని ఆయన హెచ్చరించారు.

# బైడెన్ ఉక్రెయిన్‌కు భారీగా ఆయుధాలిచ్చాడు డొనాల్డ్ ట్రంప్

రష్యా-ఉక్రెయిన్ దేశాల మధ్య 2022 ఫిబ్రవరిలో యుద్ధం మొదలైనప్పటి నుంచి ఉక్రెయిన్‌కు అమెరికా ఆయుధాలు అందిస్తూనే ఉంది. అయితే ఇటీవల తమ ఆయుధ నిల్వలను సమీక్షించిన అమెరికా.. ఉక్రెయిన్‌కు కొన్నిరకాల ఆయుధాల సరఫరాను నిలిపివేయాలని నిర్ణయించింది.


02

## కేంద్రంలో అధికారంలోకి వస్తాం..

# దేశాన్ని రక్షిస్తాం

అబద్దాల ప్రచారంలో మోడీ సిద్ధహస్తుడు
విదేశీలు చుట్టే మోడీకి..మణిపూర్ వెళ్లే తీరిక లేదు
తెలంగానకు 11 ఏళ్లలో చేసింది శూన్యం
కాంగ్రెస్ సామాజిక న్యాయ సమరభేరి సభలో ఖర్గే విమర్శలు


02

హైదరాబాద్,జులై 4(సమయజ్యోతి):

తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినట్లే.. కేంద్రంలో సైతం కాంగ్రెస్ ప్రభుత్వం కొలువు తీరుతుందని ఏఐసీసీ అధ్యక్షులు, ఎంపీ మల్లికార్జున్ ఖర్గే విశ్వాసం వ్యక్తం చేశారు. దేశరక్షణ కాంగ్రెస్ పార్టీకే సాధ్యమని ఆయన పురుద్ఘాటించారు. విదేశాలు తిరుగుతున్న మోడీ, మణిపూర్‌కు మాత్రం ఇప్పటి వరకు వెళ్లలేదని అన్నారు.శుక్రవారం హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయ సమరభేరి సభలో భాగంగా పార్టీ నేతలు, కార్యకర్తలను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా మల్లికార్జున్ ఖర్గే మాట్లాడుతూ.. దేశ ప్రజలకు ప్రధాని మోదీ చెప్పేవన్నీ అబద్దాలేనన్నారు. దేశానికి ప్రధాని మోదీ, కేంద్ర హోమ్ శాఖ మంత్రి అమిత్ షా చాలా చాలా చేశామని గొప్పలు చెప్పుకుంటున్నారని ఎద్దేవా చేశారు.

## పార్టీ వ్యవహారాలపై

# బయట మాట్లాడరాదు


02

- గ్రూపులు కడితే సహించబోము
- మీనాక్షితో అంతా సమన్వయం చేసుకోవాలి
- కాంగ్రెస్ నేతలకు మల్లికార్జున ఖర్గే హెచ్చరిక
- మంత్రుల సమన్వయ లోపంపై సిఎం అసహనం
- జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపైనా నేతల చర్చ
- టీపీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశంలో వాడీవేడీగా చర్చ

హైదరాబాద్,జూలై4(సమయజ్యోతి):

పార్టీలో అందరూ ఐక్యంగా ముందుకెళ్లాలని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సూచించారు. కొత్తపాత తేడా వద్దని.. త్వరలో అన్ని కమిటీల నియామకం పూర్తి చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణం, జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక, స్థానిక ఎన్నికలపై గాంధీభవన్‌లో టీపీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశమైంది. తొలుత పాశమైలారం ఘటనపై నేతలు సంతాపం తెలిపారు. అనంతరం బీసీ కులగణన, ఎస్సీ వర్గీకరణకు ప్రభుత్వం చేపట్టిన చర్యలపై చర్చించారు. జై బాపు-జై భీమ్-జై సంవిధాన్ కార్యక్రమాలపై సమాలోచనలు చేశారు. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, సీఎం రేవంత్‌రెడ్డి , కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్, టీ-పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఖర్గే మాట్లాడుతూ పార్టీకి సంబంధించిన అంశాలపై బయట ఎలాంటి విమర్శలు చేయొద్దని.. ప్రతిపక్షాలకు అవకాశం ఇవ్వొద్దని సూచించారు. రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ సమన్వయం చేయాలని దిశానిర్దేశం చేశారు. తెలంగాణ రాష్ట్రంలోని కొందరు కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేల వ్యవహార శైలిపై సీరియస్ అయ్యారు.

మొదటిపేజీ తరువాయి

## ఇచ్చిన హామీలను అమలు చేస్తున్న
# ఘనత తమదే

ఈ నేపథ్యంలో రైతుల శ్రేయస్సు కోసం చేసిన పనులపై బహిరంగ చర్చకు రావాలని బీజేపీ, బీఆర్ఎస్ నేతలకు రేవంత్ సవాల్ చేశారు. రైతుల బాగు కోసం ఎవరు ఎంత చేశారో తేల్చుకునేందుకు రావాలని కోరారు. రైతుల కోసం 18 నెలల్లో రూ.1.04లక్షల కోట్లు ఖర్చు చేశాం. వరి వేస్తే ఉరి వేసుకున్నట్టేనని గత సీఎం చెప్పారు.. 2.80 కోట్ల మెట్రిక్ టన్నుల వరిధాన్యం పండించి దేశానికే ఆదర్శంగా నిలిచాం. రైతుభరోసాలో ప్రభుత్వం విఫలమవుతుందని కొందరు ఎదురు చూశారు.. కానీ వారి ఆశ నెరవేరలేదు. రైతు రాజ్యం ఎవరు తెచ్చారో.. ఎక్కడైనా చర్చ చేసేందుకు సిద్ధం. చర్చకు ఎవరొస్తారో రండి.. కేసీఆర్, మోదీ, కిషన్‌రెడ్డి.. ఇలా ఎవరొచ్చినా సరే. కేసీఆర్‌ను ప్రశ్నిస్తున్నా.. పేదలు ఎప్పుడూ బర్రెలు, గొర్రెలు మేపుతూనే బతకాలా?కేసీఆర్, మోదీకి సవాల్ విసురుతున్నా. లెక్క కావాలంటే చెప్పండి.. అందర్నీ తీసుకొచ్చి స్టేడియంలో నిలబెట్టి లెక్కవేయిస్తా. 60వేలకు ఒక్కరు తక్కువ వచ్చినా కాళ్లు మొక్కి తప్పుకొంటా' అని రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రస్తుతం తెలంగాణ ఆర్థిక వ్యవస్థలో అనేక ఇబ్బందులు ఉన్నప్పటికీ, ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక సంస్కరణలు, పథకాలను అమలు చేస్తోందన్నారు. అనేక కష్టాలు ఎదురైనప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం నిలబడి, సమస్యలను అధిగమించి, ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలను అందించే దిశగా పనిచేస్తోందన్నారు. ఈ క్రమంలో తెలంగాణ రైతులు ఈ ఏడాది 2 కోట్ల మెట్రిక్ టన్నుల రైస్‌ను ఉత్పత్తి చేసినట్లు సీఎం గుర్తు చేశారు. ప్రజా పాలనలో ఈ ధాన్యాన్ని కొనుగోలు చేసి, రైతులకు సరైన ధర అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. కేవలం 9 రోజుల వ్యవధిలో రూ. 9 వేల కోట్లను రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. ఈ నిర్ణయంతో రైతులకు ఆర్థిక భరోసాను అందించడమే కాకుండా, వ్యవసాయాన్ని ఒక పండుగగా మార్చిందని రేవంత్ రెడ్డి తెలిపారు. రైతులకు 24 గంటల ఉచిత కరెంట్ సరఫరా చేయడం ద్వారా వ్యవసాయ ఉత్పాదకతను పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం సామాజిక న్యాయం, రైతు సంక్షేమం, ఆర్థిక పునరుద్ధరణ కోసం అనేక కార్యక్రమాలను అమలు చేస్తుందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. మూడు రంగుల జెండా చేతబూని కల్వకుంట్ల గడీని బద్దలు కొట్టామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రతి గుండెను తడుతూ ప్రజాపాలన సాగిస్తున్నామని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో అసెంబ్లీ, పార్లమెంట్ సీట్లు పెరగబోతున్నాయని.. మహిళలకు రిజర్వేషన్లు అమలు కానున్నాయని చెప్పారు. కార్యకర్తలకు అన్ని పదవులు దక్కే వరకూ విశ్రాంతి తీసుకోబోనని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో 100 అసెంబ్లీ సీట్లు గెలిచి మళ్లీ అధికారంలోకి వస్తామని.. దాని కంటే ఒక్క సీటు తక్కువ వచ్చినా తనదే బాధ్యతని చెప్పారు. 'కాంగ్రెస్ నేతలు కలిసి ఉండలేరని.. ఈ పాలన మూణ్నాళ్ల ముచ్చటే అని కొందరు అన్నారు. కానీ.. పార్టీ నేతలంతా ఐకమత్యంతో పనిచేస్తూ ఆ అపోహలను పటాపంచలు చేశారు. జనగణనతో పాటు కులగణన.. ఎస్సీ వర్గీకరణ చేస్తామని గతంలో రాహుల్‌గాంధీ మాటిచ్చారు. హామీ ఇచ్చినట్టుగానే ఏడాదిలోపే కులగణన, ఎస్సీ వర్గీకరణ చేసి చూపించాం. 18 నెలల్లో దేశానికే ఆదర్శంగా నిలిచేలా తెలంగాణ మోడల్ ఆవిష్కరించాం. కష్టాలు, ఒడిదొడుకులు వచ్చాయి.. అన్నీ అధిగమించి ముందుకెళు తున్నాం. ఈ కార్యక్రమానికి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దీంతోపాటు అనేక మంది కాంగ్రెస్ నేతలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఆత్మాభిమానం మన ఆయుధం

అడవుల్లో ఆయన పోరాటాలు బ్రిటిష్ వారిని వణికించాయి.. బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా తప్పనిసరి పరిస్థితుల్లో ఆయుధాలు ఎత్తాల్సి వచ్చింది అని రాజ్‌నాథ్ సింగ్ వెల్లడించారు. ఆనాటి బ్రిటిష్ పాలకులు ఇక, గిరిజనులపై, వారి భూమి పై ఆంక్షలు విధించారని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. గౌరవంగా జీవించుదామని అల్లూరి సీతారామరాజు పిలుపు ఇచ్చారు.. అల్లూరి సీతారామరాజు జీవించిన ప్రాంతాలను కేంద్రం అభివృద్ధి చేస్తుందని అన్నారు. జాతి నిర్మాణంలో గిరిజనుల పాత్ర మరువలేనిది.. ఆదివాసీలను సాధారణ జనజీవనంలోకి తీసుకుని రావాల్సిన అవసరం ఉంది.. 50, 000లకు పైగా ఆదివాసీ గ్రూపులను ఏర్పాటు- చేశాం.. మొదటి సారి గిరిజన మహిళను రాష్ట్రపతి చేశాం.. అల్లూరి సీతారామరాజు సంకల్పాన్ని ప్రతి గ్రామం, ఇంటికి తీసుకుని వెళ్దామని రాజ్‌నాథ్ సింగ్ పిలుపునిచ్చారు. మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా హైదరాబాద్‌లోని శిల్పకళావేదికలో క్షత్రియ సేవా సమితి భారత ప్రభుత్వ సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేడుకల్లో రాజ్‌నాథ్ మాట్లాడారు. గిరిజనుల కోసం అల్లూరి సీతారామరాజు అనేక పోరాటాలు చేశారని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. గెరిల్లా యుద్ధ నైపుణ్యాలతో బ్రిటిష్ వారితో ఆయన పోరాడారని గుర్తుచేశారు. భారత్ కోసం అల్లూరి సీతారామరాజు లాంటి గొప్ప వీరుడిని ఆంధ్రప్రదేశ్ ఇచ్చింది. అడవి నుంచి విప్లవం పుట్టించి బ్రిటిష్ వారిని గజగజలాడించిన వ్యక్తి అల్లూరి అన్నారు. గెరిల్లా యుద్ధ నైపుణ్యాలతో ఆధునిక ఆయుధాలకు వ్యతిరేకంగా పోరాడిన ధీశాలి ఆయన. బానిసత్వంతో కాదు ఆత్మాభిమానంతో బతకాలనేది ఆయన నుంచి మనం నేర్చుకోవాలి. అడవి బిడ్డల కోసం అల్లూరి వీరోచిత పోరాటం చేశారు. ఆయన పుట్టిన గ్రామాన్ని పర్యటక ప్రాంతంగా తీర్చి దిద్దుతున్నామని అని రాజ్‌నాథ్ అన్నారు. బాలికల చదువు కోసం పాఠశాల ల అభివృద్ధి జరుగుతుంది.. 108 సూర్య నమస్కారాలు కేవలం దేహం దారుఢ్యం కోసం కాదు.. మానసిక అభ్యున్నతికి ఉపయోగపడతాయి.. క్రమంగా అడవులు నక్సల్స్ కు అడ్డంగా మారాయి.. ఇప్పుడు నక్సల్స్ పూర్తిగా తుడిచిపెట్టుకు పోతున్నాయి.. ఆగస్టు 2026లోపే నక్సల్స్ ను తుడిచి పెట్టేస్తాం.. నక్సల్స్ చేతిలో బంధీగా ఉన్న ప్రాంతాల్లో ఇప్పుడు అభివృద్ధి వేగంగా జరుగుతోంది.. వేగంగా గ్రోత్ కారిడార్ లుగా అభివృద్ధి చెందుతున్నాయి.. కనీసం నెట్వర్క్ లేకపోయేది.. టీ-వీలు, ల్యాప్ టాప్ లు, మొబైల్ టవల్ లు కూడా లేకుండాపోయాయి.. 8 వేల టవర్లను ప్రారంభించేం దుకు సిద్ధం గా ఉన్నాయని రక్షణ శాఖా మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. పహెల్గామ్ లో దాడి తరువాత ఆపరేషన్ సింధూర్ తో ధైర్యం, ధర్మం, ఖర్మను పరిచయం చేశామని రక్షణ శాఖా మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చెప్పుకొచ్చారు. రామాయణంలో హనుమంతుడు చేసిన పనే ఇప్పుడు మనం చేశాం.. మనల్ని ఎవరు చంపారో వారిని మాత్రమే చంపాం.. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరిగితే తగిన సమాధానం చెబుతాం.. న్యాయం అందిరికీ సమానంగా దక్కాలి.. హనుమాన్ స్ఫూర్తిగా 'ఆపరేషన్ సిందూర్' కొనసాగిందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. పాకిస్థాన్‌తో పాటు- ప్రపంచానికి మనం బలమేంటో చూపించామన్నారు. పాక్ ఉగ్ర స్థావరాలను టార్గెట్ చేశాం తప్ప.. పౌరులను కాదని చెప్పారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రులు షెకావత్, కిషన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మొదటిపేజీ తరువాయి

## కేంద్రంలో అధికారంలోకి వస్తాం..
# దేశాన్ని రక్షిస్తాం

కానీ వాళ్లు ఈ దేశానికి, తెలంగాణకు చేసిందేమిటని సూటిగా ప్రశ్నించారు. నెహ్రూ, ఇందిరాగాంధీ హయాంలోనే ఈ ప్రాంతం అభివృద్ధి చెందిందన్నారు. ఇప్పటి వరకు ప్రధాని మోదీ 42 దేశాలు తిరిగారని గుర్తు చేశారు. కానీ ప్రజలు చనిపోతున్నా.. మణిపూర్ మాత్రం ఆయన వెళ్లలేదని మండిపడ్డారు. పాకిస్థాన్‌ను ఏదేదో చేస్తామని మోదీ ప్రభుత్వం ప్రకటించార న్నారు. కానీ ఎందుకు ఏం చేయలేదని మోదీ ప్రభుత్వాన్ని ఆయన నిలదీశారు. పాకిస్తాన్‌పై యుద్ధం చేయకుండా.. మిమ్మల్ని ఎవరు ఆపారంటూ సందేహం వ్యక్తం చేశారు. పలహ్గాం ఘటన తరవాత ఆపరేషన్ సింధూర్‌కు కాంగ్రెస్ మద్దతు ప్రకటించిందని గుర్తు చేశారు. దేశ ఆర్థిక పరిస్థితిని ప్రధాని మోదీ చిన్నాభిన్నం చేశారు. పాకిస్థాన్‌తో యుద్ధం చేయాలని 'ఆపరేషన్ సిందూర్'కు రాహుల్‌గాంధీతో పాటు కాంగ్రెస్ కూడా సంపూర్ణ మద్దతు ఇచ్చింది. మరి మోదీ ఎందుకు యుద్ధాన్ని మధ్యలోనే ఆపేశారు? అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఫోన్ చేయగానే యుద్ధం ఆపేశారు.. కానీ ఆ విషయంపై ప్రధాని నోరు విప్పరు. మణిపూర్ ఈ దేశంలో భాగం కాదా? మణిపూర్ వాసులు భారతీయులు కాదా?అఖిలపక్ష సమావేశానికి ప్రధాని రాలేదు.. బిహార్ ఎన్నికల ప్రచారంలో ఆయన బిజీగా ఉన్నారు' అని ఖర్గే విమర్శించారు. ప్రధాని మోదీలాగా ఇందిరాగాంధీ ప్రధానిగా ఉన్నప్పుడు భయపడ లేదన్నారు. ఎవరు వచ్చినా బంగ్లాదేశ్‌కు స్వాతంత్ర్యం కల్పిస్తామని ఇందిరాగాంధీ ప్రకటించారని.. అదే పని ఆమె చేసి చూపించారన్నారు. క్షమాపణలు చెప్పడమే బీజేపీ, ఆర్ఎస్ఎస్‌ల పని అంటూ అయన ఎద్దేవా చేశారు. రాజ్యాంగం నుంచి లౌకిక అనే పదాన్ని తీసి వేయాలని బీజేపీ చూస్తోందని విమర్శించారు. సెక్యులర్ అనే పదం రాజ్యాంగంలోనే లేదని బీజేపీ చెపుతుందన్నారు. ÷ూజ్యాంగం నుండి లౌకిక పదాన్ని తీసేయారని తాను చాలెంజ్ చేస్తున్నానని ఈ సందర్భంగా ఖర్గే ప్రకటించారు. సెక్యులర్ అనే పదం బీజేపీ ప్రణాళికలో రాసుకున్నారని వివరించారు. సెక్యులర్ అనే పదంతో మీకు ఇబ్బంది ఉంటే మీ పార్టీ ప్రణాళిక నుంచి తీసివేయాలని బీజేపీ అగ్రనేతలకు ఖర్గే బహిరంగ సవాల్ విసిరారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు కష్టపడి పని చేశారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ గెలిచిందంటే.. అది కార్యకర్తల కృషి ఫలితమేనని స్పష్టం చేశారు. రేవంత్, భట్టి, మంత్రులు కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కృషి చేశారన్ని వివరించారు. కేసీఆర్, బీజేపీ కలిసి తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని అడ్డుకుంటున్నారన్నారు. కానీ తెలంగాణ ప్రజలు మాత్రం ఈ రెండు పార్టీలను ఓడించారని గుర్తు చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందని గతంలో తాను చెప్పానని వివరించారు. కాంగ్రెస్ హయాంలోనే తెలంగాణలో 50కిపైగా కేంద్ర సంస్థలు వచ్చాయని గుర్తు చేశారు. తెలంగాణకు ఈ 11 ఏళ్లలో ఏం ఇచ్చారంటూ ప్రధాని మోదీని ఈ సందర్భంగా ఖర్గే సూటిగా ప్రశ్నించారు. గతంలో రైతులు, మహిళలు, నిరుద్యోగులను కేసీఆర్ మోసం చేశారు. ప్రధాని మోదీ, అమిత్‌షా అబద్ధాలు చెప్పి కేంద్రంలో అధికారంలోకి వచ్చారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించాం. హైదరాబాద్‌కు మోదీ చేసింది శూన్యం. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పేదలకు సన్నబియ్యం అందిస్తోంది. రైతు భరోసా కింద రైతుల ఖాతాల్లో రూ.8,200 కోట్లు జమ చేశారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేరుస్తోంది. గిగ్ వర్కర్ల హక్కుల కోసం రాష్ట్ర ప్రభుత్వం చట్టం తీసుకొస్తోంది. దేశంలో తొలిసారి కులగణన చేపట్టింది తెలంగాణ ప్రభుత్వమే. బీసీల రిజర్వేషన్ల కోసం కాంగ్రెస్ పార్టీ పనిచేస్తోందన్నారు.

మొదటిపేజీ తరువాయి

# నీళ్లు దోచుకుపోతా అంటే చూస్తూ ఊరుకోం.. హరీశ్‌రావు హెచ్చరిక

పోలవరం, పోతిరెడ్డిపాడు, పులిచింతల వంటి ఏపీ అక్రమ ప్రాజెక్టులను నిరసిస్తూ 20 ఏళ్ల క్రితం ఇదే రోజున (04.07.2005) మంత్రి పదవులకు రాజీనామాలు చేశాం. కేసీఆర్ ఆదేశానుసారం.. ఉమ్మడి రాష్ట్రంలోనే తెలంగాణ నీటి హక్కుల కోసం పదవులను గడ్డి పోచలుగా భావించి వదులుకున్నం. నీళ్లు, నిధులు, నియామకాలు నినాదంతో కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో.. ఆంధ్రప్రదేశ్ బనకచర్ల పేరిట గోదావరి నీళ్ల దోపిడి చేస్తానంటే చూస్తూ ఊరుకుంటామా? అని హరీశ్‌రావు నిలదీశారు.నాడైనా, నేడైనా తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలు దెబ్బ తీసే ఏ కుట్రలనైనా బీఆర్ఎస్ పార్టీ సహించదు. పదవులకు రాజీనామాలు చేయడం మాత్రమే కాదు, పేగులు తెగేదాకా కొట్లాడుతం. తెలంగాణకు అన్యాయం జరగకుండా కాపలా ఉంటం. కంటికి రెప్పలా ఉండి కాపాడుకుంటం. ప్రాంతేతరుడు ద్రోహం చేస్తే.. పొలిమేర దాకా తరిమికొడతాం.. ప్రాంతంవాడే ద్రోహం చేస్తే ప్రాణంతోనే పాతర వేస్తం అని హరీశ్‌రావు హెచ్చరించారు. జై తెలంగాణ.. జై కేసీఆర్.. అని హరీశ్‌రావు నినదించారు.

మొదటిపేజీ తరువాయి

# బైడెన్ ఉక్రెయిన్‌కు భారీగా ఆయుధాలిచ్చాడు డొనాల్డ్ ట్రంప్

ఈ విషయాన్ని పెంటగాన్ అధికారులు వెల్లడించారు.ఈ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. జో బైడెన్ హయాంలో దేశం గురించి ఆలోచించకుండా ఉక్రెయిన్‌కు విపరీతంగా ఆయుధాలు అందజేశారని, దేశాన్ని ఖాళీ చేశారని ఆరోపించారు. దేశ భద్రతకు సరిపడా ఆయుధాలు ఉండేలా చూసుకోవాల్సిన బాధ్యత తమపై ఉందని.. అందుకే కీవ్‌కు అందజేయాల్సిన ఆయుధ సామాగ్రిపై కోత విధించినట్లు ఆయన పేర్కొన్నారు.రష్యా-ఉక్రెయిన్ యుద్ధం మొదట్లో ఉక్రెయిన్‌కు ఆయుధాలు ఇచ్చేందుకు బైడెన్ ప్రభుత్వం అంగీకరించిందని, అయితే ఇటీవల ఆయుధ నిల్వలను సమీక్షించిన రక్షణశాఖ.. కీవ్‌కు ఇస్తామని హామీ ఇచ్చిన ఆయుధాలు చాలా తక్కువగా ఉన్నట్లు గుర్తించిందని ట్రంప్ తెలిపారు. ఆయుధ కొరత కారణంగా ఉక్రెయిన్‌కు పంపాల్సిన పెండింగ్ షిప్‌మెంట్లను పంపించొద్దని నిర్ణయించినట్లు ఆయన చెప్పారు.కాగా బైడెన్ హయాంలో అమెరికా ఉక్రెయిన్‌కు భారీగా ఆయుధ, సైనిక సహాయాన్ని అందించింది. ఆయన పదవి నుంచి వైదొలగడానికి ముందు కూడా ఉక్రెయిన్‌కు పెద్ద మొత్తంలో ఆర్థిక, ఆయుధ సాయం చేస్తామని ప్రకటించారు. రష్యా భూభాగంలో దాడులకు వీలుగా దీర్ఘశ్రేణి ఆయుధాల వినియోగానికి కూడా అమెరికా నుంచి కీవ్‌కు అనుమతులు లభించాయి. ట్రంప్ అధ్యక్షుడు అయిన తర్వాత కూడా కీవ్‌కు ఆయుధ సాయాన్ని కొనసాగించారు. ఇప్పుడు నిలువలు తగ్గడంతో సరఫరాను నిలిపివేస్తున్నట్లు చెప్పారు.

మొదటిపేజీ తరువాయి

## పార్టీ వ్యవహారాలపై
# బయట మాట్లాడరాదు

నలుగు రైదుగురు గ్రూపులు కడితే భయపడతారు అనుకుంటున్నారా..? అని ప్రశ్నించారు. ఇష్టారాజ్యంగా వ్యవహరించే నేతలను రాహుల్ గాంధీ.. నేను పట్టించుకోమని తేల్చి చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రులపై మరోసారి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆయా మంత్రులు నిర్లక్ష్యంగా ఉంటున్నారని సీఎం వ్యాఖ్యానించారు. సీనియర్ నేత వి.హనుమంతరావు మాట్లాడుతూ కొత్త, పాత నేతల మధ్య సమన్వయం లేదన్నారు. కొత్తగా వచ్చినవారు పాతవారితో కలిసి వెళ్తే పార్టీ బలం పెరుగుతుందని చెప్పారు. జూబ్లీహిల్స్ ఎన్నికపై దృష్టి పెట్టాలని కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. ఉప ఎన్నికలో మూడు పార్టీలు కలిసి బరిలోకి దిగుతాయని చెప్పుకొచ్చారు. ఉప ఎన్నికను సమర్థవంతంగా ఎదుర్కొవాలని దిశానిర్దేశర చేశారు. ఇన్‌చార్జ్ మంత్రులు ప్రతి అంశాన్నీ సీరియస్‌గా తీసుకోవాలని ముఖ్యమంత్రి మార్గనిర్దేశర చేశారు. క్రమశిక్షణ విషయంలో సీరియస్‌గా ఉండాలని ఆదేశించారు. కాంగ్రెస్ పార్టీ పదవులు వెంటనే భర్తీ చేయాలన్నారు. పార్టీ కమిటీల్లో అన్ని సామాజిక వర్గాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. క్రమశిక్షణ విషయంలో సీరియస్‌గా ఉండాలని హుకుం జారీ చేశారు. పార్టీ పదవులు భర్తీ చేయడంలో టీ-పీసీసీ చీఫ్ ఎందుకు జాప్యం చేస్తున్నారని ప్రశ్నించారు. లోకల్ బాడీ ఎన్నికల్లో నేషనల్ నరేటివ్ బిల్డప్ చేసుకోవాలని సూచించారు. 42 శాతం బీసీ రిజర్వేషన్లు ఇచ్చేందుకు సాధ్యమైనంత వరకు ప్రయత్నం చేస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. దేశంలోనే అన్నిరాష్ట్రాలకు తెలంగాణ ఆదర్శంగా నిలుస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉద్ఘాటించారు. కేందప్రభుత్వం మెడలు వంచి జనగణనలో కులగణన చేసేలా చేయడంలో మనం విజయం సాధించామని వ్యాఖ్యానించారు. విద్య, ఉద్యోగ, ఉపాధి కల్పనలో మనం చాలా విజయాలు సాధించామని చెప్పుకొచ్చారు. తాను టీ-పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో 45 లక్షల మందితో క్రియాశీలక సభ్యత్వం చేయించానని గుర్తుచేశారు. యూత్ కాంగ్రెస్, కీఒ, పార్టీ జిల్లా అధ్యక్షుల్లో చాలా మందికి కాంగ్రెస్ ప్రభుత్వంలో పదవులు వరించాయని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

# ఖమ్మం-వరంగల్ రహదారిపై ఘోర ప్రమాదం
## రెండు లారీలు ఢీకొని మంటల్లో ముగ్గురు దహనం

మహబూబాబాద్,జూలై4(సమయజ్యోతి):

ఖమ్మం - వరంగల్ హైవేపై శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారు. మరిపెడ శివారు కుడియాతండా వద్ద రెండు లారీలు ఢీకొన్నాయి. దీంతో లారీ క్యాబిన్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో ముగ్గరు అక్కడికక్కడే మృతి చెందగా, మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. రెండు లారీల డ్రైవర్లు, క్లీనర్ మృతి చెందారు. క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలించారు. అగ్నిమాపక సిబ్బంది ఫైరింజన్‌తో మంటలు ఆర్పివేశారు. పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. ఘటన వివరాల్లోకి వెళితే రెప్పపాటులో మూడు నిండు ప్రాణాలు అగ్నికి ఆహుతయ్యాయి. ఎదురెదురుగా వస్తున్న రెండు లారీలు ఢీకొని మంటలు చెలరేగి ఇద్దరు డ్రైవర్లు, క్లీనర్ మృత్యువాత పడ్డారు. ఈ హృదయ విదారక ఘటన మహబూబాబాద్ జిల్లా, మరిపెడ మండలం, ఎల్లంపేట స్టేజి సమీపంలోని జాతీయ రహదారి 563పై శుక్రవారం తెల్లవారుజామున జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజస్థాన్ రాష్ట్రం, జోద్‌పూర్, కేజర్ల ప్రాంతానికి చెందిన రాజురాం చౌదరికి ఇద్దరు కుమారులు. లారీ ట్రాన్స్‌పోర్ట్ వ్యాపారం నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అందులో భాగంగానే చేపల దాణా కోసం విజయవాడ వెళ్లిన తండ్రి, చిన్న కుమారుడు సర్వణ్ రాం (23) రెండు లారీలతో విజయవాడ నుంచి రాజస్థాన్‌కు లారీలతో బయల్దేరారు. కుమారుడు లారీ ముందు వస్తుండగా పది నిమిషాల వ్యవధిలో తండ్రి లారీ వెనుక నుంచి వస్తోంది. అదే క్రమంలో వరంగల్ జిల్లా, వర్ధన్నపేట మండలం, నల్లబెల్లి పరిధిలోని రాంనాథ్ తండాకు చెందిన గుగులోత్ గణేష్ (30) కరీంనగర్ నుంచి గ్రానైట్ లోడుతో కాకినాడకు వెళ్తున్నాడు.మహబూబాబాద్ జిల్లా, మరిపెడ మండలం, ఎల్లంపేట స్టేజీ సమీపంలో సర్వణ్ రాం నడుపుతున్న లారీ అదుపుతప్పి ఎదురుగా వస్తున్న కరీంనగర్ నుంచి కాకినాడకు గ్రానైట్ లోడుతో వెళ్తున్న లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రాళ్లు క్యాబిన్లపైకి దూసుకు రావటంతో ఒక్కసారిగా మంటలు చెలరేగి డ్రైవర్లు గుగులోత్ గణేష్, సర్వణ్, రాం క్లీనర్ బర్గత్ ఖాన్ (23) సజీవ దహనమయ్యారు. స్థానికులు స్పందించి పోలీసులకు సమాచారం ఇవ్వగా ఫైర్ సిబ్బంది ఘటనా ÷-ధస్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. మృతదేహాలు గుర్తుపట్టలేని విధంగా ఉండటంతో కొడుకు లారీ వెనకాలే వస్తున్న తండ్రి రాజురాం చౌదరి తన కుమారుడి వాహనం ప్రమాదానికి గురైనట్లు- గుర్తించాడు. మృతుడు గణేష్‌కు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. క్లీనర్ బర్గత్ ఖాన్‌కు కూడా ఇటీవలే వివాహమైనట్లు- తెలుస్తోంది. జాతీయ రహదారిపై లారీలు దహనమవుతుండటంతో రెండు వైపులా భారీగా వాహనాలు నిలిపోయాయి. రాకపోకలకు అంతరాయం కలుగకుండా అగ్నిమాపక సిబ్బంది సుమారు రెండు గంటలు శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.పోలీసులు కేసు నమోదు చేశారు.

# భార్యను గొంతునులిమి చంపిన భర్త-చిన్నారిని అక్కడే వదిలేసి పరార్-మేడ్చెల్ జిల్లాలో ఘటన

హైదరాబాద్,జూలై4(సమయజ్యోతి):

భార్యపై అనుమానంతో భర్త ఆమె గొంతు నులిమి హత్య చేశాడు. ఆమె మరణించిందని నిర్ధారించుకున్న తర్వాత తన ఐదు నెలల కన్నకూతురుపై కనికరం లేకుండా అక్కడే వదిలి ఘటనా స్థలం నుంచి పారిపోయాడు. ఈ విషాదకర సంఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కెఎల్ఆర్-ఎన్‌జేఆర్ నగర్‌లో శుక్రవారం జరిగింది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. నెల్లూరు జిల్లా, కందుకూరు మండలం, ముప్పల గ్రామానికి చెందిన రాంబాబుతో ప్రశాంతి (22) వివాహం ఏడాదిన్నర కిందట జరిగింది. వీరికి ఐదు నెలల పాప ఉంది. రాంబాబు భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. నెలరోజుల కిందట మేడ్చల్ పట్టణంలోని కెఎల్ఆర్-ఎన్‌జెఆర్ నగర్‌లో వారు అద్దెకు ఉంటున్నారు. పెళ్లయిన నాటినుంచి భార్యను రాంబాబు అనుమానంతో వేధిస్తున్నాడు. ఈ విషయమై తరుచూ ఇద్దరి మధ్య గొడవలు జరుగుతుండేవి. కుటు-ంబ పెద్దలు ఇరువురికి నచ్చచెపుతూ వచ్చారు. పాప పుట్టిన తర్వాత అయినా రాంబాబు మారకపోతాడా అని అంతా భావించారు. అయితే అతడిలో ఏ మాత్రం మార్పు రాలేదు. ఈ క్రమంలో గురువారం రాత్రి కూడా భార్యాభర్తల మధ్య గొడవ జరిగి, రాంబాబు తన భార్య గొంతు నులిమి హత్య చేశాడు. చనిపోయిందని నిర్ధారించుకున్న తర్వాత తమ ఐదు నెలల పాపను అక్కడే వదిలేసి పారిపోయాడు. శుక్రవారం ఉదయం బంధువులు రాంబాబుకి ఫోన్ చేయగా ఫోన్ స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో వారు ఇంటికి వచ్చి చూసేసరికి ప్రశాంతి విగతజీవిగా నేలపై పడి ఉంది. ఐదు నెలల పాప తల్లి పక్కన ఏడుస్తూ కనిపించింది. వెంటనే వారు పోలీసులకు సమాచారం అందించారు.


దక్షిణ మధ్య రైల్వే
Follow us on X @SCRailwayindia S.C రైల్వే యొక్క టెండర్ నోటీసుల వివరాలను మా వెబ్‌సైట్‌లో చూడవచ్చు: www.scr.indianrailways.gov.in

నం Y/C. E-AUCTION/HYB/2025-26. తేదీ 03.07.2025

PUB/0813/25

RDN ద్వారా వాణిజ్య ప్రచార ఒప్పందాల పురస్కారం, హోమ్ కేటగిరీ నుండి, MISC. సౌత్ సెంట్రల్ రైల్వే యొక్క హైదరాబాద్ విభాగంలో స్టాటిక్ సర్వీస్ విభాగం.

ఇ-వేలం యొక్క షెడ్యూల్ క్రింద ఇవ్వబడింది:

| ఎస్. నం. | వర్గం | కేటలాగ్ నం. | వివరాలు | వేలం తేదీ | వేలం ప్రారంభ సమయం | వేలం ముగింపు సమయం |
|---|---|---|---|---|---|---|
| 1 | ADVT-HYB -BS X-OSN-127-25-1 అడ్వర్టైజింగ్-ఆన్ స్టేషన్ ఆవరణ (నాన్-డిజిటల్) | HYB - ADVT- MSS-2 | స్టేషన్ల బసార్, ధర్మబాద్ & ఉమ్రీలలో ప్రకటనల హక్కులు | 17.07.2025 | 11.30 | 12.00 |
| 2 | MSS-HYB- MJF -GZ-91-25-1 (MISC. స్టాటిక్ సర్వీసెస్- గేమింగ్ జోన్) | HYB - ADVT- MSS-2 | అల్వాల్ రైల్వే స్టేషన్ వద్ద టెన్నిస్ అకాడెమి స్నాక్స్ బార్ ఏర్పాటు | 17.07.2025 | 11.40 | 12.10 |
| 3 | MSS-HYB-JOO- SS -93-25-1 (MISC, స్టాటిక్ సర్వీసెస్- సాలూన్ సర్వీస్) | HYB - ADVT- MSS-2 | యునిసెక్స్ సెలూన్ అందించడం జమై ఉస్మానియా రైల్వే స్టేషన్ | 17.07.2025 | 11.50 | 12.20 |
| 4 | MSS-HYB-VAR-THDPK-92-25- 1 (MISC. స్టాటిక్ సర్వీసెస్-ట్రావెల్ హెల్ప్ డెస్క్/ ట్రావెలర్స్ ఇన్ఫర్మేషన్ అండ్ ప్రమోషనల్ కియోస్క్) | HYB - ADVT- MSS-2 | కార్యాలయ ప్రాంగణాల ఏర్పాటు [విద్యానాగర్ రైల్వే స్టేషన్ వద్ద మద్దతు డెస్క్/ ట్రావెల్ డెస్క్. | 17.07.2025 | 12.00 | 12.30 |
| 5 | పార్కింగ్ హైబ్- MBNR-RT-108-25-1 (పార్కింగ్- రేడియో టాక్సీ) | HYB - మిశ్రమ -003 | స్థానం JCL, MBNR & KRNT వద్ద రేడియో టాక్సీ కోసం పార్కింగ్ స్థలం | 18.07.2025 | 11.30 | 12.00 |
| 6 | పార్కింగ్ హైబ్- NZB -RT-109- 25-1 (పార్కింగ్-రేడియో టాక్సీ) | HYB - మిశ్రమ -003 | స్థానం NZB, DHP, KMC వద్ద రేడియో టాక్సీ కోసం పార్కింగ్ స్థలం. | 18.07.2025 | 11.40 | 12.10 |
| 7 | ADVT-HYB-NZB-OH-126-25 -1 (ఇంటి నుండి ప్రకటనలు) | HYB - మిశ్రమ -003 | కాంటెశ్వర్ నుండి NTR సర్కిల్ వరకు నిజామాబాద్ వద్ద రబ్ /రాబ్ పై ప్రకటనల హక్కులు. | 18.07.2025 | 11.50 | 12.20 |
| 8 | ADVT-HYB-MDAK-OH-11-25-1 (ఇంటి నుండి ప్రకటనలు) | HYB - మిశ్రమ -003 | మెదక్, గజ్వేల్ & సిడిపెట్ రైల్వే స్టేషన్లలో హోమ్ కేటగిరీలో ప్రకటనల హక్కులు | 18.07.2025 | 12.00 | 12.30 |

A1008 సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్, హైదరాబాద్

# మల్లికార్జున్ ఖర్గే బహిరంగ సభ తరలిన జక్రాన్ పల్లి కాంగ్రెస్ కార్యకర్తలు

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ

జక్రంపల్లి మండల అన్ని గ్రామాల కాంగ్రెస్ నాయకులు, హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో జరిగే ఏఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే సభకు తరలివెళ్లారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు జైడి చిన్నరెడ్డి, సొసైటీ చైర్మన్ నర్సారెడ్డి, కోఆర్డినేటర్ సోప్పరి వినోద్, మండల మైనారిటీ అధ్యక్షులు సైకిల్ టెక్ట్స్ అక్బర్, నాయకులు గన్నే లక్ష్మణ్, ఉత్కామ్ శ్రీనివాస్ గౌడ్, వసంత్ రావు, నట్ట తిరుపతి, వినోద్, గంగారెడ్డి, సాయిరెడ్డి, అభి, గోపి, గంగాధర్, బాలయ్య, రాజేందర్, లాల్, బోరవెల్ రాజు, బోజన్న, మనోహరాబాద్ గంగాధర్, నాయకులు పాల్గొన్నారు.



# మల్లికార్జున్ ఖర్గే బహిరంగ సభకు తరలిన కాంగ్రెస్ కార్యకర్తలు

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ

బాల్కొండ మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంజీవ్ గౌడ్ ఆధ్వర్యంలో గ్రామ శాఖల నాయకులు కార్యకర్తలు, హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో జరిగే ఏఐసిసి అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే బహిరంగ సభకు తరలి వెళ్లారు.



# వేధింపులకు గురవుతే.. షీ టీంకు సమాచారం ఇవ్వాలి

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ

మహిళల పట్ల ఇవ్ టీజింగ్, అసభ్యంగా ప్రవర్తిస్తే షీ టీంకు సమాచారం ఇవ్వాలని సబ్ డివిజన్ షీ టీం కానిస్టేబుళ్లు, విగ్నేష్, సుమతి అన్నారు. బాల్కొండ పట్టణంలోని మదర్ తెరిసా పాఠశాలలో క్రైమ్ గురించి విద్యార్థినిలకు అవగాహన సదస్సు జరిపారు. విద్యార్థినిలు, ఉద్యోగినిలు, మహిళలు ఈవ్‌టీజింగ్, వేధింపులకు గురైతే, షీ టీంకు సమాచారం ఇస్తే కఠిన చర్య గైకొంటామని, సమాచారం ఇచ్చిన మహిళలు, విద్యార్థినిల పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. ఈవ్ టీజింగ్‌కు గురవుతే భయపడకుండా సమాచారం ఇస్తే రక్షణ కల్పిస్తామన్నారు. షీ టీం నెంబర్ 8712659795కు, డయల్ 100కు సమాచారం ఇవ్వాలని సూచించారు. క్యూ ఆర్ కోడ్ ద్వారా షీ టీం వారికి ఫిర్యాదు చేసే విధానాన్ని మహిళలకు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నరసింహారెడ్డి, కరెస్పాండెంట్ రామలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.



# ఉచితంగా కూరగాయ నారు.. రైతులు వినియోగించుకోవాలి

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ

ఉద్యాన శాఖ సమీకృత ఉద్యాన అభివృద్ధి పథకం క్రింద రైతులకు టమాటా, వంకాయ, మిర్చి, క్యాబేజీ, కాలీఫ్లవర్ నారును ఉచితంగా ఇస్తుందని బాల్కొండ డివిజనల్ ఉద్యాన అధికారి రుద్ర వినాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న రైతులు సాగు చేయాలనుకునే నెల రోజు ముందర దరఖాస్తు చేసుకుంటే నారు తయారు చేస్తామని, ఆ నారును హైదరాబాద్ జీడిమెట్లలో ఉన్న ఉద్యాన శాఖ వారి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కి వెళ్లి తెచ్చుకోవలసి ఉంటుందని, ఈ అవకాశాన్ని డివిజన్ లోని బాల్కొండ, ముప్కాల్, మెండోర, ఏర్గట్ల మండల రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.



# రెండు దఫాలుగా యూరియా కొనుగోలు లేదా ప్రత్యన్మయం నానో యూరియా వినియోగించండి

సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ

రైతులు యూరియా ఒక పంట సీజన్లో రెండు దపాలుగా కొనుగోలు చేసి వినియోగించాలని బాల్కొండ మండల కేంద్రంలో శుక్రవారం వ్యవసాయ అధికారి బి లావణ్య పేర్కొన్నారు. బాల్కొండ మండలంలో వరి, మొక్కజొన్న ప్రధాన పంటలకు మొదటిదపా సరిపడా కొనుగోలు చేసి వినియోగించాక, రెండవ సరిపడా యూరియా కొనుగోలు చేసి వినియోగించుకోవాలని, ఒకేసారి పెద్ద మొత్తంగా యూరియా అందించ లేమని, మండలానికి మొత్తం 620 మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు పిఎసిఎస్ మరియు ప్రైవేట్ డీలర్స్ ద్వారా సరఫరా చేయడం జరిగిందని, ప్రస్తుతం యూరియా సంచులకు ప్రత్యామ్నాయంగా నానో యూరియా మార్కెట్లో అందుబాటులో ఉంది. ఒక అర లీటరు నానో యూరియా ఒక ఎకరానికి సరిపోతుంది. ఒక యూరియా బస్తా ధర 267 రూ.లు ఉండగా అర లీటరు నాలో యూరియా 225 రూపాయలు ఉంటుంది. నానో యూరియా పంటల దిగుబడిని పెంచుతుంది. పర్యవరానికి సురక్షితమైనది. ఇది వాడకం వలన పంటల దిగుబడి శాతం పెరుగుతుందని వివరించారు.



# వార్డు నంబర్ 45 లో వైద్య శిబిరం

సమయజ్యోతి న్యూస్ ప్రతినిది ఆదిలాబాద్

సీజనల్ వ్యాధులను దృష్టిలో ఉంచుకొని భుక్తపూర్ వార్డ్ నెంబర్ 45 కాలనీలో అంగన్వాడి సెంటర్ దగ్గర హెల్త్ క్యాంప్ నిర్వహించడం జరిగింది. దగ్గు , జలుబు , జ్వరం , షుగర్ , బిపి వాటికి చెక సిప్ చేయించుకొని మందులు కూడా ఉచితంగా ఇవ్వడం జరిగింది , అదేవిధంగా ఎక్కువ దగ్గు ఉన్నవారికి ఇక్కడే అంగన్వాడి సెంటర్లో పరీక్ష కూడా తీయడం జరిగింది. అప్పటికప్పుడే రక్త నమోనా పరీక్షలు , రిజల్ట్ కూడా ఇవ్వడం జరిగింది. ప్రైవేట్ ల్యాబ్ లలో ఎక్కువ డబ్బులు ఖర్చు కాకుండా ప్రభుత్వం ద్వారానే ఉచితంగా అన్ని టెస్టులు నిర్వహించడం జరుగుతుంది. కాబట్టి కాలనీవాసులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని వార్డ్ మాజీ కౌన్సిలర్ బండారి సతీష్ తెలపడం జరిగింది. అదేవిధంగా డ్రైడే , ఫ్రైడే సందర్భంగా ఇంటి పరిసర ప్రాంతాలు మురికిగా ఉంచుకున్న వారికి కూడా కౌన్సిలింగ్ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో వార్డ్ మాజీ కౌన్సిలర్ బండారి సతీష్ తో పాటు జిల్లా క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ సుమలత , మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రెహాన్ , సి ఓ రణిత , పుష్పలత , రమాదేవి , ఏ ఎన్ ఎం



సునంద , ఆశ , నాగరాజు , రంజిత్ , నాగభూషణం , నవీద్ , మోసిన్ హెల్త్ సిబ్బంది తదితరులు మరియు కాలనీవాసులు పాల్గొన్నారు.

# ఆత్మ నిర్బర్ సంఘాతన్ అవార్డుకు ఎంపికవడం అభినందనీయం: కలెక్టర్

సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్

ఇల్లంతకుంట మండలము ఆదర్శ మహిళా సమాఖ్య సేవలు భేష్ అని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా కొనియాడారు. ఈ మండల సమాఖ్య కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఆత్మ నిర్బర్ సంఘాతన్ అవార్డుకు ఎంపిక కాగా, రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్ లో శు క్రవారం కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ను మర్యాద పూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. ఇల్లంతకుంట మండల ఆదర్శ మహిళా సమాఖ్య బ్యాంకు రుణాల అందజేత, రికవరీ, క్రమం తప్పకుండా సమావేశాల నిర్వహణ, సామాజిక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుండడం పై జిల్లా కలెక్టర్ అభినందించారు. లినిరంతర ఆదాయానికి గ్యాస్ ఏజెన్సీ మంజూరులిఇల్లంతకుంట మండల ఆదర్శ మహిళా సమాఖ్యకు నిరంతరం ఆదాయం వచ్చేలా గ్యాస్ ఏజెన్సీ మంజూరు చేయాలని డీఆర్డీఓ శేషాద్రిని కలెక్టర్ ఆదేశించారు. గ్యాస్ ఏజెన్సీతో మండల సమాఖ్య ఆర్థికంగా మరింత బలపడుతుందని పేర్కొన్నారు. మండల సమాఖ్య బాధ్యులు ఎస్ హెచ్ జీ సభ్యులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేలా తీర్చిదిద్దేలా కృషి చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో డీ.ఆర్డీ.ఓ శేషాద్రి, డి.పి.ఎం. వంగ రవీందర్, ఏపీఎం వాణి ఎస్ హెచ్ జీ సభ్యులు ఉన్నారు.



## పోలిస్ నంటు ప్రజలను మోసం చేసే వ్యక్తి అరెస్టు, రిమాండ్.

## పోలీసుల విచారణలో మొబైల్ ఫోన్లో పోలీసు యూనిఫామ్ తో ఉన్న ఫోటోలు లభ్యం

**సమయజ్యోతి న్యూస్ గుడిహత్నూర్**

పోలీస్ స్టేషన్ పరిధిలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసు సిబ్బందికి అనుమానాస్పదంగా కనిపించిన ఒక వ్యక్తిని విచారించగా, ఆ వ్యక్తి నార్నూర్ కు చెందిన నిందితుడు కుద్మెతే నాగరావ్(30) అని, అతనిని విచారించగా అతని మొబైల్ ఫోన్ లో పోలీసు యూనిఫామ్ ధరించి ఉన్నటువంటి తన ఫోటోలను ప్రజలను మోసం చేసే ప్రయత్నం చేశాడని అతనిపై గుడిహత్నూర్ పోలీస్ స్టేషన్ నందు కేసు నమోదు చేసి, అరెస్టు చేసి రిమాండ్కు పంపినట్లు ఇచ్చోడా సిఐ బండారి రాజు తెలిపిన వివరాల ప్రకారం. గురువారం గుడిహత్నూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గుడిహత్నూర్ ఎక్స్ రోడ్ వద్ద నిందితుడు అనుమానాస్పదంగా ఉండగా అతనిని అరెస్టు చేసి విచారించగా, విచారణలో నిందితుడు తెలిపిన వివరాల ప్రకారం పోలీస్ డ్రెస్ ఉన్నటువంటి యూనిఫామ్ లో ఉన్న ఫోటోను జేబులో ఉంచుకొని మరియు వాట్సాప్ నందు ఆ ఫోటోని కనబడే విధంగా ఉంచుకొని, ప్రజల వద్ద డబ్బులు వసూలు చేశానని పేర్కొన్నాడని తెలిపారు. నకిలీ పోలీసుగా ప్రవర్తిస్తూ ప్రజలను మోసం చేస్తున్న ఇతనిపై కఠిన చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. ఇతని వద్ద నుండి మోటార్ సైకిల్ ను స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గుడిహత్నూర్ ఎస్సై మధు కృష్ణ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు



## మహనీయుల సేవలు చిరస్మరణీయం కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్**

రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్ లో జిల్లా వెనుకబడిన తరగతుల శాఖ మరియు జిల్లా యువజన క్రీడల శాఖల ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించగా, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా హాజరై ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి రోశయ్య జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.లిదొడ్డి కొమురయ్యకు నివాళిలికలెక్టర్ సందీప్ కుమార్ ఝా, దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో డి.వై ఎస్ ఓ రాందాస్, జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారి రాజ మనోహర్ రావు, జిల్లా అధికారులు, సిబ్బంది, ఆయా కుల సంఘాల బాధ్యులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ వసతి గృహాల్లో మెరుగైన వసతులు కల్పించాలి ఐటిడిఏ పిఓ ఖుష్బు గుప్త

**సమయజ్యోతి న్యూస్ నిర్మల్ బ్యూరో**

**జూలై 04.**

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ శాఖ బాలికల వసతి గృహాన్ని ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి ఖుష్బూ గుప్త ఆకస్మికంగా సందర్శించారు. వంటగది, స్టోర్ రూమ్, రికార్డులను పరిశీలించి పిఓ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందుతున్న బోధన, మౌలిక సదుపాయాలు, భోజన ఏర్పాట్లను ఆమె సమీక్షించారు. ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలలో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధనతో పాటు మెరుగైన వసతులు కల్పించాలని పి ఓ ఆదేశించారు. ప్రతి రోజు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని, పాఠశాల ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. ఈ సందర్భనలో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి అంబాజీ, ఉపాధ్యాయులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



## సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి ఆర్మూర్ టౌన్**

ఆర్మూర్ పట్టణంలో శుక్రవారం మున్సిపల్ కమిషనర్ రాజు ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా మురికి నీటిని నివారించాలని, పరిసరాల పరిశుభ్రత వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని మున్సిపల్ సిబ్బంది అవగాహన కలిగించారు. ఆయిల్ బాల్స్, గంబుషియా చేపల్ని, మలేరియా అధికారితో కలిసి తొమ్మిదో వార్డులో గల నీటి నిల్వ ప్రదేశాలలో వదలడం జరిగింది. అలాగే 24వ వార్డులో ఫ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని ఆశా కార్యకర్తలు మున్సిపల్ సిబ్బందితో కలిసి పాల్గొన్నారు. గృహ యజమానులకు, కూలర్లు పూల కుండీలు, టైర్లు ఖాళీ డబ్బలలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు.



## వృద్ధాశ్రమానికి నెల నిత్యవసర సరుకులు పంపిణీ, సన్మాన కార్యక్రమం

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిది ఆదిలాబాద్**

కే ఆర్ కె కాలని లో గల సీనియర్ సిటిజెన్ వృద్ధాశ్రమంలో స్పెషల్ తెలంగాణ 2 వ పోలీసు బెటాలియన్ యాపల్ గూడ వారి పోలీసు ట్రైనింగ్ ముగింపు లో భాగంగా ఆర్ ఎస్ ఐ గోపి గ సారథ్యం లో మిగితా కమాండో అధికార బృందం కలిసి స్థానిక వృద్ధాశ్రమంలో వారికి ఒక నెలకు సరిపడే నిత్యావసర వస్తువులు (బియ్యం, తోగారిపప్పు , పెసర పప్పు,చక్కెర, నూనె టీన్నులు, మొదలైనవి ఇచ్చి తాము 24 గంటల డ్యూటీ చేస్తూ సామాజిక సేవా చేస్తూ వారి దాన గుణాన్ని చాటుకున్నారు. అందులో భాగంగా వివిధ రంగాలలో సమాజ సేవ చేస్తున్న సామాజిక కార్యకర్త అయిన పసుపుల రాజు ను ఆ వృద్ధాశ్రమానికి పిలిసి చాలువ తో గౌరవంగా సత్కరించారు.




## ఘనంగా తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమరయ్య 79 వర్ధంతి వేడుకలు

**సమయజ్యోతి న్యూస్ జూలై 04 బజార్ హత్నూర్ బోథ్**

సోనాల మండల కేంద్రం లోకురుమ సంఘం ఆధ్వర్యంలోతెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య 79 వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి నివాళులు అర్పించారు ఈ సందర్భంగా కురుమ సంఘం సభ్యులు మాట్లాడుతూ భూమికోసం, భుక్తి కోసం, బడుగుల విముక్తి కోసం పోరాడిన తొలి అమరుడు రైతాంగ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమరయ్య అని కొనియాడారు ఈ కార్యక్రమంలో సోనాల మండలం కురుమ సంఘం అధ్యక్షులు కసిరి పోతన్న ప్రధాన కార్యదర్శి రామాయ శంకర్ సెక్రెటరీ రామాయ సదానందం సభ్యులు పోతన్న లక్ష్మయ్య శ్రీకాంత్ సాయి చిన్న రెడ్డి మరియు కోట రాజేశ్వర్ బోరే రవీందర్ కొండమడుగు గణేష్ సభ్యులు పాల్గొన్నారు




## ఏకలవ్య మోడల్ స్కూల్ వంట గదిని తనిఖీ చేసిన కలెక్టర్

**సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్**

కొనరావుపేట మండలం మర్రిమడ్ల గ్రామంలోని ఏకలవ్య మోడల్ స్కూల్ ను జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా శుక్రవారం తనిఖీ చేశారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రోగ్రాం కు ముందుగా హాస్టల్ పరిసరాలు, కిచెన్, నిలువ చేసిన ఆహార పదార్థాలు, పండ్లు, కూరగాయలు, బియ్యం, త్రాగు నీరు, తదితర అంశాలు తనిఖీ చేసారు.



## హైదరాబాదు ఎల్బి స్టేడియంలో జరగబోయే సభ కు బయలు దేరిన -కాంగ్రెస్ నాయకులు

**సమయజ్యోతి న్యూస్ జూలై 04 బజార్ హత్నూర్**

హైదరాబాద్ ఎల్ బీ స్టేడియం లో ఎ ఐ సీ సీ అధ్యక్షుడు మల్లికార్జున ఖడ్గే అధ్యక్షతన కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుల తో జరగబోయే సమ్మేళనకు బయలుదేరిన వారిలో బజార్ హత్నూర్ మాజీ జడ్పీటీసీ మల్లెపూల నర్సయ్య కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పాండురంగు కాంగ్రెస్ నాయకులు బయలు దేరినరు



# ఆర్మూర్ లో రైతులకు యూరియా సరఫరా

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి ఆర్మూర్ టౌన్**

ఆర్మూర్ మండల కేంద్రంలో శుక్రవారం మండల వ్యవసాయ అధికారి ఏ హరికృష్ణ ఆధ్వర్యంలో రైతులకు యూరియా పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. రైతుల సాగు బడికి కావలసినంత యూరియా సరఫరా అవుతుందని, ఆందోళన చెందవలసిన అవసరం లేదని ఆయన పేర్కొన్నారు.



# మల్లికార్జున్ ఖర్గే బహిరంగ సభకు కార్యకర్తలు

**సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్**

హైదరాబాద్ ఎల్బీనగర్ స్టేడియంలో ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే బహిరంగ సభకు ముస్తాబాద్ మండలం నుంచి మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఏళ్ల బాల్రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు నాయకులు కార్యకర్తలు భారీ ఎత్తున తరలి వెళ్లారు.




# మాజీ మంత్రి జోగు రామన్న కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన - బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాధవ్

**సమయజ్యోతి న్యూస్ జూలై 04 బజార్ హత్నూర్**

మాజీ మంత్రి ఆదిలాబాద్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు జోగు రామన్న జన్మదిన సందర్భంగా ఆదిలాబాద్ పట్టణంలోని ఎస్ టి యూ భవన్లో నిర్వహించిన జన్మదిన వేడుకలకు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాధవ్ బోథ్ నియోజకవర్గ నాయకులతో కలిసి భారీ కాన్వాయ్ తో హాజరయ్యారు. ఈ సందర్భంగా జోగు రామన్న కి ఘనంగా సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన రక్తదాన శిబిరంలో రక్తదానం చేసిన అభిమానులకు ఎమ్మెల్యే అనిల్ జాధవ్ సర్టిఫికేట్లను అందజేశారు. జోగు రామన్న ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ప్రజా సేవలో నిమగ్నమవ్వాలని కోరుకున్నారు. రానున్న స్థానిక సంస్థలు మనవేనని ఆదిలాబాద్ జిల్లా నుంచి కేసీఆర్ కి కానుకగా స్థానిక సంస్థల నాయకత్వాన్ని అందిద్దామని అన్నారు. వీరి వెంట బోథ్ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



# టూరిజం భాషా, సాంస్కృతి సభ్యుడికి కేకే శుభాకాంక్షలు

**సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్**

తెలంగాణ రాష్ట్ర టూరిజం, భాషా సాంస్కృతిక శాఖ సభ్యులుగా నియామకమైన అంతడుపుల నాగరాజుకు సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ కేకే మహేందర్ రెడ్డి అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు.



# కాంగ్రెస్ సభ పేరును సామాజిక అన్యాయ సమర భేరీగా మార్చుకోండి

## 50 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో ఒక్క బీసీకైనా ప్రధాని పదవిచ్చారా?

## కేంద్ర హెూమ్ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్

**సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్**



సామాజిక న్యాయ సమరభేరి పేరును మార్చుకోవాలని సూచిస్తున్నానని కేంద్ర హెూమ్ శాఖ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. శుక్రవారం వేములవాడ నియోజకవర్గంలోని కోనరావుపేట మండలం మరిమడ్ల గ్రామంలో కేంద్ర ప్రభుత్వం రూ.5 కోట్ల నిధులతో అభివృద్ధి పనులకు కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ శంకుస్థాపన చేసిన అనంతరం మాట్లాడారు. దాని స్థానంలో సామాజిక అన్యాయ సమర భేరీ పెట్టుకుంటే మంచిది. కాంగ్రెస్ ఏం ఉద్ధరించిందని ఈ సభను పెడుతున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలి. ఈ దేశాన్ని అర్ధశతాబ్దానికిపైగా కాంగ్రెస్ పాలించింది. ఇన్నేళ్లలో ఒక్కసారైనా బీసీని ప్రధానమంత్రిని చేశారా? బీజేపీ బీసీని ప్రధానిని చేసింది. దళిత వర్గానికి చెందిన రామ్ నాథ్ కోవింద్ ను, ఆదివాసీ బిడ్డ ద్రౌపది ముర్మును, మైనారిటీకి చెందిన అబ్దుల్ కలాంను రాష్ట్రపతిగా చేసిన ఘనత కూడా బీజేపీదే. చరిత్రలో ఎన్నడూలేని విధంగా 27 మంది ఓబీసీలను, 12 మంది దళితులను, 6గురు దళితులను, 8 మంది మహిళలను కేంద్ర కేబినెట్ లో చోటు కల్పించిన చరిత్ర బీజేపీదే. బీసీనైన నన్ను కేంద్ర మంత్రిగా చేసింది. పార్టీ పరంగా నాతోపాటు లక్ష్మణ్, దత్తాత్రేయలకు అనేక పదవులిచ్చింది బీజేపీ. బీసీకి చెందిన మోదీని ప్రధాని అయితే చాయ్ వాలా అంటూ హేళన చేసిన పార్టీ కాంగ్రెస్. అంతెందుకు ఉమ్మడి రాష్ట్రంలో 50 ఏళ్లపాటు అధికారాన్ని చెలాయించిన కాంగ్రెస్ పార్టీ ఒక్క బీసీనైనా సీఎం చేశారా? ఎందుకు చేయలేదు? బీజేపీ అధికారంలోకి వస్తే బీసీ సీఎం అవుతారని ప్రకటించిన నేత మోదీ. అట్లాగే 50శాతానికిపైగా బీసీ జనాభా ఉందని చెబుతున్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కేబినెట్ లో ఎంత మంది బీసీలకు అవకాశమిచ్చారు? బీసీ నేత పొన్నం ప్రభాకర్ కు పదవి ఇస్తే బీసీల గొంతు విన్పించారు. మరింత మంది బీసీలకు ఇస్తే న్యాయం జరిగేది కదా? మరి ఏ ముఖం పెట్టుకుని సామాజిక న్యాయ సమరభేరి సభ పెడుతున్నారు? బీసీల గురించి మాట్లాడే అర్హత కాంగ్రెస్ కు లేనేలేదు. మహిళలకు నెలనెలా రూ.2500లు, రూ.4 వేల ఆసరా పెన్షన్లు, రూ.4వేల నిరుద్యోగ భ్రుతి, విద్యార్థులకు రూ.5 లక్షల భరోసా కార్డు, ఎకరానికి ఇంకా రైతు భరోసా కింద రూ.21 వేలు బకాయి, బోనస్ బకాయిలు ఎందుకు ఇవ్వలేదు? ఇచ్చిన 6 గ్యారంటీలతోపాటు మేనిఫెస్టోలోని 420 హామీలను ఎందుకు అమలు చేయలేకపోయారు? ఈరోజు జరిగే సామాజిక న్యాయ సమర భేరీలో వీటిపై ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే సమాధానం చెప్పాలి. యూరియా కొరతపై కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కావాలనే కేంద్రాన్ని బదనాం చేస్తున్నాయి. లోకల్ బాడీ ఎన్నికల్లో బీజేపీకి పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధమవుతుంటే ఓర్వలేక బదనాం చేస్తున్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అనుభవజులు. అధికారులు ఆయనను తప్పుదోవ పట్టిస్తున్నారు. వాస్తవాలు గ్రహించాలని కోరుతున్నారు. తెలంగాణకు గత సీజన్ లో 9 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అవసరమైతే కేంద్రం 12 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా ఇచ్చింది. అదనంగా దాదాపు 3 లక్షల మెట్రిక్ టన్నులు యూరియా ఇచ్చింది. ఈ సీజన్ లో కూడా కోరినంత యూరియా ఇచ్చేందుకు కేంద్రం సిద్ధంగా ఉంది. కానీ గత సీజన్ లో అదనంగా కేటాయించిన యూరియా ఎటు పోయింది? వాటిని ఏం చేశారో లెక్కలు చెప్పకుండా కేంద్రాన్ని బదనాం చేయడం సరికాదు. ఈ విషయంలో అడ్డదారులు పడితే తగిన చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉంది. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అభ్యర్ధనను కూడా కేంద్రం సానుకూల ధోరణితో పరిశీలించేందుకు సిద్ధంగా ఉంది. ఇప్పటికైనా ప్రజలకు వాస్తవాలు చెప్పాలని కోరుతున్నానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా బిజెపి జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి మాజీ అధ్యక్షులు ప్రతాపరామకృష్ణ నాయకులు ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఇందిరా సౌర గిరిజల వికాస పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయండి

## -జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

**సమయజ్యోతి న్యూస్ నిర్మల్ బ్యూరో**

**జూలై 04.**




జిల్లాలో ఇందిరా సౌర గిరిజల వికాస పథకంను విజయవంతంగా, పారదర్శకంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి (పీవో) కుష్బూ గుప్తా, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పథకం కింద గిరిజనులు సాగు చేసుకుంటున్న పోడు భూములకు ఉచితంగా బోర్లు తవ్వించి, సోలార్ పంప్ సెట్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. దీని ద్వారా గిరిజన రైతులకు సాగునీటి సౌకర్యం లభించడంతో పాటు వ్యవసాయం అభివృద్ధి చెందుతుందని, వారి ఆర్థిక స్థితిగతులు మెరుగుపడతాయని చెప్పారు. గిరిజన గ్రామాల్లో వ్యవసాయ అవసరాల కోసం నీటి వనరుల అభివృద్ధికి ఈ పథకం ఎంతగానో తోడ్పడుతుందని, ప్రతి హబిటేషన్‌కు తగిన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. పథకం అమలులో భాగంగా, మండల స్థాయిలో ఎంపీడీవో అధ్వర్యంలో 9 మంది సభ్యులతో కమిటీలు ఏర్పాటు చేయాలని, అలాగే నియమ నిబంధనలపై అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండేందుకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఐటిడిఏ పీవో కుష్బూ గుప్తా మాట్లాడుతూ, లబ్ధిదారుల ఎంపికను పారదర్శకంగా నిర్వహించాలని, కమిటీలు అర్హులను గుర్తించి వారికి తగిన పరికరాలు అందజేయాలన్నారు. సాగునీటి సదుపాయం కలిగిన రైతులు వాణిజ్య పంటలు, కూరగాయలు, ఆయిల్ పామ్ వంటి పంటలను సాగుచేసేలా ప్రోత్సహించాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డీఎఫ్ఓ నాగిని భాను, జడ్పి సీఈఓ గోవింద్, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి అంబాజీ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అంజిప్రసాద్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, ఉద్యాన వన శాఖ అధికారి రమణ, ఎంపీడివో లు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# జీవితంలో విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలి

## కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్

**సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్**




జీవితంలో విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలని హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. శుక్రవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం మర్రిమడ్ల గ్రామంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ కు 5 కోట్ల 14 లక్షల రూపాయలతో చేపట్టిన అదనపు మౌలిక వసతుల నిర్మాణం పనులకు కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝ తో కలిసి శంకుస్థాపన, భూమి పూజ చేశారు. కేంద్ర మంత్రి విద్యార్థులు మార్చి ఫాస్ట్, సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా ఘనంగా స్వాగతం పలికారు. విద్యార్థులచే ఏర్పాటు చేసిన వైజ్ఞ విజ్ఞాన పరికరాలు ద్వారా ఏర్పాటు చేసిన ప్రదర్శనకు తిలకించి వాటి వివరాలను ఆరా తీశారు. అనంతరం ఏఐ సైన్స్ ల్యాబ్ ను ప్రారంభించి తరగతిలో విద్యార్థులతో విద్యాభ్యాసన గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఏకలవ్య పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ గిరిజన సంక్షేమ శాఖ ద్వారా ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ లో 5 కోట్ల 14 లక్షల రూపాయలతో స్టాఫ్ క్వాటర్స్, కాంపౌండ్ వాల్, అంతర్గత సీసీ రోడ్లు, లైటింగ్, బాలురు బాలికల వార్డెన్ గృహం నిర్మించడం జరుగుతుందని అన్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని వాటి సాధన దిశగా కృషి చేయాలని కేంద్ర మంత్రి సూచించారు. ప్రభుత్వం ఏకలవ్య రెసిడెన్షియల్ స్కూల్లో అందిస్తున్న సౌకర్యాలను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఆధునిక సాంకేతికత ద్వారా క్లిష్టమైన సమస్యల పరిష్కారం లభిస్తుందని, నూతన టెక్నాలజీ పిల్లలు అవగాహన కల్గి ఉండాలని అన్నారు. ఏకలవ్య రెసిడెన్షియల్ పాఠశాలల నుంచి మంచి దేశ పౌరులు తయారు కావాలని అన్నారు. భారత దేశము ప్రపంచంలోనే అగ్రగామిగా నిలిపేందుకు మనమంతా కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో తాసిల్దార్ వరలక్ష్మి, ఎంపీడీవో శంకర్ రెడ్డి, ప్రిన్సిపల్ ఆర్.ఎస్. యాదవ్, ఉపాధ్యాయులు ,ప్రజా ప్రతినిధులు , విద్యార్థులు , ట్రైబల్ వెల్ఫేర్ ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రామచంద్రరావుని సన్మానించిన కోటపాటి

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి ఆర్మూర్ టౌన్**

తెలంగాణ రాష్ట్ర నూతన అధ్యక్షుడు ఎన్ రామచంద్రరావును కోటపాటి నరసింహనాయుడు మర్యాదపూర్వకంగా కలిసి అభినందించి సన్మానించారు. 1983 నుంచి 86 వరకు ఉస్మానియా యూనివర్సిటీలో కలిసి పని చేసిన అనుబంధం ఉందని అన్నారు. ప్రముఖ న్యాయవాది ఊరే బాలయ్య బిజెపి సీనియర్ నాయకులు రుక్మాజీలు ఉన్నారు.



## శ్రీ ముత్యాల పోచమ్మ ఆలయంలో పూజలు.. అన్నదానం

**సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్**

రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలము మోహినికుంట గ్రామంలో శుక్రవారం శ్రీ ముత్యాల పోచమ్మ ఆలయంలో విశేష పూజలతో పాటు ఆలయ ప్రతినిధి రుద్రోజు శివకుమార్ లతా దంపతులు భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి శుక్రవారం అన్నదానం జరుపుతున్నారు.



## ఇర్రిగేషన్ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన - బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాధవ్

**సమయజ్యోతి న్యూస్ జూలై 04 బజార్ హత్నూర్**

ఆదిలాబాద్ పట్టణంలో గల పెన్ గంగ భవన్ లో శుక్ర వారం నాడు ఇర్రిగేషన్ శాఖ అధికారులతో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాధవ్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని ఇర్రిగేషన్ శాఖ అధికారులతో సంబంధిత సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాధవ్ మాట్లాడుతూ పిప్పలకోటి రిజర్వాయర్, దేగామ రిజర్వాయర్ భూ నిర్వాసితుల సమస్యలపై ఆరా తీశారు. అనంతరం తేజపూర్, బుగ్గరాం, పిప్రి, లిఫ్ట్ ఇర్రిగేషన్లపై సమీక్ష అదేవిధంగా ఆడిగామ, కజ్జర్ల, మత్తడి వాగు, చింతలబోరి, పురుషోత్తం పూర్, సీతాగొంది కేనాళ్ల మరమ్మతులపై సమీక్ష, అదేవిధంగా సిరిచేల్మా దేవాలయం వద్ద అలాగే మత్తడివాగు బ్రిడ్జిల నిర్మాణం, అదేవిధంగా నియోజకవర్గంలో కొనసాగుతున్న 11 చెక్ డ్యాంల పనుల పురోగతులపై ఆరా, పిప్పల కోటి మరియు చనక కొరట ప్రాజెక్టుల భూ సేకరణపై ఆరా తీశారు. బోథ్ నియోజకవర్గంలో ఉన్న అన్ని పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అన్నారు. నియోజకవర్గంలో నూతనంగా కావలసిన అవసరాలపై ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు.



# ప్రభుత్వాన్ని ప్రశ్నించిన వారిపై కేసులు పెట్టడం అన్యాయం

**సమయజ్యోతి న్యూస్ రామచంద్రాపురం**

ప్రభుత్వాన్ని ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు పెట్టడం అన్యాయం అని పటాన్చెరు బీఆర్ఎస్ పార్టీ కోఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి రాష్ట్ర బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ మన్నే కృష్ణాంక్ అన్నారు ఇటీవలి రోజుల్లో ప్రభుత్వాన్ని విమర్శించినందుకు బీఆర్ఎస్ సోషల్ మీడియా యాక్టివిస్టులపై అక్రమ కేసులు నమోదు చేయడం అరెస్టులు చేయడం తీవ్రంగా ఖండించదగిన చర్య అని వారు తెలిపారు గత నెల 30 న సోషల్ మీడియా వారియర్ నల్ల బాలు (శశిధర్ గౌడ్) ప్రభుత్వంపై ట్విట్టర్ ద్వారా అభిప్రాయాలు వ్యక్తం చేసినందుకే పోలీసులు ఆయనను అరెస్టు చేసి కరీంనగర్ సెంట్రల్ జైలుకు తరలించారు శుక్రవారం శశిధర్ గౌడ్‌ను తీసుకువచ్చి ఇంద్రేశం గ్రామంలోని ఆయన నివాసంలో ఏసిపి నరసింహ రెడ్డి నేతృత్వంలో పోలీసులు సోదాలు నిర్వహించారు ఈ దర్యాప్తులో తన కుటుంబ సభ్యుల ఫోన్ల ను తనిఖీ చేశారు అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పిన



నేతలు ఇది ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమైన చర్య అని తెలిపారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా ఖండిస్తూ ట్విట్టర్‌లో లైక్ చేస్తే కేసు రీట్వీట్ చేస్తే జైలు అనే పరిస్థితిని ఇప్పుడు తెలంగాణలో నెలకొల్పారని విమర్శించారు ఇది పూర్తిగా ప్రజాస్వామ్య హక్కులను అణచివేయడానికి పాలకులు ఎంచుకున్న నిబంధనలుగానీ బెదిరింపులుగానీ స్పష్టంగా కనిపిస్తోందని అన్నారుబీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వ అధికార దుర్వినియోగాన్ని తీవ్రంగా ఖండించారు ప్రభుత్వ నియంతృత్వ వైఖరిని ప్రజలు గమనిస్తున్నారని ప్రజాస్వామ్య హక్కుల కోసం పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ ఎన్ని అక్రమ కేసులు పెట్టినా ప్రజల తరపున ప్రజల హక్కుల కోసం ఈ దుర్మార్గ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిరంతరం ప్రశ్నిస్తూనే ఉంటాం అని శశిధర్ గౌడ్ అన్నారు

## కిసాన్ నగర్ లో సీఎంఆర్ఎఫ్ చిక్కుల పంపిణీ

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ**

బాల్కొండ మండలం కిసాన్ నగర్ లో మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి మంజూరు చేయించిన సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు శుక్రవారం టిఆర్ఎస్ నాయకులు అందజేశారు. ఎనిమిది మంది లబ్ధిదారులకు చెక్కులను ఇంటింటికి వెళ్లి పంపిణీ చేశారు. ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్న తమకు చెక్కులు అందజేసి ఆదుకున్నందుకు లబ్ధిదారులు కృతజ్ఞతలు వ్యక్తం చేశారు. మాజీ ఎంపీపీ నాగభూషణం, మాజీ ఎంపిటిసి రామరాజు గౌడ్, గ్రామ టిఆర్ఎస్ అధ్యక్షుడు శరత్, సీనియర్ నాయకులు షేక్ రహీముద్దీన్, ప్రసాద్ రావు, గంగాధర్, రాములు తదితరులు పాల్గొన్నారు.



## మత సామరస్యానికి ప్రతీక మొహర్రం ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

**సమయజ్యోతి న్యూస్ రామచంద్రాపురం**

మత సామరస్యానికి త్యాగనిరతికి మొహర్రం పర్వదినం ప్రతీకగా నిలుస్తుందని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు మొహర్రం సందర్భంగా ఆటో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు దస్తగిరి ఆధ్వర్యంలో పటాన్చెరు పట్టణంలోని బస్టాండ్ ఎదురుగా శుక్రవారం సాయంత్రం షర్బత్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో హిందూ ముస్లిం సోదరులు కలిసి నిర్వహించుకునే పండుగ మొహర్రం అన్నారు ధర్మ పరిరక్షణ శాంతియుత సమాజ స్థాపన కోసం మహమ్మద్ ప్రవక్త మనవడు హజ్రత్ ఇమామ్ హుస్సేన్ చేసిన ప్రాణత్యాగం నుంచి నేటి సమాజం తెలుసుకోవాల్సింది ఎంతో ఉందన్నారు ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్ అఫ్జల్ వెంకటేష్ షకీల్ ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు




## ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

**సమయజ్యోతి న్యూస్ రామచంద్రాపురం**

ప్రభుత్వ పాఠశాల బలోపేతానికి కృషి చేస్తున్నామని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు గడ్డపోతారం మున్సిపల్ పరిధిలోని వావిలాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మోల్డ్ టెక్ కంపెనీ సహకారంతో బాలవికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 25 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టనున్న రెండు అదనపు తరగతి గదుల నిర్మాణ పనులకు శుక్రవారం ఎమ్మెల్యే జిఎంఆర్ శంకుస్థాపన చేశారు,ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద మధ్య తరగతి విద్యార్థులు అత్యధికంగా విద్యను అభ్యసించే ప్రభుత్వ పాఠశాలలో ఆధునిక మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని తెలిపారు విద్యతోపాటు క్రీడారంగంపై ఆసక్తి పెంపొందించేలా ప్రతి పాఠశాలలో మైదానాలను ఏర్పాటు చేస్తూ వివిధ క్రీడలకు సంబంధించిన కోర్టులు నిర్మిస్తున్నామని తెలిపారు ప్రభుత్వం ఒక్కో విద్యార్థిపై వేలాది రూపాయలు ఖర్చు చేస్తోందని జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్న లక్ష్యంతో చదువుకోవాలని కోరారు ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్ మాజీ ఎంపీపీ రవీందర్ గౌడ్ బాల వికాస్ ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శౌరి రెడ్డి గడ్డపోతారం మున్సిపల్ కమిషనర్ వెంకటరామయ్య నవనీత్ రెడ్డి రవీందర్ పరిశ్రమ ప్రతినిధులు స్థానిక నాయకులు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు



## సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి బాల్కొండ**

బాల్కొండ మండల కేంద్రంలో శుక్రవారం మాజీ మండల కో ఆప్షన్ సభ్యులు సయ్యద్ ఫయాద్ అలీ, మొహమ్మద్ ఇఫ్తాకారుద్దీన్, బాధితుడు షైక్ చందపాషా కు 60 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేశారు. దీనికి సహకరించిన ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అబ్దుల్ జాకీర్ పాల్గొన్నారు.



# పారిశుధ్య కార్మికుల కోసమే ఈ వైద్య శిబిరం కమీషనర్ రాజలింగు

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి మందమర్రి**

100 రోజుల కార్యాచరణ కార్యక్రమ భాగంలో మందమర్రి మున్సిపల్ కమిషనర్ తుంగ పిండి రాజాలింగు డిస్టిక్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హరీష్ రాజు ఇతర డాక్టర్స్ తో చర్చించి ఆరోగ్య శిబిరం (హెల్త్ క్యాంప్) ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ టి రాజలింగు మాట్లాడుతూ శిబిరంలో మునిసిపాలిటీ లో ఔట్సోర్సింగ్ పారిశుద్య సిబ్బందికి, మున్సిపల్ సిబ్బందికి, మెప్మా స్వయం సహాయక సంఘాల సిబ్బందికి, 24 వార్డుల ఆర్పి లకు మందమర్రి ప్రాధమిక ఆరోగ్య కేంద్రం సహకారంతో ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. పారిశుధ్య సిబ్బంది ఆరోగ్యం దృష్ట్యా హెల్త్ క్యాంపు నిర్వహించడం జరిగిందని పారిశుధ్య కార్మికులకు వివిధ రకాల వైద్య పరీక్షలు చేయించుకోవచ్చని తెలిపారు. డెంగ్యూ మలేరియా వంటి వ్యాధుల బారిన పడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని వారు ప్రతినెలా ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా వైద్య పరీక్షలు చేయించుకోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ ఇంజనీరు ఎం సుమతీ, రెవిన్యూ అధికారి పి కృష్ణ ప్రసాద్, సీనియర్ అసిస్టెంట్లు జూనియర్ అసిస్టెంట్లు వార్డు అధికారులు, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ యం గోపికృష్ణ, మెప్మా ఇన్చార్జి టీఎంసీ ఏ రఘురాం, మున్సిపల్ సిబ్బంది, ఆరోగ్య శాఖ సిబ్బంది మెడికల్ అధికారి ఆర్ రమేష్, జూనియర్ డాక్టర్లు ఎం విష్ణు తేజ రెడ్డి, స్పందన, సూపర్వైజర్, ఎస్ కళావతి, హెల్త్ అసిస్టెంట్ లు సుజాత, రాజేశ్వరి, ఆశా వర్కర్లు పాల్గొనడం పాల్గొన్నారు.



# 9న బీడీ పరిశ్రమ బంద్ కు సమ్మె నోటీసు

**సమయజ్యోతి న్యూస్ ముస్తాబాద్**

కేంద్రం ప్రభుత్వ కార్మిక వ్యతిరేక చట్టాలను నిరసిస్తూ జూలై 9న జాతీయ సమ్మె లో బీడీ పరిశ్రమ బీడీ కార్మికులు, ప్యాకర్లు, బట్టి, చాటన్ నెలసరి ఉద్యోగులు, టేకేదార్లు సమ్మెలో పాల్గొని బంద్ పాటించాలని శు క్రవారం తెలంగాణ బహుళ జన బీడీ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ, ముస్తాబాద్ దేశాయి, లంగర్ కంపెనీ, ఠాకూర్ సాదేకర్ కంపెనీ మేనేజర్లకు సమ్మె నోటీసు ఇచ్చింది. రాష్ట్ర అధ్యక్షులు ఎస్.సిద్దిరాములు మాట్లాడుతూ బీడీ పరిశ్రమ పై ఆంక్షలు ఎత్తి వేయాలని, జిఎస్టీ తొలగించాలని, కొష్టా చట్టం రద్దు చేయాలని,10వేల జీవన భృతి, 9వేల పెన్షన్ ఇవ్వాలని, నాలుగు కోడ్లు రద్దు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం గత ఎన్నికల సందర్భంగా బీడీ కార్మికులకు ఇచ్చిన హామీ ప్రకారం, భేషరతుగా ప్రతి ఒక్కరికి, 4016 రూ.ల జీవన భృతి ఇవ్వాలనే డిమాండ్ల సాధనకై సమ్మె జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగారపు ఎల్లయ్య, సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు ముద్రకొల ఆంజనేయులు, టేకేదారులు శ్రీనివాస్, రగయ్య, శ్రీనివాస్. కిషన్, ప్యాకర్లు పాల్గొన్నారు.



# జూరాల ప్రాజెక్టును సందర్శించిన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి అమరచింత వనపర్తి జిల్లా.**

ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టును సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ శుక్రవారం సందర్శించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జూరాల ప్రాజెక్టు ను నిర్మించినప్పటి నుండి నేటి వరకు డ్యాం గేట్ల మరమ్మత్తుకు నోచుకోలేదని అన్నారు. డ్యాం గెట్లు రోప్ లు మార్చకపోవడం వల్ల డ్యాంకు ప్రమాదం పొంచి ఉందని అన్నారు. జూరాల ప్రాజెక్టులో లక్ష క్యూసెక్కుల నీళ్లు నిల్వ ఉన్నవి ఇంకా 12 లక్షల క్యూసెక్కుల నీళ్లు వచ్చిన డ్యాం కు ఎలాంటి ఇబ్బంది లేదని ప్రాజెక్టు అధికారులు చెప్పడం చాల వింతగా ఉందని అన్నారు. మంత్రులు డ్యాంను సందర్శించినప్పుడు రోప్ లు వారి కళ్ళకు కనబడలేదా అని అయన ప్రశ్నించారు. డ్యాం కు ఎలాంటి ముప్పు లేదని మంత్రులు చెప్పడం విడ్డూరంగా ఉందని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి తన సొంత జిల్లాలో ప్రాజెక్టుకు ప్రమాదంలో ఉందని తెలిసిన పట్టించుకోకుండా ఒకరిపై ఒకరు బురద చల్లడం మానుకొని జూరాల ప్రాజెక్టు కు తక్షణమే నిధులు కేటాయించి గేట్లను మరమ్మతు చేపట్టాలని కోరారు. వీరి వెంట అఖిల భారత కిసాన్ సాంఘ్ జాతీయ ఉపాధ్యక్షుడు సారంపల్లి మల్లారెడ్డి, సిపిఎం పార్టీ రాష్ట్ర నాయకులు శ్రీరాం నాయక్, సిపిఎం పార్టీ వనపర్తి జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు, గద్వాల జిల్లా కార్యదర్శి ఏ.వెంకటస్వామి, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.డి. జబ్బర్, సిపిఎం పార్టీ అమరచింత మండల కార్యదర్శి జి.ఎస్. గోపి, ఆత్మకూరు మండల కార్యదర్శి ఎస్.రాజు, మదనాపురం మండల కార్యదర్శి వెంకట రాములు, సిపిఎం పార్టీ నాయకులు ఆర్.ఎన్. రమేష్, బి. వెంకటేష్, శ్యాంసుందర్, రాఘవేందర్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.



# ఖర్గే, రేవంత్ రెడ్డి సమక్షంలో టీపీసీసీ పీఏసీ సమావేశంలో ప్రసంగించిన షబ్బీర్ అలీ

**సమయజ్యోతి న్యూస్ హైదరాబాద్, జూలై 5:**

తెలంగాణ ప్రభుత్వ సలహాదారు మొహమ్మద్ అలీ షబ్బీర్ గాంధీ భవన్‌లో శుక్రవారం నిర్వహించిన తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) రాజకీయ వ్యవహారాల మరియు సలహా కమిటీ ( పిఎసి) సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. ఈ సమావేశానికి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధ్యక్షత వహించారు.ఈ సమావేశానికి తెలంగాణ సీఎం ఎ. రేవంత్ రెడ్డి, ఏఐసీసీ జనరల్ సెక్రటరీ కె.సి. వేణుగోపాల్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు మరియు ఇతర ప్రముఖ కాంగ్రెస్ నేతలు హాజరయ్యారు.షబ్బీర్ అలీ మాట్లాడుతూ రాష్ట్రంలో పార్టీ బలోపేతానికి, గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయికి పార్టీ మన్నన పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై తన సూచనలు సమర్పించారు. రాబోయే ఎన్నికల నేపథ్యంలో టీపీసీసీ కార్యకలాపాలను సమీక్షించేందుకు, సమన్వయం పెంపొందించేందుకు ఈ పిఎసి సమావేశం నిర్వహించబడింది.పార్టీ జాతీయ దిశానిర్దేశం ప్రకారం రాష్ట్ర కాంగ్రెస్ నేతలు కలిసికట్టుగా ముందుకు సాగాలని ఈ సమావేశం ద్వారా ప్రతిజ్ఞ తీసుకున్నారు. పార్టీ వ్యూహాలను మరింత బలోపేతం చేయాలనే సంకల్పంతో సమావేశం విజయవంతంగా ముగిసింది.



# కొత్త రేషన్ కార్డుదారులకు బియ్యం పంపిణీ చేయాలి.

**సమయజ్యోతి న్యూస్ ప్రతినిధి అమరచింత వనపర్తి జిల్లా.**

కొత్త రేషన్ కార్డుదారులకు రేషన్ షాప్ నుండి బియ్యం పంపిణీ చేయాలని సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో అమరచింత తహసిల్దార్ కార్యాలయం ఎదురు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఐ పార్టీ పట్టణ కార్యదర్శి ఏ.రవీందర్, సీనియర్ నాయకుడు భాస్కర్ మాట్లాడుతూ కొత్తగా రేషన్ కార్డులు మంజూరు చేసి పేదలకు బియ్యం పంపిణీ చేయడం మర్చిపోయారని అన్నారు. తక్షణమే వారికి రేషన్ బియ్యాన్ని పంపిణీ చేయాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ రవి కుమార్ కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు శ్యామ్ సుందర్, ఎర్రన్న,సౌలు,కంకలి తిరుపతి,కె. ఇజ్రాయెల్, వినోద్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.



# అనిరుద్ వ్యాఖ్యలపై పిసిసి సీరియస్

**హైదరాబాద్,జూలై4(సమయజ్యోతి):**

జడ్చర్ల నియోజక వర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డిపై పీసీసీ సీరియస్ అయింది. అనిరుద్ రెడ్డి వ్యాఖ్యలపై నివేదిక ఇవ్వాలని క్రమశిక్షణ కమిటీకి టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ ఆదేశాలు జారీ చేశారు. సోమవారం జరిగే క్రమశిక్షణ కమిటి సమావేశంలో అనిరుద్ రెడ్డికి షోకాజ్ నోటీసులు ఇచ్చే అవకాశం ఉంది. ఇటీ–వల జడ్చర్లలో కీలక కామెంట్స్ చేసిన అనిరుద్ రెడ్డి. తెలంగాణలో టీడీపీ కోవర్టులున్నారని వ్యాఖ్యాలు చేశారు. ఇరిగేషన్, రోడ్ల కాంట్రాక్టులు అవ్వడం మానేస్తే.. అంతా సెట్ అవుతుందన్న జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి పేర్కొన్నాడు.

# హైడ్రా కూల్చివేతలను అడ్డుకున్న కార్పోరేటర్

**హైదరాబాద్,జూలై4(సమయజ్యోతి):**

హైడ్రా కూల్చివేతలను అడ్డుకున్న కార్పోరేటర్ అడ్డుకున్నారు. హైదరాబాద్‌లోని లింగంపల్లి హుడా ట్రేడ్ సెంటర్ ప్రాంతంలో హైడ్రా ఆధ్వర్యంలో నాలా ఆక్రమణల తొలగింపు చేపట్టారు. ఈక్రమంలో శేరిలింగంపల్లి కార్పొరేటర్ నాగేందర్ యాదవ్ పనులను అడ్డుకున్నారు. హైడ్రా అధికారులతో వాగ్వాదానికి దిగారు. నాలాలోకి వచ్చిన భవనాలు కూల్చకుండా సోమేశ్వరాలయానికి సంబంధించిన భూమి స్వాధీనం చేసుకొని నాలా నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు. అందుకు దేవాదాయ శాఖ అధికారిణి భారతి ఆక్షేపించారు. నాలా ఆక్రమించిన వారిని వదిలేసి దేవాలయ భూమిని ఎలా స్వాధీనం చేసుకుంటారని ప్రశ్నించారు. ఈ విషయంలో కార్పొరేటర్‌ను కలగజేసుకోవద్దని కోరారు. చర్చలు సాగుతున్న క్రమంలో కూల్చివేతలు తాత్కాలికంగా ఆగిపోయాయి.

# జూరాలకు భారీగా వరదనీరు

## 14 గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల

**గద్వాల,జూలై4(సమయజ్యోతి):**

ఎగువ ప్రాంతంలోని మహారాష్ట్ర, కర్ణాటకలో కురుస్తున్న వర్షాల కారణంగా కృష్ణానది పరీవాహక ప్రధాన జలాశయాలు పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకొని జలకళను సంతరించు కున్నాయి. శుక్రవారం ఎగువ ప్రాంతం నుండి జూరాలకు 1,15,000 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుండగా... ప్రాజెక్టు 14 గేట్లు దిగువకు 95,566 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. జూరాల కుడి, ఎడమ కాలువలు, బీమా లిఫ్ట్ 1, విద్యుత్ ఉత్పత్తికి, కోయిల్ సాగర్ సమాంతర కాలువలకు అన్నింటికీ కలిపి 1,27,659 క్యూసెక్కులకు వదులుతున్నట్లు– జూరాల వరద నియంత్రణ కార్యాలయ అధికారులు తెలిపారు. శుక్రవారం ఆల్మట్టి జలాశయం పూర్తిస్థాయి మట్టం 129.72 టిఎంసిలకు గాను 90.91 టిఎంసిల నీరు నిల్వ ఉంది.

# జల్‌జీవన్ మిషన్‌కు అత్యంత ప్రాధాన్యం

-గత ప్రభుత్వం ఈ పథకాన్ని పట్టించుకోలేదు

-ప్రకాశం జిల్లాల్లో 1290 కోట్లతో ప్రాజెక్ట్

-మంచినీటి సమస్య తీర్చేందుకు ప్రత్యేక శ్రద్ద

-వైకాపా బెదిరింపులకు భయపడేది లేదు

-వారు మళ్లీ అధికారంలోకి రావడం కల్ల

-ప్రకాశం జిల్లా పర్యటనలో డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్



**ఒంగోలు,జూలై4(సమయజ్యోతి):** గత జగన్ ప్రభుత్వం జల్‌జీవన్ మిషన్‌ను పట్టించుకోలేదని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆరోపించారు. దీంతో గ్రామాలకు శుద్దజలాలన్ని అందించే అవకాశం లేకుండా పోయిందని అన్నారు. అలాగే గత వైసీపీ ప్రభుత్వంలో ప్రకాశం జిల్లాని అభివృద్ధి చేయకుండా పూర్తిగా నిర్లక్ష్యం చేశారని మండిపడ్డారు. వెలుగొండ ప్రాజెక్ట్ పనులని పూర్తిగా నిర్లక్ష్యంగా గాలికి వదిలి వేశారని విమర్శించారు. గత పాలకులు రౌడీయిజం, గుండాయిజంలను మాత్రమే నమ్ముకున్నారని ధ్వజమెత్తారు. శుక్రవారం ప్రకాశం జిల్లాలోని మార్కాపురంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పర్యటించారు. మార్కాపురం మండలం నరసింహాపురం వద్ద రూ. 1290 కోట్లతో జల్ జీవన్ మిషన్ పనులకి శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా భారీ బహిరంగ సభలో పవన్ కల్యాణ్ ప్రసంగించారు. తమ ప్రభుత్వం కక్ష తీర్చుకునేది కాదని... తప్పులు చేస్తే శిక్షించే ప్రభుత్వమని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. వ్యక్తిగతంగా తనకు ఎవరిపైనా కోపం లేదని చెప్పుకొచ్చారు. కుత్తుకలు కోస్తాం అనే వైసీపీ తాటాకు చప్పుళ్లకు భయపడమని అన్నారు. మళ్లీ అధికారం లోకి ఆ పార్టీ నేతలు ఎలా వస్తారో చూద్దామని చెప్పారు. వైసీపీకి 151 సీట్లు వచ్చి... తాను రెండు చోట్ల ఓడినప్పుడు కూడా వారిని ఎదిరించానని గుర్తుచేశారు. సినిమా డైలాగులు నిజజీవితంలో బాగుండవని చెప్పుకొచ్చారు. తలదించుకుని పనిచేస్తున్న వారిని రెచ్చగొట్టవద్దని హితవు పలికారు. సామాన్యులను బెదిరించడం వల్లే వైసీపీకి ఈ దుస్థితి వచ్చిందని పవన్ కల్యాణ్ విమర్శించారు. 'నేను ప్రభుత్వ ఉద్యోగి కొడుకును కాబట్టి ప్రకాశం, నెల్లూరుతో సహా ఐదారు జిల్లాలో తిరిగాను. నెల్లూరులో నాకు ఇంటర్‌మీడియట్ సీట్ ఆనం వివేకానంద రెడ్డి ఇప్పించారు. ప్రకాశం జిల్లా అంటే గుర్తుకు వచ్చేది ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు. సైమన్ కమిషన్‌కి ఎదురొడ్డి నిలిచిన ధైర్యవంతుడు ప్రకాశం పంతులు. ప్రకాశం జిల్లాలో అపారమైన ఖనిజాలు ఉన్నాయి. జగన్ హయాంలో అభివృద్ధిలో ఈ జిల్లాని పూర్తిగా నిర్లక్ష్యానికి గురిచేశారు. దశాబ్దాలుగా వెలుగొండ ప్రాజెక్ట్ పూర్తి చేయలేదు. ఒంగోలులో రెండు సంవత్సరాలు, కనిగిరిలో ఆరు నెలలు మేము ఉన్నాం. కనిగిరిలో ఫ్లోరైడ్ సమస్యతో అక్కడి నుంచి మేము వెళ్లిపోయాం. జల్ జీవన్ పనులు మొదటి ప్రయారిటీ ప్రకాశం జిల్లాకి ఇచ్చామని అన్నారు. ప్రకాశం జిల్లాలో తాగునీటి సమస్య పరిష్కరించడమే ప్రధాన లక్ష్యం. వెలిగొండ ప్రాజెక్టుకు రూ.4 వేల కోట్లు కావాలి. జల్ జీవన్ మిషన్ పథకాన్ని ఆపేస్తున్నామని కేంద్రం మాకు చెప్పింది. నీళ్లు ఇవ్వడం అన్నది రాష్ట్రానికి సంబంధించింది. కేంద్ర మంత్రి పాటిల్‌ను కలిసి అన్ని విషయాలు వివరించా. నీటి ఎద్దడి ప్రాంతాలకు రూ.84 వేల కోట్లు అవసరమవుతాయని చెప్పాం. ప్రస్తుతం జల్ జీవన్ మిషన్ మొదటి విడత రూ.1,290 కోట్లతో శంకుస్థాపన చేసుకున్నాం. స్వాతంత్ర్యం వచ్చాక తొలి సారిగా ప్రకాశం జిల్లాలో అతిపెద్ద తాగునీటి పథకమిదే. దాదాపు 10 లక్షలకు పైచిలుకు జనాభాకు తాగునీటిని అందించబోతున్నాం అని వివరించారు.

గత పాలకులు రూ.లక్షల కోట్లు అప్పులు పెడితే వాటన్నింటిని తట్టుకుని ఇవాళ ముందుకెళ్తున్నాం. వారి

హయాంలో ఎలాంటి తాగునీటి పథకం చేపట్టలేదు. ఎన్నికల ముందు శిలాఫలకాలు వేసేందుకే పరిమితమయ్యారు. కూటమి ప్రభుత్వం వచ్చాక జల్‌జీవన్ మిషన్ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్తున్నాం. సకాలంలో నిధులు వస్తే 18 నుంచి 20 నెలల్లో పూర్తి చేస్తాం. నేను ప్రత్యేకించి ఈ పథకాన్ని పర్యవేక్షిస్తా. లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయం భూములు దోచుకోవాలనుకుంటే అంతే సంగతి. వైకాపా హయాంలో ఎక్కడ ఖాళీ భూములు కనిపించినా వాటిని దోచేశారు. ఆక్రమణకు గురైన ఆలయాల భూములను తిరిగి వెనక్కి తీసుకునే పక్రియ ప్రారంభించాం. వాటికి రక్షణ కల్పించే బాధ్యత కూటమి ప్రభుత్వం తీసుకుందని పవన్ కల్యాణ్ అన్నారు. కార్యక్రమంలో మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, డోలా బాలవీరాంజనేయ స్వామి, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమంపై చర్చిద్దాం రండి

ఢిల్లీలో ఉండే మోడి...గల్లీలో ఉండే కెడీ అయినా చర్చకు సిద్దం

కేవలం 9 రోజుల్లో 9 వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ

ఏడాదిలో 60వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశాం

ఇచ్చిన హామీలను అమలు చేస్తున్న ఘనత తమదే

ఎల్బీ స్టేడియం సామాజిక సదస్సులో సిఎం రేవంత్



**హైదరాబాద్,జులై 4(సమయజ్యోతి):** ఢిల్లీలో ఉండే మోడీ అయినా, గల్లీలోని కేడీ అయినా.. రైతు సంక్షేమం విషయంలో తేల్చుకునేందుకు రండి, సవాళ్లకు సిద్ధమని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ క్రమంలో బీఆర్ఎస్, బీజేపీ నేతలకు గట్టి సవాల్ విసిరారు. కేవలం 9 రోజుల్లో 9 వేల కోట్ల రూపాయలను రైతుల ఖాతాల్లో జమ చేసి, వ్యవసాయాన్ని దండుగ నుంచి పండుగగా మార్చిన ఘనత తమదంటూ రేవంత్ రెడ్డి గర్వంగా వెల్లడించారు. 24 గంటల ఉచిత కరెంట్, రుణమాఫీ సహా రైతు సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేసి తెలంగాణ వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసినట్లు తెలిపారు. ఇచ్చిన హామీ మేరకు ఏడాదిలో 60వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశామని అన్నారు. ఇది కాదని నిరూపించగలరా అని సవాల్ చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయ సమరభేరి సభలో భాగంగా పార్టీ నేతలు, కార్యకర్తలను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు.

ఈ నేపథ్యంలో రైతుల శ్రేయస్సు కోసం చేసిన పనులపై బహిరంగ చర్చకు రావాలని బీజేపీ, బీఆర్ఎస్ నేతలకు రేవంత్ సవాల్ చేశారు. రైతుల బాగు కోసం ఎవరు ఎంత చేశారో తేల్చుకునేందుకు రావాలని కోరారు. రైతుల కోసం 18 నెలల్లో రూ.1.04లక్షల కోట్లు ఖర్చు చేశాం. వరి వేస్తే ఉరి వేసుకున్నట్టేనని గత సీఎం చెప్పారు.. 2.80 కోట్ల మెట్రిక్ టన్నుల వరిధాన్యం పండించి దేశానికే ఆదర్శంగా నిలిచాం. రైతుభరోసాలో ప్రభుత్వం విఫలమవుతుందని కొందరు ఎదురు చూశారు.. కానీ వారి ఆశ నెరవేరలేదు. రైతు రాజ్యం ఎవరు తెచ్చారో.. ఎక్కడైనా చర్చ చేసేందుకు సిద్ధం. చర్చకు ఎవరొస్తారో రండి.. కేసీఆర్, మోదీ, కిషన్‌రెడ్డి.. ఇలా ఎవరొచ్చినా సరే. కేసీఆర్‌ను ప్రశ్నిస్తున్నా.. పేదలు ఎప్పుడూ బర్రెలు, గొర్రెలు మేపుతూనే బతకాలా?కేసీఆర్, మోదీకి సవాల్ విసురుతున్నా. లెక్క కావాలంటే చెప్పండి.. అందర్నీ తీసుకొచ్చి స్టేడియంలో నిలబెట్టి లెక్కవేయిస్తా. 60వేలకు ఒక్కరు తక్కువ వచ్చినా కాళ్లు మొక్కి

తప్పుకొంటా' అని రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రస్తుతం తెలంగాణ ఆర్థిక వ్యవస్థలో అనేక ఇబ్బందులు ఉన్నప్పటికీ, ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక సంస్కరణలు, పథకాలను అమలు చేస్తోందన్నారు. అనేక కష్టాలు ఎదురైనప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం నిలబడి, సమస్యలను అధిగమించి, ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలను అందించే దిశగా పనిచేస్తోందన్నారు. ఈ క్రమంలో తెలంగాణ రైతులు ఈ ఏడాది 2 కోట్ల మెట్రిక్ టన్నుల రైస్‌ను ఉత్పత్తి చేసినట్లు సీఎం గుర్తు చేశారు. ప్రజా పాలనలో ఈ ధాన్యాన్ని కొనుగోలు చేసి, రైతులకు సరైన ధర అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. కేవలం 9 రోజుల వ్యవధిలో రూ. 9 వేల కోట్లను రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. ఈ నిర్ణయంతో రైతులకు ఆర్థిక భరోసాను అందించడమే కాకుండా, వ్యవసాయాన్ని ఒక పండుగగా మార్చిందని రేవంత్ రెడ్డి తెలిపారు. రైతులకు 24 గంటల ఉచిత కరెంట్ సరఫరా చేయడం ద్వారా వ్యవసాయ ఉత్పాదకతను పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం సామాజిక న్యాయం, రైతు సంక్షేమం, ఆర్థిక పునరుద్ధరణ కోసం అనేక కార్యక్రమాలను అమలు చేస్తుందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. మూడు రంగుల జెండా చేతబూని కల్వకుంట్ల గడీని బద్దలు కొట్టామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రతి గుండెను తడుతూ ప్రజాపాలన సాగిస్తున్నామని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో అసెంబ్లీ, పార్లమెంట్ సీట్లు పెరగబోతున్నాయని.. మహిళలకు రిజర్వేషన్లు అమలు కానున్నాయని చెప్పారు. కార్యకర్తలకు అన్ని పదవులు దక్కే వరకూ విశ్రాంతి తీసుకోబోనని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో 100 అసెంబ్లీ సీట్లు గెలిచి మళ్లీ అధికారంలోకి వస్తామని.. దాని కంటే ఒక్క సీటు తక్కువ వచ్చినా తనదే బాధ్యతని చెప్పారు. 'కాంగ్రెస్ నేతలు కలిసి ఉండలేరని.. ఈ పాలన మూణ్నాళ్ల ముచ్చటే అని కొందరు అన్నారు. కానీ.. పార్టీ నేతలంతా ఐకమత్యంతో పనిచేస్తూ ఆ అపోహలను పటాపంచలు చేశారు. జనగణనతో పాటు కులగణన.. ఎస్సీ వర్గీకరణ చేస్తామని గతంలో రాహుల్‌గాంధీ మాటిచ్చారు. హామీ ఇచ్చినట్టుగానే ఏడాదిలోపే కులగణన, ఎస్సీ వర్గీకరణ చేసి చూపించాం. 18 నెలల్లో దేశానికే ఆదర్శంగా నిలిచేలా తెలంగాణ మోడల్ ఆవిష్కరించాం. కష్టాలు, ఒడిదొడుకులు వచ్చాయి.. అన్నీ అధిగమించి ముందుకెళుతున్నాం. ఈ కార్యక్రమానికి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దీంతోపాటు అనేక మంది కాంగ్రెస్ నేతలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఆరు నెలలకోసారి మహిళలకు ఆరోగ్య పరీక్షలు తప్పనిసరి

స్వయం సహాయక సభ్యులు ఓపెన్ స్కూల్లో చేరాలి

పిల్లలను ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడీలో చేర్పించాలి.

"శుక్రవారం సభ"లో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

ప్రతి మహిళ ఆరు నెలలకు ఒకసారి ఆరోగ్య మహిళ కార్యక్రమం లో ఉచిత వైద్య పరీక్షలు చేయించుకోవాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు.తిమ్మాపూర్ మండలం రేణికుంట రైతు వేదికలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం సభ జరిగింది.ఈ సభకు హాజరైన జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మహిళలు తమ ఆరోగ్యం పై దృష్టి పెట్టాలని అన్నారు. సుమారు 50 వేల ఖరీదు చేసే "ఆరోగ్య మహిళ" ఉచిత వైద్య పరీక్షలను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరు నెలలకు ఒకసారి చేయించుకోవాలని సూచించారు. బిపి, షుగర్ వంటి వ్యాధులకు సంబంధించిన అన్ని మాత్రలు ప్రభుత్వ ఆసుపత్రుల్లో లభిస్తాయని, ఖర్చు పెట్టి బయట కొనద్దని తెలిపారు. ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలను సంప్రదించినా ఈ మాత్రలను ఉచితంగా అందిస్తారని తెలిపారు. మాతా శిశు సంరక్షణ కేంద్రంతో పాటు అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనూ ప్రసవాలకు సౌకర్యాలు ఉన్నాయని, ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించి సిజేరియన్ చేయించుకోవద్దని తెలిపారు. ప్రభుత్వం ఆధ్వర్యంలోనే గర్భిణీలకు నాలుగు ఉచిత వైద్య పరీక్షలతో పాటు టీఫా స్కానింగ్ చేయిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో సాధారణ ప్రసవాలు జరిగిన వారు తోటి మహిళలకు అక్కడ ఉన్న సౌకర్యాల గురించి వివరించాలని సూచించారు.శుక్రవారం సభకు ముందు చాలామంది గర్భిణీలకు హిమోగ్లోబిన్ పరీక్ష గురించి కూడా తెలియదని అన్నారు. ప్రస్తుతం గర్భిణీలు తాము ఏ పరీక్ష చేయించుకోవాలో ఏ ఆహారం తీసుకోవాలో శుక్రవారం సభలో తెలుసుకుంటున్నారని అన్నారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు చదువుకోవాల్సిన అవసరం ఉందని, చదువు మధ్యలో ఆపేసిన వారు ఓపెన్ స్కూల్లో చేరి పదవ తరగతి ఇంటర్ పూర్తి చేయాలని సూచించారు. రేణికుంట గ్రామస్తులంతా తమ పిల్లలను అంగన్వాడీలు, ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలని కోరారు. శుక్రవారం సభ ప్రారంభించి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా కేక్ కట్ చేశారు. చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం నిర్వహించారు. పోషకాహారం స్టాల్ ను సందర్శించారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, ప్రోగ్రాం అధికారి సనా, తహసిల్దార్ శ్రీనివాస్ రెడ్డి, ఎంపీడీవో విజయ్ కుమార్, ఎంఈఓ శ్రీనివాస్, సిడిపిఓ శ్రీమతి పాల్గొన్నారు.

## ప్రాథమిక పాఠశాల సందర్శన

రేణికుంట లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సందర్శించారు. ఇక్కడ రెండవ తరగతి చదువుతున్న విద్యార్థులతో మమేకమయ్యారు. వారితో ముచ్చటిస్తూ ఇంగ్లీషు పాఠాలను చదివించారు. చదవడంలో మెళకువలను నేర్పిస్తూ వారితో పాటు పాఠం చదివారు. ప్రాథమిక విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే రీతిలో బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి పూర్వ ప్రాథమిక విద్య జూలై నెల సిలబస్ ను అడిగి తెలుసుకున్నారు. ఖాళీగా ఉన్న పాఠశాల భవనాన్ని పరిశీలించి అవసరమైతే అంగన్వాడీ కేంద్రం సేవలకు వినియోగించుకోవాలని సూచించారు.





# ఎలాబోతారం లో స్వచ్ఛతపై సర్వే

గ్రామాలన్నీ స్వచ్ఛంగా విలసిల్లాలనే సంకల్పంతో స్వచ్ఛ సర్వేక్షణ్-2025లో భాగంగా పారిశుద్ధ్య పరిస్థితిని మెరుగుపరిచేందుకు గ్రామ పంచాయతీల్లో కేంద్ర ప్రభుత్వ సర్వే బృందం.. ఆధ్వర్యంలో 'ఆకా డమీ ఆఫ్ మేనేజ్ మెంట్ స్టడీస్' అనే సంస్థ నుంచి ఈరోజు కరీంనగర్ మండలం లోని ఎలాబోతారం లో ప్రతినిధులు పర్యవేక్షణకు వచ్చారు. చెత్త సేకరణ తీరు, పారిశుద్ధ్య సిబ్బంది చెత్త తరలింపు, ప్రభుత్వ సంస్థల పనితీరు తదితర అంశాలపై నేరుగా ప్రజలతో మాట్లాడి వివరాలు సేకరించారు. చెత్త సేకరణ, వ్యర్థాల నిర్వహణ, సెగ్రిగేషన్ షెడ్డులో ఎరువుల తయారీ, ప్లాస్టిక్ వినియోగం, ఇంకుడు గుంతల నిర్మాణం, శుద్ధ మైన తాగునీటి సరఫరా, పచ్చదనం, ప్రభుత్వ సంస్థలు,పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, బహిరంగ ప్రదేశాల్లో పారిశుధ్య పరిస్థితి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న కార్యక్రమాల అమలు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకొని మార్కులు కేటాయిస్తూ సర్వే నిర్వహించారు. గ్రామంలో 16 నివాస గృహాలను సందర్శించి వారి అభిప్రాయాలను క్రోడీకరించి పరిశీలించారు. అంతకుముందు అకడమీక్ ఆఫ్ మేనేజ్ మెంట్ సూపర్ వైజర్లు సురేష్, మధుకర్ రీసెర్చ్ ఇన్వెస్టిగేటర్స్ రాణి, రజిత, అనూష, శీరీష లు కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతిని కలిశారు. పారిశుద్ధ్య నిర్వహణ, జిల్లా యంత్రాంగం తీసుకుంటున్న చర్యలను కలెక్టర్ వివరించారు. ఈ కార్యక్రమంలో శ్రీధర్, జగదీశ్వర్, జిల్లా కో ఆర్డినేటర్స్ రమేష్, వేణు, మండల పంచాయతి అధికారి జగన్ మోహన్ రెడ్డి, పంచాయతి కార్యదర్శి కిరణ్ కుమార్, మహేందర్ రావు, వెంకటేశ్వర్, మహేందర్, రామ, కిషోర్, ఫారుక్, అంగన్వాడీ టీచర్స్,ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# కలవరపెడుతున్న ఉద్యోగరంగం !

ఐటి రంగం ఎంతగా ఊరిస్తుందో..అంతగా క్షోభ పెడుతోంది. ప్రపంచవ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉంది. ఐటి ఉద్యోగులకు ఉన్నపళంగా ఉద్యోగాల నుంచి తొలగిస్తున్నారు. ఇటీవలల కాలంలో పెద్ద ఎత్తున ఉద్యోగాల నుంచి తొలగించేస్తున్నారు. స్కిల్ లేకపోవడం కన్నా..ఖర్చులు తగ్గించుకునే ఉద్దేశ్యంతో తొలగిస్తున్నారు. పేరు ప్రతిష్టలు ఉన్న కంపెనీలే ఇలా చేస్తున్నాయి. జీతం ఎక్కువగా ఉన్న ఉద్యోగులనే టార్గెట్ చేస్తున్నారు. దీంతో ఉన్న ఉద్యోగం ఊడిపోవడంతో కొందరు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. నిజంగానే ఖర్చు తగ్గించుకునే పద్దతిలో వారిని పిలిచి జీతంలో కోతలు విధించి, వారిని కొనసాగించవచ్చు. కానీ ఆలా జరగడం లేదు. ఇకపోతే తెలుగు రాష్ట్రాల్లో నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉంది. సమస్య కొండంతగా ఉంటే చర్యలు మాత్రం గోరంత అన్నచందంగా ఉన్నాయి. మరోవైపు ఐటి కంపెనీల్లో తీసివేతలు పెరుగుతున్న తీరు తీవ్రంగా కలవరపెడుతోంది. ఉద్యోగం పోయినా బతకవచ్చున్న ధీమా లేకుండా పోతోంది. దానికి ఏదైనా రంగంలో రాణించే బహుముఖ ప్రావీణ్యం ఉండడం లేదు. పనిచేసుకునే పరిస్థితులు కూడా లేకపోవడం చూస్తున్నాం. నిజానికి క్షేత్రస్థాయి లోనే విద్యారంగంలో మార్పులు రావాలి. విద్యార్థులు రాటుదేలేలా తర్ఫీదు ఇవ్వాలి. వారు ఎంచుకంటున్న ఆయా రంగాల్లో నిష్ణాతులను తయారు చేయాలి. అప్పుడే వారు ఏ పరిశ్రమలో అయినా, ఉపాధి రంగంలో అయినా రాణిస్తారు. విద్యావిధానంలో మార్పుల తోనే ఇది సాధ్యం. కేవలం బట్టీ చదువుల వల్ల విద్యార్థుల్లో నైపుణ్యాలు లోపిస్తున్నాయి. నిరుద్యోగులకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు కల్పించేలా మార్కెట్ విస్తరించాలి. ఉద్యోగమంటే కేవలం ప్రభుత్వ ఉద్యోగమే కాదు.. ప్రైవేట్ రంగంలోనూ వారికి అవకాశాలు కల్పించాలి. అలాగే సొంతకాళ్ల మీద నిలబడేలా ఉపాధికి అవకాశాలను పెంచాలి. బ్యాంకులు ఇతోధికంగా రుణాలు ఇవ్వాలి. ఇవన్నీ సాకారం కావాలంటే వ్యవసాయరంగం, అనుబంధ రంగాలు బలపడాలి. పారిశ్రామిక రంగం పురోగమించాలి. ఇవన్నీ కూడా ఓ క్రమద్దతిలో అభివృద్ధి చేసుకుంటూ పోవాలి. ఎంతసేపు పెన్షన్లు పంచడం, కిలో రూపాయికి బియ్యం ఇవ్వడం, ఇందిరమ్మ ఇళ్లు కట్టించడం ఇదే అభివృద్ధి కాదు. ప్రజలు తమకాళ్లమీద తాము నిలబడగలిగేలా వాతావరణం సృష్టించాలి. ఇది ప్రభుత్వాల బాధ్యత. యువత ఆకాంక్షల మేరకు అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వాల విధానాలు ఉండాలి. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఉన్న ప్రభుత్వాలపై ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోనూ రాష్ట్రంలో క్వాంటమ్ గురించి సిఎం చంద్రబాబు మాట్లాడుతున్నారు. తెలంగాణ సిఎం రేవంత్ స్కిల్ వర్సిటీ అంటున్నారు. ఇవన్నీ ఒక ఎత్తయితే.. కొత్తగా పరిశ్రమలు వస్తాయి. తమకు ఉద్యోగాలు వస్తాయని ఎదురు చూస్తున్నారు. టిడిపి ప్రభుత్వం పారిశ్రామిక అభివృద్ధి విషయంలో గత ప్రభుత్వంతో పోల్చినపుడు కొంత మెరుగుగా పనిచేస్తోంది. ఇప్పటికే తెలంగాణలో సిఎం సహా మంత్రులు అమెరికా తదితర దేశాలు చుట్టివచ్చారు. పరిశ్రమల ఏర్పాటుకు ఆహ్వానాలు పలికారు. ఎపి మంత్రి లోకేశ్ దావోస్ తదితర ప్రాంతాలను సందర్శించారు. ఉన్న వనరులతో ఏం చేయవచ్చున్నది ముందుగా తెల్చుకోవాలి. సహజవనరులు ఉన్నాయి. సముద్రతీరం ఉంది. ఇవన్నీ కూడా ఉపాధికి పెద్ద అభివృద్ధి కేంద్రాలు. ఇరు రాష్ట్రాల సిఎంలు పారిశ్రామక వేత్తలకు రెడ్ కార్పెట్ పరిచారు. ప్రైవేట్ కంపెనీలు వేసే రోడ్లు, విమానాశ్రయాలు, చేసే విద్యుత్తు ఉత్పత్తి తదితర మౌలిక సౌకర్యాలు త్వరగా అందుబాటులోకి రావాలి. పన్నులు సరళీకరణ సాగాలి. చిన్నచిన్న పనులను పెంచాలి. కంపెనీలకు మేలు చేసేలా నిర్ణయాలు కాకుండా, ప్రజలకు మేలు చేసేలా విధానాలు ఉండాలి. ఎస్.ఇ.జెడ్ లలో వచ్చిన కంపెనీలకు భూములు ఇచ్చి రైతులు ఆ కంపెనీల్లో కూలీలుగా మారుతున్నారు. పరిశ్రమల నిర్మాణ సమయంలో వచ్చే, పోయే లారీల్లో దింపుడు, ఎత్తుడు హమాలీలయ్యారు. గంగవరం పోర్టు, పోలవరం ప్రాజెక్ట్, ఫార్మాసిటీల లాంటి వాటికోసం, విశాఖ ఉక్కు కోసం భూములు త్యాగాలు చేసిన వారు రోడ్డున పడుతున్నారు. ఇలాంటి ఘోరాలు జరక్కుండా దిశగా ప్రభుత్వాలు ఆలోచన చేయాలి. తెలంగాణలో మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్ లాంటి వాటికి భూములు ఇచ్చిన రైతులు ఇవాళ దిక్కులేకుండా పోయారు. ఇలాంటి అభివృద్ధి ఎవరి కోసమన్నది కూడా ఆలోచన చేయాలి. భూములు ఇచ్చిన రైతుల త్యాగాలను కూడా గుర్తించని కంపెనీలు వారిని కార్మికులుగా కూడా గుర్తించడంలేదు. ప్రభుత్వాలు ఏకపక్షంగా పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసమే పని చేస్తున్నాయి. ప్రైవేట్ పరిశ్రమల్లో తనిఖీలను ఎత్తివేశారు. కార్మికుల భద్రతను గాలికొదిలేశారు. అంటే వెట్టి చాకిరీ చేయించుకునే వ్యవస్థను ప్రభుత్వమే ప్రోత్సహిస్తోంది. సిగాచీ పరిశ్రమలో జరిగిన దారుణమే ఇందుకు నిదర్శనం. పరిశ్రమలను ప్రోత్సహించి, ఆరోగ్యకర వాతావరణంలో ఉద్యోగ, ఉపాధి రంగాలను ప్రోత్సహిస్తే ఎవరికీ అభ్యంతరం ఉండదు. ఆయా కంపెనీల్లో వేతనాలను కూడా నైపుణ్యాలకు తగినట్లుగా ఇవ్వటం లేదు. కార్మికులకు వేతనాలు పెంచుతాం, కార్మిక హక్కులను కాపాడతామని ప్రభుత్వాలు చెప్పటం లేదు. నిజానికి పరిశ్రమలు పెట్టేది ప్రజలకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు పెంచడానికే అని గుర్తించాలి. అలాగు భూముల్లో బంగారం పండించేలా రైతులను ప్రోత్సహించాలి. వ్యవసాయ అనుబంధరంగాలను ప్రోత్సహించాలి. ఉద్యోగ,ఉపాధి రంగాలకు పెద్దపీట వేసినప్పుడే స్వయం సమృద్ధి సాధ్యం కాగలదు.

# సాపుదాన పాయసం అంటే ఎవరికి ఇష్టం ఉండదూ చెప్పండి

–ఉపవాస సమయంలో తక్షణ శక్తిని అందించే ఒక శక్తివంతమైన ఆహారం

–కానీ అవి ఎలా వస్తాయో చాలామంది కి తెలియదు. మరి తెలుసుకొందామా...



సాపుదాన పాయసం అంటే ఎవరికి ఇష్టం ఉండదూ చెప్పండి..కానీ అవి ఎలా వస్తాయో చాలామంది కి తెలియదు. మరి తెలుసుకొందామా... సగ్గు బియ్యం (సాపుదాన) అనగానె అదేదో ఒక పంట నుండి వచ్చిందని లేదా మొక్కలకు పండుతుందని అనుకుంటారు చాల మంది. కానీ నిజానికి ఇది కేవలము పరిశ్రమలలో తయారవుతుంది. ఈ సగ్గు బియ్యాన్ని దేశ వ్యాప్తంగా అనేక వంటకాలలో వాడు తుంటారు. కాని సగ్గు బియ్యం తయారయ్యేది కేవలం మూడు రాష్ట్రాలలోనె. మొత్తం ఉత్పత్తిలో తమిళనాడు రాష్ట్రంలో 70 శాతం. మిగతా 30 శాతం కేరళ, ఆంధ్ర ప్రదేశ్ లది. ఆంధ్ర ప్రదేశ్ లో తూర్పు గోదావరి జిల్లాలో సామర్ల కోటకు చుట్టు పక్కల సుమారు ఇరవై అయిదు కిలోమీటర్ల పరిధిలో మొత్తం 40 సగ్గు బియ్యం తయారి మిల్లులున్నాయి. తమిళ నాడులో సుమారు 5 0 0 మిల్లులున్నాయి.



## సగ్గు బియ్యాన్ని ఎలా తయారు చేస్తారు?

సగ్గు బియ్యం తయారికి ముడి సరుకు కర్ర పెండలము. దీన్ని భూమిని నుండి త్రవ్వి బయటకు తీసిన 24 గంటల లోపు సగ్గు బియ్యం తయారీ కేంద్రానికి చేర్చాలి. ఆ దుంపలను నీటిలో బాగా శుభ్రంచేసి దానిపై నున్న తొక్కను యంత్రాలతో తొలిగిస్తారు. గతంలో ఈపనిని స్త్రీలు చేసే వారు. తొక్క తీసిన దుంపలను మరొక్కసారి నీళ్ళలో శుభ్ర పరుస్తారు. అప్పుడు ఆ దుంపలను క్రషర్ లో పెట్టి పాలను తీస్తారు. చెరుకు నుండి చెరుకు రసాన్ని తీసే పద్ధతిలోనే ఈ దుంపల నుండి పాలను తీస్తారు. దుంపల నుండి వచ్చిన పాలు ఫిల్టర్ లలోనికి, అక్కడి నుండి సర్క్యులేటింగ్ చానల్స్ లోనికి వెళతాయి.

ఈ క్రమంలో – పాల లోని చిక్కని పదార్థం ముద్దలా ఉంటుంది. దానితోనే సగ్గు బియ్యం తయారు చేస్తారు. ఈ పిండిని వివిధ రకాల పరిమాణంలో రంధ్రాలున్న జల్లెడ లాంటి పాత్రలోకి వెళుతుంది. ఆ జల్లెడ అటు ఇటు కదులు తున్నందున ఆ జల్లెడ రంధ్రాలనుండి తెల్లటి పూసల్లాగా జల జలా రాలి పడతాయి. అప్పుడు అవి మెత్తగా వుంటాయి. వాటిని పెద్ద పెనం మీద వేడి చేస్తారు. ఆ తరువాత వాటిని ఆరుబయట ఎండలో ఆరబెడతారు. ఇలా సుమారు 500 కిలోల దుంపల నుండి 100 కిలోల సగ్గు బియ్యం మాత్రమే తయారవుతాయి. ఇది సగ్గు బియ్యం తయారీ విధానం...

సగ్గుబియ్యంలో ఫోలిక్ యాసిడ్, విటమిన్ బి సమృద్ధిగా ఉంటాయి. ఇవి గర్భిణీ మహిళల ఆరోగ్యానికి చాలా మంచివి. గర్భధారణ సమయంలో తల్లి శరీరాన్ని, శిశువు అభివృద్ధిని మెరుగుపరచటానికి సహాయపడతాయి. ఇవి మధుమేహం ఉన్నవారికీ మంచివి, ఎందుకంటే ఇందులో తీపి పదార్థాలు లేకపోవడం వలన ఎలాంటి దుష్ప్రభావాలు లేవు. సగ్గు బియ్యంలో కాల్షియం, ఐరన్, విటమిన్ కె వంటి పోషకాలు ఉంటాయి. ఇవి ఎముకల ఆరోగ్యాన్ని మెరుగు పరుస్తాయి, రక్త ప్రసరణను కూడా కాపాడతాయి. సగ్గుబియ్యం ప్రోటీన్‌ను జోడించి తీసుకుంటే కండరాలు బలంగా తయారవుతాయి, శారీరక శక్తిని పెంచడంలో ఇది సహాయపడుతుంది. కండరాల సమస్యలు కూడా తగ్గుతాయి. ప్రత్యేకంగా ప్రోటీన్‌తో కలిసి తీసుకోవడం చాలా మంచిది.సగ్గుబియ్యం డైటరీ ఫైబర్‌ను అధికంగా కలిగి ఉంటుంది. ఇది జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచడంలో, మలబద్ధకాన్ని తగ్గించడంలో సహాయ పడుతుంది. ఈ ఫైబర్ శరీరంలో హెల్దీ గట్ ఫ్లోరాను ప్రోత్సహిస్తుంది. ఇంకా గ్లూటెన్ లేని ఆహారం కావడంతో అలర్జీలు ఉన్నవారు సురక్షితంగా తీసుకోవచ్చు.. సగ్గుబియ్యాన్ని ఉపవాస సమయంలో తీసుకోవడం చాలా ప్రయోజనకరమైనది. ఇది తక్షణ శక్తిని అందించే ఒక శక్తివంతమైన ఆహారం. కిచిడీ లేదా పాయసం వంటి వంటల రూపంలో తీసుకోవడం వల్ల శరీరానికి తక్షణ శక్తిని అందిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుతుంది.

(పెండ్యాల రామ్ కుమార్, మంథని)

# దక్షిణాదిపై గురిపెట్టిన బిజెపి

## –తొలి ప్రయత్నంగా మహిళా అధ్యక్షురాలు

## –ముందువరసలో నిర్మలా సీతారామన్,వానతీ శ్రీనివాసన్

**న్యూఢిల్లీ,జూలై4(సమయజ్యోతి):** సంస్థాగత ఎన్నికల పక్రియను భారతీయ జనతా పార్టీ వేగంగా ముందుకు తీసుకుని వెళ్తున్న వేళ కొన్ని ఆసక్తికర అంశాలు తెరపైకి వస్తున్నాయి. ప్రధానంగా దక్షిణాది లో పాగా వేయాలన్న బలమైన కోరికతో ఉంది. ఉత్తరాది పార్టీ అన్న ముద్రను తొలగించుకునే క్రమంలో వేస్తున్న అడుగులు ఇప్పుడు జాతీయ అధ్యక్ష పదవి విషయంలో ఆయరించే ప్రయత్నాలు మొదల య్యాని తెలుస్తోంది. బిజెపి సాహసాలు చేయడంలోను, ప్రయోగాలు చేయడంలోనూ ముందుంటుంది. దీనితో ఏ పార్టీ పోటీపడలేదు. కాంగ్రెస్‌లో ఇందిర కుటుంబ వారసత్వమే కొనసాగుతుంది. ప్రాంతీయ పార్టీల్లో కూడా వారసత్వ రాజ కీయాలే ఉంటాయి. ఈ వాసనలు లేకుండా మనగలుగుతున్న పార్టీ బిజెపి మాత్రమే. ఇందులో చేరిన సామాన్యులు కూడా అసామాన్యులుగా ఎదిగిన సందర్భాలు ఉన్నాయి. ఈ క్రమంలో ఈసారి దక్షిణాది నుంచి పార్టీ అధ్యక్ష పదవిని ఎంచుకునే విషయాన్ని పరిశీలిస్తున్నట్లుగా ప్రచారం సాగుతోంది. అందులోనూ మహిళలయితే మంచిదనే భావనా ఉంది. దీనికితోడు ఉత్తర, దక్షిణ భారతాలు కలుపుతూ...భాషా పరంగా నైపుణ్యాలు ఉండేవారిని కూడా వెతుకుతున్నారని ఢిల్లీ వర్గాలు చెబుతున్నాయి. ఈ క్రమంలోనే నిర్మలా సీతారామన పేరు తాజాగా తెరపైకి వచ్చింది. ఆమె హిందీ, ఇంగ్లీష్ అనర్గళంగా మాట్లాడడమే గాకుండా కఠినంగా పరిశ్రమ చేయగలరు. ఇకపోతే పార్టీ జాతీయ అధ్యక్షుడి ఎన్నికను నిర్వహించాలంటే కనీసం 19 రాష్ట్రాల్లో బిజెపి సారథుల నియామకాలు పూర్తి కావాల్సి ఉంది. ఇప్పటివరకు 16 రాష్ట్రాల్లో అధ్యక్షులను ఖరారు చేశారు. ఈ క్రమంలో ఇటీవలే అనేక రాష్ట్రాలతో పాటు తెలుగు రాష్ట్రాల్లో నూ అధ్యక్షుల ఎంపిక సాగింది. తెలంగాణకు రామచంద్రరావు, ఎపికి మాధవ్‌లు ఎంపికయ్యారు. వీరిద్దరూ పార్టీకి అంకితమై పనిచేస్తున్నవారే. ఇక్కడ కులాల కన్నా పార్టీకి అంకితమై ఉన్నవారినే గుర్తించారు. ఇలా అధ్యక్షుల ఎంపిక పూర్తయిన తర్వాత పార్టీ నిబంధనల ప్రకారం జాతీయ అధ్యక్షుడి ఎన్నిక జరగనుంది. ఈసారి భాజపా జాతీయ అధ్యక్ష పదవిని దక్షిణాదికి మహిళలకు ఇచ్చే అవకాశం ఉందంటూ ఊహాగానాలు వస్తున్నాయి. ఎందుకంటే దక్షిణాదిపై గురిపెట్టిన బిజెపి ఇలా చేయడంలో ఆశ్చర్యం లేదు. గతంలో వెంకయ్య నాయుడు పార్టీ అధ్యక్షుడిగా పనిచేశారు. తరవాత ఉపరాష్ట్రపతి కూడా అయ్యారు. జాతీయ అధ్యక్ష పదవి రేసులో పరధానంగా కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్, భాజపా జాతీయ మహిళా మోర్చా అధ్యక్షురాలు వానతీ శ్రీనివాసన్‌ల పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. వీరిద్దరూ తమిళనాడుకు చెందిన వారే కావడం గమనించాలి. అలాగే పార్టీలో మహిళలకు పెద్దపీట వేయాలనే ఉద్దేశంతో కూడా దక్షిణాది నుంచి మొట్టమొదటి మహిళా నాయకురాలిని ఎన్నుకునేం దుకు ఆలోచనలు చేస్తున్నారని సంబంధిత వర్గాలు వెల్లడిస్తున్నాయి. ఈ క్రమంలో భాజపా



అధ్యక్ష పదవి రేసులో కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ మొదటి స్థానంలో ఉన్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడిస్తున్నాయి. పార్టీలోని అత్యంత ప్రభావవంతమైన మహిళల్లో ఆమె ఒకరు. మోదీ నేతృత్వంలోని ప్రభుత్వంలో 2019లో తొలిసారి నిర్మలమ్మ ఆర్థికశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టి.. ఇప్పటికీ అదే పదవిలో కొన సాగుతున్నారు. ఆర్థికమంత్రిగా విమర్శలు వచ్చినా ఆమె దీటుగా జవాబిస్తున్నారు. ఓ రకంగా ఆమె మంచి వక్త కావడం కూడా కలసి వచ్చే అంశంగా చెబుతున్నారు. ప్రస్తుత జాతీయ అధ్యక్షుడు జె.పి.నడ్డా స్థానంలో ఆమె ఎంపిక సరైనదేనని అంటున్నారు. ఇకపోతే భాజపా జాతీయ మహిళా మోర్చా అధ్యక్షురాలు, తమిళనాడు ఎమ్మెల్యే వానతీ శ్రీనివాసన్ 1993 నుంచి భాజపాలో కొనసాగుతున్నారు. ఆమె 2021 ఎన్నికల్లో.. నటుడు, మక్కల్ నీది మయ్యం వ్యవస్థాపకుడు అయిన కమల్ హాసన్‌ను ఓడించి కోయంబత్తూర్ (దక్షిణ) స్థానాన్ని గెలుచుకున్నారు. 2022లో భాజపా కేంద్ర ఎన్నికల కమిటీ సభ్యురాలిగా ఎన్నికయ్యారు. ఆమె కూడా ఈరేసులో ఉన్నారు. తమిళనాడులో త్వరలో ఎన్నికలు జరగబోతున్నాయి. ఇక్కడ పాగా వేసేందుకు బిజెపి కసరత్తు చేస్తోంది. అన్నామలైని తప్పించాలన్న డిమాండ్‌ను కూడా అంగీకరించింది. స్టాలిన్ ప్రభుత్వాన్ని సాగనంపే క్రమంలో ఈ ప్రయత్నాలు ఫలించవచ్చని అంటున్నారు. ఒకవేళ ఇదే జరిగితే ఇతర పార్టీలకు ఇది ఓ చెంపపెట్టు కాగలదు. అలాగే బిజెపి చేస్తున్న కసరత్తు కూడా ప్రజల్లో ప్రభావం చూపగలదని భావిస్తున్నారు.

## నేడు మంథని పట్టణంలో పర్యటించనున్న ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు

### -పలు అభివృద్ధి పనులను ప్రారంభించి, భూమి పూజలు చేయనున్న మంత్రి

**మంథని ప్రతినిధి, సమయజ్యోతి, జూలై 04:**

మంథని పట్టణంలో శనివారం ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు పర్యటించనున్నారు. పలు అభివృద్ధి పనులను మంత్రి శ్రీధర్ బాబు ప్రారంభించి, భూమి పూజలు చేయనున్నారు. ఉదయం 8-30 నిమి..లకు మంథని జూనియర్ కాలేజీ మైదానంలో 35 లక్షల నిధులతో నిర్మించబోతున్న సింథటిక్ (ప్లాస్టిక్) టెన్నిస్ కోర్ట్ మరియు 10 లక్షలతో మైదానంలో చిల్డ్రన్ పార్క్ శంకుస్థాపన చేయనున్నారు. ఉదయం 9గంటలకు మంథని మున్సిపాలిటీ పరిధిలో బోయిన్ పేట వద్ద ఎకో పార్క్ లో 12 లక్షల తో నిర్మించిన చిల్డ్రన్ పార్క్ ప్రారంభోత్సవము చేయనున్నారు. ఉదయం 9-30నిమి..లకు మంథని , రామగిరి, ముత్తారం, కమాన్ పూర్ నాలుగు మండలాల ప్రభుత్వ పాఠశాలలకు సిఎస్ఆర్ కింద 650 డ్యూయల్ డెస్క్ మరియు చైర్స్ ను జెడ్పిహెచ్ఎస్ గర్ల్స్ పాఠశాలలో మంత్రి గారి చేతుల మీదుగా ఉపాధ్యాయులకు అందజేయనున్నారు. జడ్పీహెచ్ఎస్ గర్ల్స్ పాఠశాలలో 58 లక్షలతో సీడ్స్ ఎన్జీవో ద్వారా నిర్మించిన అధునాతనమైన డిజిటల్ క్లాసులను, లైబ్రరీని ప్రారంభోత్సవము చేయనున్నారు. ఉదయం 10 గంటలకు మంథని రావుల చెరువు కట్ట వద్ద ఆధునికరణ కొరకు 4 కోట్ల 5 లక్షల 50వేలతో బ్యూటిఫికేషన్ పనులకు మంత్రి చేతుల మీదుగా శంకుస్థాపన చేయనున్నారు. ఉదయం 10-30 నిమిషాలకు మంథని మున్సిపాలిటీ పోచమ్మ వాడ పాలకేంద్రం వద్ద ఉష ఇంటర్నేషనల్ మరియు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సౌజన్యంతో ఉచిత మహిళ కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభోత్సవం చేసి ఇందిరా మహిళా శక్తి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫుడ్ స్టోర్స్ ను సందర్శించనున్నారు. ఉదయం 11 గంటలకు మంథని అయ్యగారి చెరువు కట్ట వద్ద ఆధునికరణ కొరకు 2 కోట్ల 99 లక్షలతో బ్యూటిఫికేషన్ పనులకు శంకుస్థాపన చేయనున్నారు. ఉదయం 11 -30 గంటలకు సీతారామ సేవా సదన్ సౌజన్యంతో మంత్రపురి మరియు పరిసర గ్రామ ప్రజలకు బ్రహ్మ తీర్థముక్తిదామం (గ్యాస్ ఆధారిత జ్వలన యంత్రం) మంత్రి చేతుల మీద ప్రారంభోత్సవం చేయనున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు మంథని మున్సిపాలిటీ పరిధిలోని గంగపురి వద్ద నిర్మించబోతున్న 2 కోట్ల యాభై ఐదు లక్షలతో 33/11 కెవి సబ్ స్టేషన్ (విద్యుత్ ఉపకేంద్రం) గంగపురిలో శంకుస్థాపన చేయనున్నారు.



## మహారాష్ట్ర నుంచి భారీగా వస్తున్న వరదనీరు

### కాళేశ్వరం వద్ద ప్రాణహిత ఉధృతి

**జయశంకర్ భూపాలపల్లి,జూలై4(సమయజ్యోతి):**

కాళేశ్వరం వద్ద ప్రాణహిత నది మరోసారి ఉధృతంగా ప్రవహిస్తోంది. మహారాష్ట్రలో కురిసిన భారీ వర్షాల ప్రభావంతో నదికి వచ్చే వరద నీటి ప్రవాహం భారీగా పెరిగింది. దీంతో పుష్కర ఘాట్ల వద్ద తాత్కాలిక వ్యాపార స్థలాలు పూర్తిగా నీట మునిగాయి. ఇప్పటి వరకు నీటి కొరతతో వెలిసిన నదీ తీరంలో గుడారాలు వేసుకుని వ్యాపార కార్యకలాపాలు సాగించిన స్థానికులు, వరద ఉధృతికి అవన్నీ కోల్పోయారు. మరోవైపు, నీటి ఉధృతి ఉన్నా కూడా భక్తులు పుణ్యస్నానాల కోసం నదిలోకి దిగుతున్న దృశ్యాలు అధికారులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ప్రమాదకర పరిస్థితుల్లో భక్తులు నదిలోకి ప్రవేశించడం పట్ల అధికారులు అప్రమత్తమవుతున్నారు. వరద ప్రవాహం పెరగడంతో నది పక్కన ఎలాంటి శాశ్వత ఏర్పాట్లు లేకపోవడం వల్ల, ప్రజలకు అవగాహన కల్పించేందుకు సిబ్బందిని మోహరించారు. ఇక ఎగువ మహారాష్ట్ర నుంచి వస్తున్న భారీ వరద నీరు కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ లక్ష్మీ బ్యారేజీకి చేరుతోంది. ప్రస్తుతానికి బ్యారేజీకి పై నుంచి సుమారు 84,500 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. దీంతో అధికారులు 85 గేట్లను ఎత్తి, అదే స్థాయిలో నీటిని దిగువకు వదులుతున్నారు. బ్యారేజీ వద్ద ఇన్ఎ÷-లో, అవుట్ఎ÷-లో సమానంగా కొనసాగుతున్న నేపథ్యంలో, దిగువన ఉన్న ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. ఈ వరద ఉధృతికి సంబంధించి జిల్లా పాలన యంత్రాంగం ఇప్పటికే ముందు జాగ్రత్త చర్యలు చేపట్టింది. లోతట్టు ప్రాంతాలపై నిఘా పెట్టి, అవసరమైతే స్థానికులను ఖాళీ చేయించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. వరద స్థాయిలను గమనిస్తూ, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూస్తామని అధికారులు తెలిపారు. ప్రస్తుతం ప్రాణహిత నది పరివాహక ప్రాంతాల్లో ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. భక్తులు కూడా నదిలోకి వెళ్లే సమయంలో జాగ్రత్తలు పాటించాలని అధికారులు సూచిస్తున్నారు.

## రోడ్డు దాటుతుండగా దూసుకొచ్చిన బస్సు

### క్లీనర్ అప్రమత్తతో స్కూల్ పిల్లలకు తప్పిన ముప్పు

**విజయవాడ,జులై 4(సమయజ్యోతి):**

కృష్ణా జిల్లాలోని జగ్గయ్యపేటలో స్కూల్ విద్యార్థులకు భారీ ప్రమాదం తప్పింది. ప్రతీ రోజులాగే ఈరోజు కూడా విద్యార్థులు పాఠశాలకు వెళ్లేందుకు బస్సు ఎక్కారు. స్కూల్ వద్దకు వాహనం చేరుకున్న వెంటనే వారంతా ఒకరి తరువాత ఒకరు దిగి లోపలికి వెళ్తున్నారు. ఇదే సమయంలో జరిగిన ఓ ఘటన అక్కడి వారిని భయాందోళనకు గురిచేసింది. అయితే వాహనం డ్రైవర్, క్లీనర్ సమయస్ఫూర్తితో వ్యవహరించడంతో పిల్లలకు పెను ప్రమాదం తప్పినట్లైంది. చిన్నారులంతా క్షేమంగా ఉండటంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. శుక్రవారం ఉదయం కేసీపీ క్వార్టర్స్ నుంచి విద్యార్థులను పాఠశాలల్లో దింపేందుకు కంపెనీ వాహనం క్వార్టర్స్ వద్దకు వెళ్లింది. పిల్లలు అందరూ ఎక్కిన తర్వాత బస్సు బయలుదేరింది. ఆ తరువాత బజాజ్ షోరూం సమీపంలో వాహనాన్ని ఆపి స్కూల్లోకి పిల్లలను పంపించేందుకు బస్సు నుంచి డ్రైవర్, క్లీనర్ కిందకు దిగారు. అయితే వారు రోడ్డు క్రాస్ చేసి వస్తున్న సమయంలో కోదాడ రోడ్డు వైపు నుంచి ఓ ప్రైవేటు స్కూల్ బస్సు అతివేగంగా దూసుకొచ్చింది. తన బస్సుకు బ్రేక్ ఫెయిల్ అయ్యిందంటూ డ్రైవర్ గట్టి గట్టిగా అరిచాడు. పిల్లల మీదకు రాబోతున్న బస్సును వెంటనే గమనించిన డ్రైవర్, క్లీనర్ సమయస్ఫూర్తితో చిన్నారులను అక్కడి నుంచి తప్పించేశారు. దీంతో పిల్లలంతా క్షేమంగా బయటపడ్డారు. డ్రైవరు, క్లీనర్ గమనించకపోతే బస్సు దూసుకొచ్చి పిల్లలపైకి వెళ్లలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ సమయంలో 15 నుంచి 20 మంది పిల్లలు రోడ్డు దాటుతున్నారు. ఎవరికీ ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనపై పోలీసులకు అందిన ఫిర్యాదు మేరకు ప్రైవేటు స్కూల్ బస్సు డ్రైవర్‌ను ఎస్సై రాజు అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# భూభారతి దరఖాస్తుల పరిష్కారంకై షెడ్యూల్ సిద్ధం చేయాలి

## జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

**జయశంకర్ భూపాలపల్లి, సమయజ్యోతి, జులై 4**





భూ భారతి రెవెన్యూఊ2 సదస్సులలో వచ్చిన దరఖాస్తులు పరిష్కరానికి తహ శీల్దార్లు మరింత ఫోకస్ చేయాలని, షెడ్యూల్ సిద్ధం చేసి నోటీసులు జారీ చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తహసీల్దార్లను ఆదేశించారు.
శుక్రవారం ఐడిఓసి కార్యాలయ సమావేశపు హాలులో భూ భారతి రెవెన్యూ సదస్సుల దరఖాస్తులు పరిష్కారానికి తీసుకున్న చర్యలు, ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణ ప్రగతిపై రెవెన్యూ, గృహ నిర్మాణ, పంచాయతీ రాజ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.
ఈ సందర్భంగా తహసీల్దార్లతో మండలాల వారీగా భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తుల వివరాలు, నోటీసులు జారీ వివరాలను అడిగి తెలుసుకున్నారు.
దరఖాస్తుల పరిష్కారానికి తగిన షెడ్యూల్ సిద్ధం చేసి, దరఖాస్తుదారులకు నోటీసులు జారీ చేయాలని, నోటీసుల్లో సూచించిన తేదీన విచారణ పూర్తి చేయాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో 48,651 దరఖాస్తులు వచ్చాయని, కానీ ఇప్పటి వరకు 1600 నోటీసులు జారీ చేశారని వేగం పెంచాలని కలెక్టర్ వెల్లడించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆగస్టు 15వ తేది వరకు భూ భారతి రెవెన్యూ సదస్సులలో వచ్చిన అన్ని దరఖాస్తులు పరిష్కరించాల్సి ఉన్నందున అంతకుముందే ద ర ఖా స్తు ల పరిష్కారానికి తగిన చర్యలు తీసు కోవాలని అధికారులకు సూచించారు. దర ఖాస్తులు పరిష్కారం లో పురోగతి చాలా తక్కువగా ఉందని వేగం పెంచాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణం గురించి ప్రస్తావిస్తూ ఇండ్ల నిర్మాణానికి మహిళా స్వయం సహాయక సంఘాలకు రుణాలు మంజూరు చేయాలని డిఆర్డీఓకు సూచించారు. ఇళ్ళు నిర్మాణానికి ఇసుక కొరత లేదని దశల వారిగా నిర్మాణ ప్రగతిపై నిధులు జమ జరుగుతుందని జాప్యం చేయక నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని ఆదేశించారు. జిల్లాలో మొత్తం 4779 ఇండ్లు మంజూరు అయ్యాయని 1558 ఇండ్లు గ్రౌండింగ్ అయ్యాయని, 2794 ఇళ్లు మంజూరు ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. మంజూరు ఉత్తర్వులు జారీ చేసిన ఇండ్లు నిర్మాణం చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, ఆర్డీఓ రవి, డిపిఓ వీరభద్రయ్య, డిఆర్డీఓ బాలకృష్ణ, అన్ని మండలాల తహసీల్దార్లు, ఎంపిడిఓలు తదితరులు పాల్గొన్నారు.

## రామకృష్ణ ఎలక్ట్రానిక్ బ్యాంక్ స్కామ్ అల్లు అరవింద్‌నువిచారించిన ఇడి

**హైదరాబాద్,జులై 4(సమయజ్యోతి):**



ప్రముఖ సినీ నిర్మాత అల్లు అరవింద్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు ప్రశ్నించారు. రామకృష్ణ ఎలక్ట్రానిక్ బ్యాంక్ స్కామ్‌లో అరవింద్‌ను మూడు గంటలపాటు విచారించి స్టేట్‌మెంట్ రికార్డ్ చేశారు. 2018-2019లో జరిగిన బ్యాంక్ స్కామ్‌లో ఈడీ విచారణను కొనసాగిస్తోంది. ఇందులో మనీలాండరింగ్ కోణం ఉందని భావించిన ఈడీ.. ఈసీఐఆర్ నమోదు చేసిన తర్వాత విచారణను చేపట్టింది. గతంలో బ్యాంక్‌కు సంబంధించి అవకతవకలు జరిగాయన్న అభియోగాలపై పూర్తిస్థాయిలో విచారణ జరుపుతోంది. ఇప్పటికే అల్లు అరవింద్‌ను విచారించిన అధికారులు.. బ్యాంక్ లావాదేవీలు, ఆస్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వచ్చే వారం మరోసారి విచారణకు రావాలని నిర్మాతను ఈడీ అధికారులు ఆదేశించారు. 2024లో హైదరాబాద్, కర్నూలు, ఘజియాబాద్‌లోని వివిధ ప్రదేశాలలో సోదాలు చేసిన ఈడీ.. రూ.1.45 కోట్లను సీజ్ చేసింది. నిందితులు రూ.101.48 కోట్ల రుణ నిధులను మోసపూరితంగా మళ్లించారన్న ఆరోపణలకు సంబంధించి ఈడీ దర్యాప్తు కొనసాగిస్తోంది. ఇందులో అకౌంట్ హోల్డర్స్‌గా ఉన్న వారి స్టేట్‌మెంట్లను రికార్డు చేస్తున్నారు. ప్రధానంగా బ్యాంక్ యాజమాన్యం ఎలాంటి నిబంధనలు పాటించకుండా, ఆర్‌బీఐ నిబంధనలు ఉల్లంఘించి రూ.100 కోట్లకు పైగా నిధులు దుర్వినియోగం చేశారనే అభియోగాలపై ఈడీ అధికారులు పూర్తిస్థాయిలో విచారణ చేస్తున్నారు.

## రోడ్డుప్రమాదంలో లస్కర్ మృతి

**ఖమ్మం,జులై 4(సమయజ్యోతి):**

రోడ్డు ప్రమాదంలో ఇరిగేషన్ లస్కర్ మృతి చెందాడు. ఈ సంఘటన ఖమ్మం జిల్లా బోనకల్లు మండలంలోని రావినూతల గ్రామంలో శుక్రవారం జరిగింది. కలకోట గ్రామానికి చెందిన యంగల అప్పయ్య (50) ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌లో లస్కర్ గా విధులు నిర్వహిస్తున్నాడు. కలకోట గ్రామం నుంచి బోనకల్లులో గల ఇరిగేషన్ సబ్ డివిజన్ కార్యాలయానికి తన బైక్‌పై బయల్దేరాడు. రావినూతల గ్రామం వద్ద బర్రె బైక్‌కు తగలడంతో కిందపడడంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స కోసం 108 వాహనంలో తరలిస్తుండగా మార్గమధ్యలో చనిపోయాడు. స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు. విషయం తెలిసిన బోనకల్లు సబ్ డివిజన్ డీఈఈ తమ్మరపు వెంకటేశ్వర్లు, ఏఈఈ రాజేశ్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అప్పయ్యకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

## ఈద్గాను వివాదాస్పద నిర్మాణంగా గుర్తించలేం

### శ్రీకృష్ణ జన్మభూమి వివాదంపై హైకోర్టు కీలక నిర్ణయం

**ప్రయాగ్‌రాజ్,జులై 4(సమయజ్యోతి):**

మథురలోని శ్రీకృష్ణ జన్మభూమి వివాదంపై అలహాబాద్ హైకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. ఈ కేసులో ఆ జన్మభూమిలో షాహి ఈద్గా మసీదును భవిష్యత్తులో వివాదాస్పద నిర్మాణంగా పేర్కొనాలంటూ దాఖలైన పిటిషన్‌ను శుక్రవారం హైకోర్టు కొట్టివేసింది. ఈ మసీదును భవిష్యత్తులో వివాదాస్పద నిర్మాణంగా పేర్కొనాలంటూ హిందువాదులు దాఖలు చేసిన ఈ పిటిషన్‌ను అలహాబాద్ హైకోర్టు తోసిపుచ్చింది. ఈ మేరకు జస్టిస్ రామ్ మనోహర్ నారాయణ్ మిశ్రా ధర్మాసనం ఈ పిటిషన్‌ను కొట్టేసింది. పూర్తి విచారణకు ముందు మసీదును వివాదాస్పద నిర్మాణంగా ప్రకటించడం తుది తీర్పుపై ప్రభావం చూపిస్తుందని ధర్మాసనం అభిప్రాయపడింది. అయితే ఈ మసీదు వివాదాస్పద నిర్మాణమంటూ మహేందర్ ప్రతాప్ సింగ్ ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ముస్లింలు రాత పూర్వకంగా అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ పిటిషన్లు దాఖలు చేశారు. తాజాగా అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన ఈ తీర్పుతో ముస్లిం పక్షానికి భారీ ఊరట లభించినట్లయింది. ప్రస్తుతం ఈ కేసును సింగిల్ జడ్జి జస్టిస్ రామ్ మనోహర్ నారాయణ్ మిశ్రా ధర్మాసనం విచారిస్తుంది. ఈ కేసులో హిందువుల వైపు నుంచి ప్రస్తుతం 18 పిటిషన్లు దాఖలైన సంగతి తెలిసిందే.

## పాశమైలారం సందర్శించిన సిఎస్ రామకృష్ణారావు బృందం

### సిగాచి ప్రమాద స్థలిని పరిశీలించిన హైలెవల్ కమిటీ

### ప్రమాద ఘటనలో మరొకరు ఆస్పత్రిలో మృతి

**సంగారెడ్డి,జూలై4(సమయజ్యోతి):**

పాశమైలారంలోని సిగాచి ప్రమాద ఘటనా స్థలిని సీఎస్ రామకృష్ణ రావు నేతృత్వంలోని హై లెవెల్ కమిటీ పరిశీలించింది. ప్రమాద స్థలిని హైలెవల్ కమిటీ సభ్యులు పరిశీలించారు. కమిటీకి చైర్మన్‌గా సీఎస్ రామకృష్ణ రావు, సభ్యులుగా రెవెన్యూ, ఇండస్ట్రీ చీఫ్ సెక్రటరీలతో పాటు కార్మిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, ఫైర్ డీజీ, ఆరోగ్యశాఖ కార్యదర్శి ఉన్నారు. ఘటనా స్థలిని పరిశీలించిన తర్వాత బాధిత కుటుంబాలతో కమిటీ మాట్లాడింది. సిగాచి యాజమాన్యంతో కూడా మాట్లాడి వివరాలను సేకరించనుంది. ఇక ప్రమాద స్థలిని గురువారం నిపుణుల కమిటీ పరిశీలించిన విషయం తెలిసిందే. సుమారు మూడు నాలుగు గంటల పాటు నిపుణుల కమిటీ విచారించింది. టెక్నికల్ అంశాలపై నిపుణుల కమిటీ నెలరోజుల్లో ప్రభుత్వానికి (÷ుగ÷జీనిణజీనిజీ ఉనీలబి) నివేదిక ఇవ్వనుంది. మరోవైపు ఈ ప్రమాద ఘటనలో మరొకరు మృతి చెందారు. దీంతో సిగాచి ఘటనలో మృతుల సంఖ్య 39కి చేరింది. సిగాచి పరిశ్రమలో తీవ్రంగా గాయపడి ధ్రువ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న భీమ్ రావు అనే వ్యక్తి శుక్రవారం మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. భీరామ్ స్వస్థలం మహారాష్ట్ర. పోస్టుమార్టం అనంతరం భీమ్ రావు మృతదేహాన్ని స్వస్థలానికి పంపించే ఏర్పాట్లు జరుగుతున్నాయి. ప్రమాద స్థలిలో ఐదవ రోజు కూడా సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఇక సిగాచి పరిశ్రమలో పేలుడు ఘటనపై జిల్లా కలెక్టర్ ప్రావీణ్య కీలక ప్రకటన చేశారు. ఈ ప్రమాదం నుంచి 61 మంది సురక్షితంగా బయటపడ్డారని తెలిపారు. ఈ దుర్ఘటనలో 38 మంది మృతి చెందారని.. అందులో ఇప్పటి వరకు 31 మృతదేహాలను గుర్తించామని వెల్లడించారు. ఇంకా 7 మృతదేహాలను గుర్తించాల్సి ఉందన్నారు. ఆస్పత్రి నుంచి ఇప్పటి వరకు 12 మంది డిశ్చార్జ్ అయ్యారని.. ప్రస్తుతం ఆస్పత్రులలో 23 మంది చికిత్స పొందుతున్నట్లు చెప్పారు. అలాగే ఇంకా 9 మంది ఆచూకీ లభించలేదని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య ప్రకటించారు. వీరి కోసం ఘటనా స్థలిలో రెస్క్యూ ఆపరేషన్ ఇంకా కొనసాగుతోంది. సిగాచి పరిశ్రమ వద్ద బాధితుల ఆందోళన కొనసాగుతోంది. ఐదు రోజులు గడిచినప్పటికీ తమ వారి ఆచూకీ తెలియడం లేదంటూ వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన వారితో పాటు ఏపీ రాష్ట్రంలోని శ్రీకాకుళంకు చెందిన ఓ కుటుంబం కూడా నిరీక్షిస్తోంది.

## ఖర్గే రాకతో గాంధీభవన్‌లో సందడి

### సిఎం, మంత్రుల హాజరుతో భద్రత పెంపు

### పోలీసుల తీరుపై రేణుకాచౌదరి అసహనం

**హైదరాబాద్,జూలై4(సమయజ్యోతి):**

గాంధీభవన్‌లో తెలంగాణ కాంగ్రెస్ పీఏసీ సమావేశం కొనసాగుతున్న వేళ కార్యకర్తల తాకిడి పెరిగింది. ఏఐసీసీ చీఫ్ కర్గే, కేసీ వేణుగోపాల్, సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ నేతలు సమావేశానికి హాజరయ్యారు. ఇదిలా ఉండగా.. కాంగ్రెస్ అగ్రనేతలు గాంధీ భవన్‌లో ఉండటంతో వారిని కలిసేందుకు కేడర్ క్యూ కట్టింది. ఈ క్రమంలో కేడర్ లోపలికి రాకుండా పోలీసులు అడ్డుకున్నారు. అడ్డుకున్న వారిలో రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరి వ్యక్తిగత సిబ్బంది కూడా ఉన్నారు. దీంతో ఆమె స్వయంగా పోలీసుల వద్దకు వచ్చి సిబ్బందిని లోపలికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో పోలీసుల తీరుపై రాజ్యసభ సభ్యురాలు అసంతృప్తి వ్యక్తం చేశారు. తమకంటే పోలీసుల హడావుడి ఎక్కువైందంటూ రేణుకా చౌదరి మండిపడ్డారు. మరోవైపు ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు అసహనం వ్యక్తం చేశారు. తమను ఆపుతారా అంటూ పోలీసులపై నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు పీఏసీ సమావేశంలో పార్టీ నేతలకు ఖర్గే దిశానిర్దేశం చేశారు. సమావేశం మొదలైన వెంటనే పాశమైలారంలోని సిగాచి పరిశ్రమలో జరిగిన ప్రమాద ఘటనలో చనిపోయిన మృతులకు సంతాపం తెలుపుతూ పీఏసీ సభ్యులు రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. ఆపై ఏజెండా ప్రకారం పీఏసీ సమావేశం జరుగుతోంది. ఈ సమావేశంలో పలు కీలక అంశాలు చర్చకు వచ్చాయి. పార్టీ బలోపేతం, ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి ఎంత మేరకు తీసుకెళ్లారనే దానిపై చర్చించారు. అలాగే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పార్టీలోకి చేరికలను ప్రోత్సహించాలని మల్లికార్జున ఖర్గే తెలిపారు. రాష్ట్రంలో జై భీమ్ జై బాపు జై సంవిధాన్ వంటి కార్యక్రమాలు ఎలా కొనసాగుతున్నాయనే దానిపై రిపోర్టును పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ సమావేశంలో చదివి వినిపించారు. గ్రేటర్ ఎన్నికల నేపథ్యంలో పార్టీ తీసుకోవాల్సిన నిర్ణయాలు, అనుసరించాల్సిన వ్యూహంపై చర్చ జరిగింది. అలాగే జూబ్లీహిల్స్ ఉపఎన్నిక అంశంపై కూడా పీఏసీలో చర్చ జరిగింది.

# గిల్ దెబ్బకు దిగ్గజాల రికార్డులు గల్లంతు

భారత్, ఇంగ్లాండ్ మధ్య జరిగిన ఆండర్సన్ టెండూల్కర్ ట్రోఫీ రెండో టెస్ట్ మ్యాచ్‌లో భారత్ అద్భుతంగా ఆడింది. టెస్ట్ రెండో రోజున కెప్టెన్ శుభ్‌మాన్ గిల్ డబుల్ సెంచరీ సాధించి చరిత్ర సృష్టించాడు. బర్మింగ్‌హామ్‌లోని ఎడ్జ్‌బాస్టన్‌లో గిల్ ఇప్పటివరకు తన టెస్ట్ కెరీర్‌లో అత్యుత్తమ ఇన్నింగ్స్ ఆడాడు. 4వ స్థానంలో బ్యాటింగ్ చేసిన అతను 387 బంతుల్లో 30 ఫోర్లు, 3 సిక్సర్లతో 269 పరుగులు చేసి, తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 587 పరుగుల భారీ స్కోరు సాధించడంలో సహాయపడ్డాడు. ఈ చారిత్రాత్మక ఇన్నింగ్స్‌లో, గిల్ తన పేరు మీద అనేక పెద్ద రికార్డులను క్రియేట్ చేశాడు. శుభ్‌మన్ గిల్ తన మొదటి రోజు స్కోరు 114 పరుగులకు మొదలు పెట్టి.. రవీంద్ర జడేజాతో కలిసి 203 పరుగుల భాగస్వామ్యాన్ని పంచుకున్నాడు. తర్వాత వాషింగ్టన్ సుందర్‌తో కలిసి 144 పరుగులు జోడించాడు. ఆల్ రౌండర్ బ్యాట్స్‌మెన్ ఇద్దరూ కెప్టెన్ గిల్‌కు సపోర్టుగా నిలిచారు. రవీంద్ర జడేజా సెంచరీ మిస్ అయితే వాషింగ్టన్ తన అర్ధ సెంచరీని మిస్ చేసుకున్నాడు. జడేజా 89 పరుగులు చేయగా, సుందర్ 42 పరుగులు అందించాడు. ఈ రికార్డ్ బ్యాటింగ్ కారణంగా, గిల్ మొత్తం 12 రికార్డులను తన పేరిట నమోదు చేసుకున్నాడు.

1. టెస్టుల్లో భారత కెప్టెన్ చేసిన అత్యధిక స్కోరు: 2019 లో పూణేలో దక్షిణాఫ్రికాపై 254 పరుగులు చేసిన విరాట్ కోహ్లీ రికార్డ బ్రేక్ చేశాడు.
2. ఇంగ్లాండ్‌లో భారత బ్యాట్స్‌మన్ చేసిన అత్యధిక టెస్ట్ స్కోరు: 1979లో ది ఓవల్‌లో సునీల్ గవాస్కర్ చేసిన 221 పరుగుల రికార్డును శుభ్‌మాన్ గిల్ రికార్డ్ బ్రేక్ చేశాడు.
3. విదేశీ గడ్డపై 250ం పరుగులు చేసిన మూడవ భారతీయ బ్యాట్స్‌మన్: వీరేంద్ర సెహ్వాగ్ (309, ముల్తాన్ , 254, లాహోర్) రాహుల్ ద్రవిడ్ (270, రావల్పిండి) తర్వాత ఈ ఘనత సాధించిన మూడవ భారతీయ బ్యాట్స్‌మన్‌గా గిల్ నిలిచాడు.
4. విదేశాల్లో టెస్ట్ డబుల్ సెంచరీ చేసిన రెండవ భారత కెప్టెన్: విరాట్ కోహ్లీ 2016లో నార్త్ సౌండ్‌లో వెస్టిండీస్‌పై 200 పరుగులు చేశాడు.
5. టెస్టలలో డబుల్ సెంచరీ చేసిన ఆరో భారత కెప్టెన్: మన్సూర్ అలీ ఖాన్ పటౌడీ, సునీల్ గవాస్కర్, సచిన్ టెండూల్కర్, ఎంఎస్ ధోని, విరాట్ కోహ్లీ (7 సార్లు) తర్వాత డబుల్ సెంచరీ చేసిన ఆరో భారత కెప్టెన్‌గా గిల్ నిలిచాడు.
6. టెస్టుల్లో డబుల్ సెంచరీ చేసిన రెండవ అతి పిన్న వయస్కుడైన భారత కెప్టెన్: గిల్ 25ఏళ్ల 298 రోజుల వయసులో ఈ ఘనత సాధించాడు. దీనికంటే ముందు మన్సూర్ అలీ ఖాన్ పటౌడీ 23ఏళ్లు 239 రోజుల వయసులో డబుల్ సెంచరీ చేశాడు.
7. ఇంగ్లాండ్‌లో టెస్ట్‌ల్లో 250ం పరుగులు చేసిన మూడవ విదేశీ కెప్టెన్: ఇంగ్లాండ్‌లో టెస్ట్ మ్యాచ్‌లో ఇన్నింగ్స్‌లో 250 కంటే ఎక్కువ పరుగులు చేసిన మూడవ విదేశీ కెప్టెన్‌గా గిల్ నిలిచాడు. ఈ ఘనతను ఆస్ట్రేలియాకు చెందిన బాబ్ సింప్సన్ (311 పరుగులు, 1964) దక్షిణాఫ్రికాకు చెందిన గ్రాహం స్మిత్ (277, 259 పరుగులు, 2003) చేశాడు.
8. ఇంగ్లాండ్‌పై వరుసగా మూడు టెస్టుల్లో సెంచరీలు సాధించిన నాల్గవ భారతీయుడు: మొహమ్మద్ అజారుద్దీన్, దిలీప్ వెంగ్‌సర్కార్, రాహుల్ ద్రవిడ్ (రెండుసార్లు) తర్వాత ఈ ఘనత సాధించిన నాల్గవ భారతీయ బ్యాట్స్‌మన్ గిల్.
9. ఇంగ్లాండ్‌పై వరుసగా టెస్ట్ సెంచరీలు సాధించిన మూడవ భారత కెప్టెన్: విజయ్ హజారే , మహ్మద్ అజారుద్దీన్ తర్వాత ఈ ఘనత సాధించిన మూడవ భారత కెప్టెన్‌గా గిల్ నిలిచాడు.
10. కెప్టెన్‌గా మొదటి టెస్ట్‌లో సెంచరీ, రెండవ టెస్ట్‌లో డబుల్ సెంచరీ చేసిన రెండవ భారతీయుడు: తన కెప్టెన్సీ కెరీర్‌లోని మొదటి రెండు టెస్ట్‌లలో సెంచరీ, డబుల్ సెంచరీ సాధించిన సునీల్ గవాస్కర్ తర్వాత గిల్ ఈ ఘనతను సాధించాడు.
11. శ్రీలంకకు చెందిన తిలకరత్నే దిల్షాన్ 2011లో లార్డ్స్‌లో ఇంగ్లాండ్‌పై 193 పరుగులు చేశాడు. ఇది ఒక ఆసియా కెప్టెన్ చేసిన అత్యధిక స్కోరు.
12. శుభ్‌మాన్ గిల్ ఇప్పుడు దక్షిణాఫ్రికా, ఇంగ్లాండ్, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా లలో టెస్ట్ క్రికెట్‌లో అత్యధిక వ్యక్తిగత స్కోరు సాధించిన భారత బ్యాట్స్‌మన్‌గా నిలిచాడు. ఇంతకు ముందు ఈ రికార్డు 2004లో సిడ్నీలో ఆస్ట్రేలియాపై అజేయంగా 241 పరుగులు చేసిన సచిన్ టెండూల్కర్ పేరిట ఉంది.




# గిల్ ట్రిపుల్ సెంచరీని ఆపడానికి డర్టీ గేమ్

బర్మింగ్ హాంలోని ఎడ్జ్‌బాస్టన్ వేదికగా జరుగుతున్న టెస్ట్ రెండో రోజు టీమిండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌అద్భుతమైన బ్యాటింగ్‌తో సరికొత్త చరిత్ర సృష్టించాడు. భారత యువ కెప్టెన్ ఇంగ్లండ్‌పై డబుల్ సెంచరీ సాధించి పలు రికార్డులు తన పేరిట లిఖించుకున్నాడు. ఇంగ్లండ్‌లో డబుల్ సెంచరీ సాధించిన తొలి ఆసియా కెప్టెన్‌గా, అలాగే ఆసియా వెలుపల భారత కెప్టెన్‌గా అత్యధిక వ్యక్తిగత స్కోరు సాధించిన తొలి బ్యాటర్‌గా గిల్ నిలిచాడు. గిల్ తన కెరీర్‌లో తొలి ట్రిపుల్ సెంచరీకి 31 పరుగులు దూరంలో ఉన్న సమయంలో ఇంగ్లండ్ ప్లేయర్లు ఒక చెత్త ఎత్తుగడ వేశారు. దాంతో గిల్ ట్రిపుల్ సెంచరీ కల చెదిరిపోయిందని ఫ్యాన్స్ మండిపడుతున్నారు.రెండో రోజు లంచ్ తర్వాత, స్పిన్నర్ షోయబ్ బషీర్ బౌలింగ్ చేస్తున్నప్పుడు ఇంగ్లీష్ ఆటగాడు హ్యారీ బ్రూక్ స్లిప్‌లో ఫీల్డింగ్ చేస్తున్నాడు. అతను శుభ్‌మన్ గిల్‌తో ట్రిపుల్ సెంచరీ గురించి ప్రస్తావించడం మొదలుపెట్టాడు. అసలే భారత్ ఒక్క టెస్టు మ్యాచ్ కూడా నెగ్గని వేదిక అది. అలాంటి పిచ్ మీద ఆడుతూ ఒత్తిడి తట్టుకుని డబుల్ సెంచరీ చేయడమే ఓ సవాల్. ఈ సమయంలో ట్రిపుల్ సెంచరీ అని పదే పదే ప్రస్తావిస్తూ కెప్టెన్ గిల్‌పై మానసిక ఒత్తిడి పెంచడానికి హ్యారీ బ్రూక్ చేసిన ఈ ప్రయత్నం స్టంప్ మైక్‌లో రికార్డ్ అయింది. ఈ క్రమంలో గిల్ కూడా రెండుసార్లు హ్యారీ బ్రూక్‌కు సమాధానం చెప్పాడు.ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ మైక్ ఆథర్టన్ వ్యాఖ్యాతగా వ్యహరించారు. హ్యారీ బ్రూక్.. భారత కెప్టెన్ గిల్‌తో నువ్వు 290 పరుగులు చేయడం చాలా కష్టం... మీకు ఎన్ని ట్రిపుల్ సెంచరీలు ఉన్నాయి తెలుసు కదా?" అన్నాడని వెల్లడించాడు. గిల్ ఇంతకుముందు ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో అత్యధిక స్కోరు 268 పరుగులు, అతను 2018/19లో తమిళనాడుపై మొహాలీలో సాధించాడు. 2024లో పాకిస్తాన్‌తో జరిగిన ముల్తాన్ టెస్ట్‌లో హ్యారీ బ్రూక్ ట్రిపుల్ సెంచరీ సాధించాడు. హ్యారీ బ్రూక్ డర్టీ మైండ్ గేమ్ మాటలు గిల్ ఏకాగ్రతను దెబ్బతీశాయి. దాని ఫలితంగా మరుసటి ఓవర్లోనే వారికి రిజల్ట్ వచ్చింది. లంచ్ తర్వాత తదుపరి ఇన్నింగ్స్‌లో జోష్ టంగ్ వేసిన షార్ట్ బాల్‌ను గిల్ పుల్ షాట్ ఆడటానికి ప్రయత్నించాడు. అప్పటికే అలసిపోయిన గిల్ బంతిని సరిగ్గా టైమ్ చేయలేకపోయాడు. బంతి బ్యాట్ ఇన్ సైడ్ ఎడ్జ్ అయి స్క్వేర్ లెగ్‌లో ఫీల్డర్ ఓలీ పోప్ చేతుల్లోకి వెళ్లింది. దాంతో గిల్ కెప్టెన్ ఇన్నింగ్స్ 269 పరుగుల వద్ద ముగిసింది.

శుభ్‌మన్ గిల్ ట్రిపుల్ సెంచరీ చేసి ఉంటే, పలు రికార్డులు అతని పేరిట నమోదయ్యేవి. అవి ఏంటంటే

- ఇంగ్లండ్ గడ్డ మీద ట్రిపుల్ సెంచరీ సాధించిన తొలి విదేశీ కెప్టెన్‌గా శుభ్‌మన్ గిల్ నిలిచేవాడు.
- 1964 తర్వాత ఈ ఘనత సాధించిన తొలి కెప్టెన్ అయ్యేవాడు. దీనికి ముందు ఆస్ట్రేలియా కెప్టెన్ బిల్ సింప్సన్ ఓల్డ్ ట్రాఫోర్డ్‌లో ట్రిపుల్ సెంచరీ చేశాడు.
- ఆసియా వెలుపల ట్రిపుల్ సెంచరీ సాధించిన తొలి భారతీయుడిగా నిలిచేవాడు.

# టీమ్‌ఇండియాపై విషం చిమ్మిన మాజీ క్రికెటర్?!




ఎడ్జ్?బాస్టన్ టెస్టులో భారత్ రెండో రోజూ ఆధిపత్యం ప్రదర్శించింది. బ్యాటింగ్?లో 587 పరుగుల భారీ స్కోర్ చేయడంతోపాటు, అదిరే బౌలింగ్?తో త్వరత్వరగా మూడు వికెట్లు నేలకూల్చింది. దీంతో ఇంగ్లాండ్ రెండో రోజు ముగిసేసరికి 77-3తో నిలిచింది. ఇలా తమపై భారత్ ఆధిపత్యం ప్రదర్శించడాన్ని ఇంగ్లాండ్ మాజీ క్రికెటర్లు జీర్ణించుకోలేకపోతున్నారు. మాజీ క్రికెటర్, కామెంటేటర్ డేవిడ్ లాయిడ్ అక్కసు వెళ్లగక్కాడు. రెండో రోజు ఆటలో టీమ్‌ఇండియా ఆటగాళ్లు తరచూ బ్రేక్?లు తీసుకోవడాన్ని డేవిడ్ తప్పుబట్టాడు. 'రెండో రోజు ఆట ప్రారంభమైన 15 నిమిషాలకే రవీంద్ర జడేజా బ్రేక్ తీసుకున్నాడు. డ్రింక్స్‌తోపాటు ట్యాబ్లెట్స్ వేసుకున్నాడు. ఇక 40 నిమిషాల తర్వాత మళ్లీ ఆటను ఆపాడు. అప్పుడు అంపైర్లు కూడా ఏం చేయలేక నిస్సహాయంగా నిలబడ్డారు. ఈ బ్రేక్స్ కారణంగానే కొన్ని ఓవర్ల ఆట కోల్పోయాం. దీనిపై అధికారులు దృష్టి పెట్టాలి. బ్రేక్స్ తీసుకోవడంపై ఐసీసీ నిబంధనలు పెట్టాలి' ఒకవేళ క్రీజులో ఉన్న బ్యాటర్ గాయపడితే అతడి స్థానంలో ఇంకో బ్యాటర్ రావాలి. అలా ఆటకు బ్రేక్ పడకుండా కొనసాగేలా చూడాలి. అంతేకానీ మావాళ్లు (సహచరులు) ఇక్కడికి 85 యూరోలు (దాదాపు 10 వేలు) ఖర్చు పెట్టుకొని వచ్చింది మైదానంలో పెరిగిన గడ్డిని చూసేందుకు కాదు' అని డేవిడ్ పేర్కొన్నాడు. అంతేకాదు జడేజా బ్యాటింగ్ చేస్తుండగా 'డేంజర్ జోన్' వైపునకు వెళ్లడంపై కూడా డేవిడ్ మాట్లాడాడు. దీనికి తప్పుడు అర్థం జోడించాడు. 'జడేజా మార్నింగ్ చేసిన డ్రామా భలేగా అనిపించింది. టీమ్‌ఇండియాలో అతడు సీనియర్ క్రికెటర్. బ్యాటింగ్ అనంతరం జడేజా బౌలింగ్ చేయాల్సి ఉంటుంది. అతడు బ్యాటింగ్ చేసే సమయంలో బంతిని ఎదుర్కొన్న ప్రతిసారీ పిచ్‌పై బ్యాట్‌ను కొట్టాడు. తన పాదంతో రుద్దాడు కూడా. ఇది డ్రై పిచ్. మ్యాచ్‌లో రానురాను ఇది స్పిన్?కు అనుకూలించే ఛాన్స్ ఉంది. వెల్?డన్ రవి, నేనూ అలాగే చేసేవాడిని' అని డేవిడ్ వ్యాఖ్యానించాడు. కాగా, రెండో రోజు? ఓవర్‌నైట్ స్కోర్ 310/5 రెండో రోజు బ్యాటింగ్ చేసిన భారత్ 587 పరుగులకు ఆలౌటైంది.కెప్టెన్ శుభ్‌మన్ గిల్ డబుల్ సెంచరీతో అలరించాడు. 387 బంతుల్లో 269 పరుగులు చేశాడు. ఓవర్ నైట్ స్కోరు 41తో క్రీజులోకి వచ్చిన రవీంద్ర జడేజా 137 బంతుల్లో 89 పరుగులకే ఔట్? అయ్యాడు. సెంచరీ చేసే ఛాన్స్‌ను మిస్ చేసుకున్నాడు.ఇక గిల్, జడేజా ఆరో వికెట్‌కు 203 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. జడ్డు ఔటైన తర్వాత క్రీజులోకి వచ్చిన వాషింగ్టన్ సుందర్ కూడా ఆకట్టుకున్నాడు. అతడు 103 బంతుల్లో 42 పరుగులతో రాణించాడు. గిల్- సుందర్ జోడీ ఏడో వికెట్‌కు 144 పరుగులు జోడించింది. ఇంగ్లాండ్ బౌలర్లలో షోయబ్ బషీర్ 3, క్రిస్ వోక్స్ 2, జోష్ టంగ్ 2, బ్రైడన్ కార్స్, బెన్ స్టోక్స్, జో రూట్ ఒక్కో వికెట్ పడగొట్టారు. అనంతరం బ్యాటింగ్?కు దిగిన ఇంగ్లాండ్?కు ప్రారంభంలోనే ఎదురు దెబ్బ తగిలింది. బుమ్రా స్థానంలో జట్టులోకి వచ్చిన ఆకాశ్ దీప్ బెన్ డకెట్ (0), ఓలీ పోప్ (0)ను వరుస బంతుల్లో పెవిలియన్ పంపించాడు. ఆ తర్వాత వచ్చిన జాక్ క్రాలీ 19 పరుగులకే ఔట్? అయ్యాడు. క్రాలీని సిరాజ్ ఔట్ చేశాడు. ఈ క్రమంలో జో రూట్, హ్యారీ బ్రూక్ నిలకడగా ఆడి మరో వికెట్ పడకుండా చూసుకున్నారు. ప్రస్తుతం రూట్ 37 బంతుల్లో 18 పరగులు, హ్యారీ బుక్ 53 బంతుల్లో 30 పరుగుల చేసి క్రీజులో ఉన్నారు.

# బౌలింగ్‌తోనూ అందరినీ ఆశ్చర్యపరుస్తున్న ఇషాన్ కిషన్

భారత వికెట్ కీపర్ ఇషాన్ కిషన్ ప్రస్తుతం ఇంగ్లాండ్‌లో కౌంటీ ఛాంపియన్‌షిప్‌లో నాటింగ్‌హామ్‌షైర్ తరపున దుమ్మురేపుతున్నాడు. కేవలం తన బ్యాటింగ్‌తోనే కాదు, అప్పుడప్పుడు బౌలింగ్‌తోనూ అందరినీ ఆశ్చర్యపరుస్తున్నాడు. ఇటీవల సోమర్‌సెట్‌తో జరిగిన మ్యాచ్‌లో ఇషాన్, భారత దిగ్గజ స్పిన్ బౌలర్ హర్భజన్ సింగ్, దివంగత ఆస్ట్రేలియా లెగ్ స్పిన్నర్ షేన్ వార్న్ బౌలింగ్ యాక్షన్‌లను అనుకరించి బౌలింగ్ చేశాడు. అందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. ఇషాన్ కిషన్ కౌంటీ ఛాంపియన్‌షిప్‌లో ఇప్పటివరకు రెండు మ్యాచ్‌లు ఆడాడు. ఈ రెండింటిలోనూ అద్భుతంగా ఆడాడు. యార్క్‌షైర్‌పై 87 పరుగులు చేసి మెరిసిన ఇషాన్ సోమర్‌సెట్‌తో జరిగిన మ్యాచ్‌లో 77 పరుగులు సాధించాడు. ఈ మ్యాచ్‌లో సెంచరీ తృటిలో మిస్ అయినా జట్టుకు కీలక పరుగులు అందించాడు. ఈ ప్రదర్శనలు టీమిండియాలో అతని స్థానాన్ని మరింత పటిష్టం చేస్తాయని క్రికెట్ విశ్లేషకులు భావిస్తున్నారు. సాధారణంగా వికెట్ కీపర్‌గా, బ్యాటర్‌గా పేరున్న ఇషాన్ కిషన్ బౌలింగ్ చేయడం అందరినీ ఆశ్చర్యపరిచింది. ఇది 2014లో ఎంఎస్ ధోనీ న్యూజిలాండ్‌తో జరిగిన టెస్టులో కొద్దిసేపు వికెట్ కీపింగ్ నుండి తప్పుకొని బౌలింగ్ చేసిన సందర్భాన్ని గుర్తు చేసింది. సోమర్‌సెట్‌తో జరిగిన వర్షం అంతరాయం కలిగించిన డ్రా మ్యాచ్‌లో ఇషాన్ తనలోని మరో కోణాన్ని చూపించాడు. అనూహ్యంగా అతనికి బౌలింగ్ చేసే అవకాశం వచ్చింది. ఇషాన్ ఈ అవకాశాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకున్నాడు. తన ఓవర్‌లో ఆఫ్-స్పిన్, లెగ్-స్పిన్ రెండింటినీ ప్రయత్నించాడు. చివరికి రౌండ్ ది వికెట్‌కు కూడా మారాడు. ఓవర్‌ను హర్భజన్ సింగ్ బౌలింగ్ యాక్షన్‌ను ఇమిటేట్ చేస్తూ ప్రారంభించాడు. ఆ తర్వాత లెగ్-స్పిన్నర్ వేసేటప్పుడు దివంగత క్రికెటర్ షేన్ వార్న్ యాక్షన్‌ను అనుకరించాడు. ఇందుకు క్లిప్‌ను అధికారిక కౌంటీ ఛాంపియన్‌షిప్ సోషల్ మీడియా హ్యాండిల్ షేర్ చేసింది. ఇషాన్ ఈ ఓవర్‌లో కేవలం ఒక పరుగు మాత్రమే ఇచ్చి తన బౌలింగ్ టాలెంట్ కూడా చూపించాడు. ఇషాన్ కిషన్ చివరిసారిగా జూలై 2023లో వెస్టిండీస్ పర్యటనలో భారత్ తరపున టెస్ట్ మ్యాచ్ ఆడాడు. 2025 ఐపీఎల్ సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ తరపున ఆడిన ఇషాన్ 14 మ్యాచ్‌లలో 354 పరుగులు సాధించాడు.






# చరిత్ర సృష్టించిన జెమీ స్మిత్

ఇంగ్లండ్ వికెట్ కీపర్ జెమీ స్మిత్ చరిత్ర సృష్టించాడు. 14 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత భారత జట్టుపై సెంచరీ సాధించిన ఇంగ్లండ్ వికెట్ కీపర్‌గా నిలిచాడు. ఐదు టెస్ట్‌ల అండర్సన్-సచిన్ ట్రోఫీలో భాగంగా ఎడ్జ్‌బాస్టన్ వేదికగా జరుగుతున్న రెండో టెస్ట్ తొలి ఇన్నింగ్స్‌లో జెమీ స్మిత్ సెంచరీ సాధించాడు. వన్డే తరహా బ్యాటింగ్‌తో చెలరేగిన జెమీ స్మిత్.. మూడో రోజు ఆటలో లంచ్ సెషన్‌కు ముందు జడేజా ఓవర్‌లో రెండు బౌండరీలు బాది 80 బంతుల్లో సెంచరీ మార్క్ అందుకున్నాడు. ఈ శతకంతో జెమీ స్మిత్ పలు రికార్డులను తన పేరిట లిఖించుకున్నాడు. 14 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత భారత్‌పై టెస్ట్ సెంచరీ బాదిన ఇంగ్లండ్ వికెట్ కీపర్ జెమీ స్మిత్ నిలిచాడు. 2011లో లార్డ్స్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో వికెట్ కీపర్ మ్యాట్ ప్రియర్(103 నాటౌట్) చివరిసారిగా భారత్‌పై శతకం సాధించాడు. ఇప్పటి వరకు భారత్‌పై నలుగురు ఇంగ్లండ్ వికెట్ కీపర్లు మాత్రమే టెస్ట్ సెంచరీలు నమోదు చేశారు. 1952లో లార్డ్స్ వేదికగా జరిగిన మ్యాచ్‌లో ఇంగ్లండ్ వికెట్ కీపర్‌గా గాడ్‌ఫ్రె ఇవాన్స్(104) భారత్‌పై శతకం సాధించగా.. 1996లో లార్డ్స్‌లోనే జాక్ రస్సెల్(124) సెంచరీ సాధించాడు.ఇంగ్లండ్ తరఫున టెస్ట్‌ల్లో అత్యంత వేగంగా సెంచరీ బాదిన నాలుగో బ్యాటర్‌గా జెమీస్మిత్ నిలిచాడు. ఈ క్రమంలో అతను హ్యారీ బ్రూక్ రికార్డ్‌ను సమం చేశాడు. ఈ జాబితాలో గిల్బర్ట్ జెస్సాప్ అగ్రస్థానంలో ఉన్నాడు. 1902లో ఆస్ట్రేలియాతో జరిగిన మ్యాచ్‌లో అతను 76 బంతుల్లో సెంచరీ సాధించాడు. 2002లో న్యూజిలాండ్‌పై జానీ బెయిర్ స్టో 77 బంతుల్లో, 2022లో పాకిస్థాన్‌పై హ్యారీ బ్రూక్ 80 బంతుల్లో సెంచరీ సాధించారు. 2015లో న్యూజిలాండ్‌పై బెన్ స్టోక్స్ 85 బంతుల్లో సెంచరీ నమోదు చేశాడు.77/3 ఓవర్‌నైట్ స్కోర్‌తో మూడో రోజు ఆటను ప్రారంభించిన ఇంగ్లండ్‌కు ఆదిలోనే గట్టి షాక్ తగింది. మహమ్మద్ సిరాజ్ బౌలింగ్‌లో జోరూట్(22), బెన్ స్టోక్స్(0) వరుస బంతుల్లో పెవిలియన్ చేరారు. ఈ ఆరంభాన్ని భారత బౌలర్లు అందిపుచ్చుకోలేకపోయారు. ముఖ్యంగా ప్రసిధ్ కృష్ణ పేలవ బౌలింగ్‌తో టీమిండియాకు నష్టం చేశాడు. క్రీజులో సెట్ అయిన హ్యారీ బ్రూక్, బెన్ స్టోక్స్.. దూకుడుగా బ్యాటింగ్ చేశారు. భారత బౌలర్లను చెడుగుడు ఆడారు. దాంతో ఇంగ్లండ్ 249/5 స్కోర్‌తో లంచ్ బ్రేక్‌కు వెళ్లింది. తొలి సెషన్‌లో ఇంగ్లండ్ 27 ఓవర్లలో 172 పరుగులు చేసింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 587 పరుగుల భారీ స్కోర్ చేసింది.

# అనుష్క ఘాటీ మూవీ విడుదలకు సమస్యలు

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ అనుష్క శెట్టి ప్రధాన పాత్రలో నటిస్తున్న భారీ బడ్జెట్ చిత్రం 'ఘాటీ' విడుదల మరోసారి వాయిదా పడే సూచనలు మళ్లీ కనిపిస్తున్నాయి. గతంలో 'వేదం' వంటి విజయవంతమైన చిత్రాన్ని అందించిన క్రిష్ జాగర్లమూడి దర్శకత్వంలో అనుష్క నటిస్తున్న ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్న విషయం తెలిసిందే. యూవీ క్రియేషన్స్ సమర్పణలో, రాజీవ్ రెడ్డి, సాయిబాబా నిర్మిస్తున్న ఈ చిత్రం నుండి విడుదలైన గ్లింప్స్ ఇప్పటికే ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. అయితే ఈ చిత్రాన్ని మొదట ఏప్రిల్ 18న విడుదల చేయడానికి సన్నాహాలు చేశారు. కానీ షూటింగ్ ఆలస్యం కావడంతో విడుదల వాయిదా పడింది. ఆ తర్వాత, మేకర్స్ అధికారికంగా జులై 11న సినిమాను విడుదల చేస్తామని ప్రకటించారు. అందుకు తగ్గట్టుగానే షూటింగ్ కూడా పూర్తి చేశారు. అయితే, తాజా సమాచారం ప్రకారం, సినిమాకు సంబంధించిన సీజీ (కంప్యూటర్ గ్రాఫిక్స్) పనులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని, విడుదల తేదీ లోపు అవి పూర్తయ్యే అవకాశం లేదని తెలుస్తోంది. దీంతో, 'ఘాటీ' విడుదల మరోసారి వాయిదా పడే అవకాశం ఉందని.. దీనికి సంబంధించి అధికారిక ప్రకటన త్వరలోనే వెలువడనుందని యూనిట్ వర్గాలు వెల్లడించాయి. భారీ బ్జడెట్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమాకు కొత్త విడుదల తేదీగా ఆగస్టు 27ను నిర్మాతలు పరిశీలిస్తున్నట్లు సమాచారం. అనుష్క అభిమానులు 'ఘాటీ' కోసం ఆసక్తిగా ఎదురుచూస్తుండగా, సినిమా విడుదల ఎప్పుడు జరుగుతుందో వేచి చూడాలి.








## హరిహర వీరమల్లు ట్రైలర్ అదుర్స్

### 24 గంటల్లో 48 మిలియన్ల వ్యూస్

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ప్రధాన పాత్రలో రూపొందుతున్న పీరియాడిక్ యాక్షన్ అడ్వెంచర్ చిత్రం 'హరిహర వీరమల్లు'. ఈ మూవీ జూలై 24న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానున్న నేపథ్యంలో ఈ సినిమా ప్రమోషన్స్ జోరుగా సాగుతున్నాయి. ఈ మూవీ ట్రైలర్ విడుదల కాగా, ప్రేక్షకుల నుంచి అపూర్వ స్పందన లభించింది. కేవలం 24 గంటల్లోనే తెలుగు ట్రైలర్‌కు 48 మిలియన్లకు పైగా వ్యూస్ వచ్చాయి. ఇది ఆల్‌టైమ్ రికార్డుగా నిలిచింది. అంతేకాదు, అన్ని భాషల్లో కలిపి ట్రైలర్‌కు 61.7 మిలియన్ల వ్యూస్ వచ్చాయని చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. గణాంకాల నేపథ్యంలో చిత్ర బృందం ఒక ఆసక్తికర కామెంట్ చేసింది. 'ఇది సాధారణ రికార్డ్ కాదు, భవిష్యత్తులో వచ్చే సినిమాలన్నింటికీ ఇది ఒక హెచ్చరిక. అంటూ రాసుకొచ్చారు. మరోవైపు ఇది పుష్ప2 రికార్డ్ కూడా బ్రేక్ చేసిందని అంటున్నారు. ఇప్పటి వరకు సౌత్ ఇండియాలో విడుదలైన 24 గంటలలో 44.67 మిలియన్ వ్యూస్ సాధించిన పుష్ప 2 సాధించింది. ఇప్పుడు దానిని హరిహర వీరమల్లు బ్రేక్ చేసింది. కేవలం 23 గంటల్లోనే 47 మిలియన్స్ వ్యూస్ సాధించి పుష్ప2 రికార్డ్ బ్రేక్ చేసిందని అంటున్నారు. ఈ రికార్డులతో పవన్ అభిమానుల ఆనందం అంతా ఇంతా కాదు. ఈ చిత్రంలో నిధి అగర్వాల్ కథానాయికగా నటిస్తుండగా, బాబీ డియోల్, అనుపమ్ ఖేర్, సత్యరాజ్ వంటి ప్రముఖులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. 17వ శతాబ్దం ముస్లిం పాలన సమయంలో పవన్ కళ్యాణ్ ఓ వీరుడిగా, ప్రజా పరిరక్షణ కోసం పోరాడే పాత్రలో కనిపించనున్నారు. ఇందులో ఆయన పాత్ర శౌర్యం, తెలివి, ధైర్యం మేళవింపుతో ఉంటుందని తెలుస్తోంది.ఈ చిత్రాన్ని మెగా సూర్య ప్రొడక్షన్స్ పతాకంపై ఎ.దయాకర్ రావు నిర్మిస్తున్నారు. ఎ.ఎం. రత్నం సమర్పణలో ఈ సినిమా రూపొందుతోంది. మొదట దర్శకుడు క్రిష్ ఈ చిత్రాన్ని రూపొందించగా, మధ్యలో కొన్ని అనివార్య కారణాల వల్ల ప్రాజెక్ట్ నుంచి తప్పుకున్నారు. ఆ తర్వాత మిగిలిన భాగాన్ని రత్నం కుమారుడు జ్యోతి కృష్ణ పూర్తి చేశారు.

## గ్రామీణ నేపథ్యంలో సాగే ..ఉప్పు కప్పురంబు

ఒకవైపు సినిమాలు చేస్తునే మరోవైపు ఓటీటీలకు ఒకే చెబుతుంది నటి కీర్తి సురేష్. ఇప్పటికే అక్క అనే వెబ్ సిరీస్ చేస్తున్న ఈ అమ్మడు మరోవైపు ఉప్పు కప్పురంబు అంటూ ఒక ఓటీటీ సినిమా చేసింది. ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్‌లో ఈ చిత్రం నేరుగా ఈరోజు ప్రేక్షకుల ముందుకు రాగా ఈ చిత్రానికి ఐవీ శశి దర్శకత్వం వహించాడు. నటుడు సుహాస్ కీలక పాత్రలో నటించాడు. సినిమా కథ మొత్తం చిట్టి జయపురం అనే ఊరి చుట్టూ తిరుగుతుంది. తన తండ్రి మరణంతో చిట్టి జయపురం ఊరి పెద్దగా బాధ్యతలు తీసుకుంటుంది అపూర్వ (కీర్తి సురేశ్). అయితే అపూర్వకి ఇది సంతోషం ఇచ్చేలోపే ఊరికి విచిత్రమైన సమస్య వస్తుంది. ఊరిలో శ్మశానం కొరత ఎదురవుతుంది. ఆ ఊరిలో మొదటగా చనిపోయిన నలుగురికి మాత్రమే శ్మశానంలో చోటు ఉంటుంది. దీంతో ఈ విషయాన్ని ఊరి పెద్ద అయిన అపూర్వ ముందుకు తీసుకువెళతాడు కాటికాపరి చిన్న (సుహాస్). ఈ విషయం తెలిసిన అపూర్వ ఊరి కోసం ఏం చేసింది. అపూర్వకి కాటికాపరి చిన్న ఎలా సహాయపడ్డాడు. శ్మశానం సమస్య ళ్లో ఎలాంటి చిచ్చు పెట్టిందనేది ఈ సినిమా కథ. యువ దర్శకులు ఈ మధ్య కొత్త కొత్త కథలతో ప్రేక్షకుల ముందుకు వస్తున్న విషయం తెలిసిందే. తాజాగా ఇలాంటి మరో కొత్త కథనే ఈ చిత్రం. చనిపోయిన తర్వాత శ్మశానం కొరత అనే సామాజిక సమస్యను వినోదంతో మేళవించి తెరకెక్కించే ప్రయత్నంలో దర్శకుడు ఐవీ శశి కొంతవరకు సఫలమయ్యారు. కీర్తి విషయానికి వస్తే.. ఇప్పటివరకు గ్లామర్, డీ–గ్లామర్ పాత్రలతో ఆకట్టుకున్న ఈ భామ చాలా రోజుల తర్వాత ప్రత్యేకమైన పాత్రలో నటించింది. అపూర్వ అనే గ్రామ పెద్దగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఆమెకు శ్మశానం సమస్య ఎదురవ్వడం. ఈ సమస్యను తాత్కాలికంగా పరిష్కరించా మని అనుకునేలోపు నలుగురు చనిపోవడంతో అది మరింత తీవ్రమవ్వడం ఆసక్తికరంగా సాగుతుంది. అలాగే ఈ సినిమాలో దర్శకుడు శ్మశానం చుట్టూ ఉన్న సమస్యలు, వాటి పరిష్కారాలను చూపించారు.కీర్తి సురేష్ గ్రామ పెద్దగా బాగా నటించినప్పటికీ, ఆమె పాత్రలో కొన్ని తికమక పెట్టే సన్నివేశాలున్నాయి. ఒక సీన్‌లో అమాయకంగా కనిపించిన కీర్తి, మరో సీన్‌లో చాలా తెలివైన అమ్మాయిగా వ్యవహరించడం లాజికల్‌గా అనిపించదు. కొన్ని సీన్లలో ఆమె అతిగా స్పందించినట్లు కూడా అనిపిస్తుంది. అయితే కీర్తి నటన మాత్రం చాలా బాగుంది. సుహాస్ పాత్ర చాలా స్థిరంగా, ఎక్కడా తడబాటు లేకుండా ఉంటుంది. సినిమా మొత్తం ఎక్కువగా సుహాస్, కీర్తిల మధ్యే సాగుతుంది. కథలో అక్కడక్కడా చిన్న లోటుపాట్లు ఉన్నప్పటికీ, ఈ సినిమా ప్రేక్షకులను ఆలోచింపజేస్తుంది.




## భారీ స్థాయిలో విడుదలకు వార్-2 సిద్ధం

యంగ్ టైగర్ ఎన్టీఆర్ భారీ మల్టీస్టారర్ వార్ 2. బాలీవుడ్ స్టార్ హీరో హృతిక్ రోషన్ తో కలిసి నటిస్తున్నాడుర్. ఇప్పటికే రిలీజ్ అయిన పోస్టర్స్, గ్లిమ్స్ సినిమాపై అంచనాలు భారీగా పెంచేశాయి. కియారా అద్వానీ హీరోయిన్ గా నటిస్తోంది. బాలీవుడ్ బడా నిర్మాణ సంస్థ యష్ రాజ్ ఫిల్మ్స్ నిర్మిస్తుండగా అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ భారీ బ్జడెట్ చిత్రం ఏడాది ఆగస్టు 14 న ఈ సినిమా వరల్డ్ వైడ్ రిలీజ్ కానుంది. అయితే ఈ సినిమా రిలీజ్ కు భారీ ఏర్పాట్లు చేస్తుంది యష్ రాజ్ ఫిల్మ్స్. ఇండియన్ సినిమా హిస్టరీలోనే జరగనటువంటి రీతిలో రిలీజ్ కు ఎ÷–లాన్ చేస్తున్నారట. వినిపిస్తున్న సమాచారం ప్రకారం వార్2 ను ఇండియా వైడ్ గా సుమారు 9,000 స్క్రీన్స్ లో రిలీజ్ చేసేలా ఎ÷–లాన్ చేస్తున్నారట. అదే జరిగితే ఇది ఓ హిస్టరీ అనే చెప్పాలి. ఇప్పటి వరకు అత్యధిక స్క్రీన్స్ లో రిలీజ్ అయిన ఇండియాన్ సినిమాల లిస్ట్ లో సూపర్ స్టార్ రజనీకాంత్ నటించిన రోబో 2.క్ష మొత్తం 7,500 స్క్రీన్స్ పేరిట ఉంది. ఇప్పుడు దాన్ని బీట్ చేయబోతుంది వార్ 2. ఇటు తెలుగు స్టేట్స్ లోను వార్ 2 రిలీజ్ కు భారీ ఏర్పాట్లు జారుతున్నాయి. ఈ సినిమా రైట్స్ ను సితార నాగవంశీ రూ. 90 కోట్లకు కొనుగోలు చేసారు. ఇంతటి భారీ అంచనాల మధ్య విడుదలవుతున్న వార్ 2 ఎంతటి సంచలనాలు సృష్టిస్తుందో చూడాలి.




EDITED, PRINTED AND PUBLISHED BY FAISAL KHAN PRINTED AT UJALA PRESS, LIG, 211 APHB COLONY ADILABAD, TELANGANA.
PUBLISHED FROM H.NO.4-4-120/C/3, SANJAY NAGAR COLONY, ADILABAD, TELANGANA STATE. EDITOR : FAISAL KHAN, RNI : APTEL/2013/53323, CELL : 94400 62685